చదవండి... చదివించండి... 1952
విశాలాంధ్ర
జాతీయ తెలుగు దినపత్రిక
చందా వివరాలు
సంవత్సరం చందా రూ. 1300/-లు
అర్ధ సంవత్సరం చందా రూ. 650/-లు
3 నెలల చందా రూ. 325/-లు
విడి పత్రిక రూ. 4/-లు
ఆదివారం రూ. 5/-లు
వివరములకు సంప్రదించండి 7995009615

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20

అక్షరాక్షరం అభ్యుదయం

కపిల్ చిట్స్‌తో బంధం ఆనందాల అనుబంధం
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
39 YEARS Safeguarding Trust
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

సంపుటి : 68 | సంచిక : 225 | గురువారం 07-02-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

జీశాట్-31 సక్సెస్

ఇస్రో 40వ సమాచార ఉపగ్రహం

- 2,535 కిలోల బరువు
- ఫ్రెంచ్ గయానా నుంచి ప్రయోగం
- కక్ష్యలోని కొన్ని ఉపగ్రహాలకు సేవల కొనసాగింపు
- వీశాట్, డిజిటల్ ఉపగ్రహ వార్తా సేకరణ, డీటీహెచ్-టెలివిజన్ సేవలు



న్యూఢిల్లీ : భారత తాజా సమాచార ఉపగ్రహం జీశాట్-31 విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ఏడాది భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) చేపట్టిన మూడవ విజయవంతమైన మిషన్ ఇది. దక్షిణ అమెరికా ఈశాన్య తీరంలోని ఫ్రెంచ్ భూభాగం కౌరూలోని అరియాన్ లాంచ్ కాంప్లెక్స్ నుంచి బుధవారం తెల్లవారుజామున జీశాట్-31ను ప్రయోగించారు. ఇది 42 నిమిషాల్లోనే కక్ష్యలోకి ప్రవేశించింది. ప్రయోగం అనంతరం ఇస్రోకు చెందిన సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(ఎస్‌డీఎస్‌సీ) డైరెక్టర్ ఎస్.పాండియన్ మాట్లాడుతూ '2019లో ఇస్రో చేపట్టిన మూడవ మిషన్ ఇది. జీశాట్-31 అంతరిక్ష

- మిగతా 2 లో



ధర్నాలో ప్రసంగిస్తున్న ఓబులేసు. వేదికపై రవీంద్రనాథ్, చలసాని రామారావు, వెంకట సుబ్బయ్య, పడాలి రమణ, తదితరులు

సంక్షేమ బోర్డు కోసం

మహోద్యమం

విజయవాడ మహాధర్నాలో వీధి విక్రయదారులు , హమాలీ, ఆటో కార్మికుల హెచ్చరిక



హాజరైన విక్రయదారులు, హమాలీలు, ఆటో కార్మికులు తదితరులు

- అసంఘటిత కార్మికులపై చిన్నచూపు : ఓబులేసు
- రూ.7వేల పింఛన్ ఇవ్వాలి : రవీంద్రనాథ్
- 28న కలెక్టరేట్ల ముట్టడి : చలసాని రామారావు

సుమారు 50 లక్షలకు పైగా కష్టజీవులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. ఏఐటీయూసీ నేతృత్వంలో... హమాలీలు, ఆటో వర్కర్లు, వీధి విక్రయదారులు.. .ఏకమయ్యారు. సర్కారు దుర్నీతిపై సమర భేరీ మోగించారు. తక్షణమే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని నినదించారు. మోసపూరిత పథకాలతో సర్కారు మభ్య పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు ఏపీ సర్కారును తూర్పారబట్టారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం మహోద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు.

3లో

నిందితుల రక్షణకే..

- మోడీ, మమత రగడ
- ప్రధానిది రాజకీయ ప్రతీకారం
- రాజకీయ సంక్షోభంపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి
- సురవరం డిమాండు



విశాలాంధ్ర, హైదరాబాద్ బ్యూరో : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఘర్షణవైఖరి వల్ల పశ్చిమబెంగాల్‌లో రాజ్యాంగ సంక్షోభం నెల కొందని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి విమర్శించారు. శారద చిట్‌ఫండ్ కుంభకోణం నిందితులను రక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాపత్రయపడుతున్నాయని వ్యాఖ్యానించారు. శారద, రజోబలి కుంభకోణాలు అతిపెద్దవని, రూ.17500కోట్లు మింగేశారని ఆయన తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డితో కలిసి సురవరం మాట్లాడారు. మూడు, నాలుగు రోజు లుగా బెంగాల్‌లో జరుగుతున్న పరిణామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలన్నారు. బెంగాల్ రాజకీయ సంక్షోభానికి తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. శారద, రజోబలి కుంభకోణాలపై విచారణకు సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. అయినా ఎఫ్‌ఐఆర్ నమోదు కాలేదు... ఆస్తులను జప్తు చేయలేదన్నారు. బాధితులను ఆదుకోపోగా, నిందితులకు రక్షణ కల్పించేందుకే సీబీఐ విచారణ సాగిస్తున్నారని ఆరోపించారు. శారదా కుంభకోణంతో సంబంధం ఉన్న తృణమూల్

- మిగతా 2 లో

12 మంది ఐఏఎస్‌ల బదిలీ

- మరో ముగ్గురు ఐపీఎస్‌లు కూడా..
- కృష్ణా కలెక్టర్‌గా ఇంతియాజ్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఏపీలో 12 మంది ఐఏఎస్ అధికారులు, మరో ముగ్గురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు వెలువరించింది. టూరిజం కల్చరల్ విభాగం సెక్రటరీ ముకేష్ కుమార్ మీనాను ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎండీగా నియమించింది. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎండీగా ఉన్న పి.లక్ష్మీనరసింహంను హేండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ విభాగం సెక్రటరీగా నియమించింది. శ్రీనివాస్ శ్రీనరేష్‌కు మైన్స్, ఇండస్ట్రీ కామర్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా పోస్టింగ్ ఇచ్చారు.

పశుసంవర్థక శాఖ సెక్రటరీగా బి.శ్రీధర్‌ను, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ ఎం.రామారావును శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా నియమించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టరుగా ఉన్న కె.ధనుంజయరెడ్డిని ఏపీ టూరిజం అథారిటీ సీఈవోగా బదిలీ చేశారు. కృష్ణాజిల్లా కలెక్టర్‌గా మహ్మద్ ఇంతియాజ్‌ను నియమించారు. ఇక్కడ కలెక్టర్‌గా పని చేస్తోన్న బి.లక్ష్మీకాంతంను తిరుమల తిరుపతి దేవస్థానం జేఈవోగా

- మిగతా 2 లో

వంశధార - బహుదా అనుసంధానం...!



హైలెవల్ కాల్వ నిర్మాణంపై జలవనరులశాఖ అధికారుల సర్వే (ఫైల్)

రూ.6,326.62 కోట్లకు ఆమోదం

- హీరమండలం నుంచి హైలెవల్ కెనాల్
- సాగులోకి 2.75 లక్షల ఎకరాల ఆయకట్టు
- తాగునీటి కోసం ఆరు రిజర్వాయర్లు
- 8.30 టీఎంసీల నీరు నిల్వ సామర్థ్యం
- ఉద్దానం తాగునీటి సమస్యా పరిష్కారం
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

విశాలాంధ్ర బ్యూరో - శ్రీకాకుళం : ఉత్తరాంధ్ర నదుల అనుసంధానంలో (లింకేజ్) ప్రభుత్వం మరో అడుగు వేసింది. వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాలో వంశధార - బహుదా నదుల అనుసంధానానికి మార్గం సుగమమైంది. ఈ రెండు నదులను కలుపుతూ హైలెవల్ కాల్వ నిర్మాణానికి రూ.6,326.62 కోట్లకు ప్రభుత్వం పరిపాలనాపరమైన ఆమోదం తెలిపింది. హీరమండలం రిజర్వాయర్ నుంచి ఇచ్ఛాపురం వరకు సుమారు 116 కిలో మీటర్ల పొడవునా నిర్మించనున్న హైలెవల్ కాల్వ వల్ల 2.75 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సమస్య తీరనుంది. ఫ్లోరైడ్ సమస్య తాండవిస్తున్న ఉద్దానంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఈ కాల్వ దోహదపడనుంది. ఎంతో ప్రతిష్టాత్మకమైన వంశధార - బహుదా నదుల లింకేజీకి రూ. 6,326.62 కోట్లను మంజూరు చేస్తూ జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హీరమండలం రిజర్వాయర్ నుంచి వంశధార నది మీదగా ఇచ్ఛాపురం వరకు కాల్వను నిర్మించనున్నారు. దీనివల్ల శ్రీకాకుళం జిల్లాలోని కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లోని 90 వేల ఎకరాలను కొత్తగా సాగులోకి తెచ్చే అవకాశం ఉంది. మరో 1.10 లక్షల ఎకరాల స్థిరీకరణకు ఉపయోగపడుతుంది. ఆయా

- మిగతా 2 లో

ఖాకీల పిల్లిమొగ్గలు



- కన్హయపై సాక్ష్యాలు సమర్పించడంలో విఫలం
- సాకులు వెతుకుతున్న పోలీసులు
- ఆగ్రహం వ్యక్తం చేసిన ఢిల్లీ కోర్టు
- 28లోపు చార్జిషీట్ దాఖలుకు అనుమతులు సమర్పించాలని ఆదేశం

న్యూఢిల్లీ : ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు, సీపీఐ నాయకుడు కన్హయకుమార్ తదితరులపై బనాయించిన దేశద్రోహం నేరానికి సంబంధించి సాక్ష్యాలు సమర్పించడంలో ఢిల్లీ పోలీసులు పిల్లి మొగ్గలు వేస్తున్నారు. ఢిల్లీలోని న్యాయస్థానం ఆధారాలు సమర్పించమనడంతో సాకులు వెతుకుతున్నారు. కన్హయ కుమార్, ఇతరులపై 2016లో దేశద్రోహం నేరం మోపారు. ఇందుకు సంబంధించి గత నెలలో చార్జిషీట్ దాఖలు చేశారు. దీనిపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. మూడేళ్ల తరువాత చార్జిషీట్ దాఖలు చేయడానికి సంబంధించి అనుమతులు సమర్పించాలని ఢిల్లీ పోలీసులకు న్యాయస్థానం సూచించింది. దేశద్రోహం నేరంపై కన్హయకుమార్, ఇతరులను శిక్షించేందుకు అవసరమైన అనుమతులను ఫిబ్రవరి 28నాటికి సమర్పించాలని ఢిల్లీ హైకోర్టు బుధవారం ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. అనుమతులను త్వరగా అందజేయాలని

- మిగతా 2 లో

ఇదీ లోకం!



మాది పేదల పక్షం

పేదరిక నిర్మూలన, కరవు రహిత రాష్ట్రమే లక్ష్యం

- పంచ నదుల అనుసంధానం మా కర్తవ్యం
- కేంద్రం సహకరించకున్నా అద్భుత ప్రగతి సాధించాం
- ప్రతిపక్షం ఘోర వైఫల్యం
- రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేందుకు ముగ్గురు మోడీల కుట్ర
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ' మాది పేదల పక్షం. పేదరికం నిర్మూలన మా లక్ష్యం. అందుకే వారి జీవన ప్రమాణస్థాయి పెంపుకోసం దేశంలో ఎక్కడాలేనన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నాం. నా 40 ఏళ్ల రాజకీయ జీవిత చరిత్రలో ఈ నాలుగున్నరేళ్లలో పొందినంత ఆనందం, తృప్తి మర్చిపోలేను. ఒకపక్క రాష్ట్రాభివృద్ధి, మరోపక్క అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేశాం. ఏపీ ప్రభుత్వానికి వచ్చిన 670 అవార్డులే ఇందుకు నిదర్శనం. అయితే కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించి ఉంటే మరింత అద్భుత ప్రగతిని చూపించేవాళ్లం' అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు.

అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో భాగంగా ముఖ్యమంత్రి దాదాపు రెండు గంటల పాటు సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించడం కోసం ఒక పక్క సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, మరో పక్క వారి భాగస్వామ్యంతో జలసిరి, నీరు-మీరు, ఏరువాక, వనం-మనం, కార్తీక వనసమారాధన, సంక్రాంతి సంబరాలు వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. దీనివల్ల ప్రజల్లో సంతృప్తి శాతం

- మిగతా 2 లో

మోడీపై యువభేరీ..

కాషాయీకరణకు వ్యతిరేకంగా నేడు హస్తినలో భారీ ర్యాలీ

ఫైల్



మోడీ సర్కారుపై యువత శంఖారావం పూరించనుంది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల ఊసే లేదు. పైపెచ్చు విద్యాసంస్థల కాషాయీకరణకు కుయుక్తులు పన్నుతోంది. వయస్సు మీరుతున్నా, ఉద్యోగాలు వచ్చే అవకాశాలు కనుచూపు మేరలో కనిపించటం లేదు. అందుకే యువత రోడ్డెక్కుతోంది. తమ సమస్యలను సభ్య సమాజం దృష్టికి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. 'యువత ఎదుర్కొనే ఇబ్బందులే నేడు ప్రజా సమస్యలుగా మారాయి' అన్న సామాజికవేత్త సీ రైట్ మిల్స్ వ్యాఖ్యలను గుర్తు తెచ్చేలా 'ది యంగ్ ఇండియా అధికార్ మార్చ్' ఢిల్లీలో గురువారం కదం తొక్కనుంది.

11లో



ప్రియాంక బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సోదరి ప్రియాంక గాంధీ బుధవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంత పార్టీ వ్యవహారాలనూ ఆమె చూసుకోనున్నారు. ప్రియాంకను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా, ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంత ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్లు రాహుల్‌గాంధీ జనవరి 23న ప్రకటించారు. ఢిల్లీ అక్బర్ రోడ్డులోని కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం రాహుల్ ఆఫీసురూమ్ పక్కనే ప్రియాంకకు గదిని కేటాయించారు. పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టకముందు రాహుల్ ఈ గది నుంచే పనిచేసేవారు. లోక్‌సభ ఎన్నికల కోసం కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకుగాను వివిధ రాష్ట్రాల పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జిలతో రాహుల్ గురువారం నిర్వహించనున్న సమావేశానికి ప్రియాంక అధికారికంగా

- మిగతా 2 లో

అంతర్యుద్ధాన్ని నివారించాలి

అంతర్జాతీయ సమాజానికి మదురో విజ్ఞప్తి



కారకాస్ : దేశంలో అంతర్యుద్ధాన్ని నివారించాలని వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేశారు. అంతర్యుద్ధాన్ని అమెరికా రెచ్చగొడుతున్నదని, ఇంతవరకు దేశంలో ఆర్థిక పరిస్థితులను తల్లకిందులు చేసింది చాలక ఇప్పుడు సైనిక చర్య అని మాట్లాడుతున్నదని మదురో అన్నారు. తాజాగా దేశ ప్రజలనుద్దేశించి టెలివిజన్‌లో మాట్లాడుతూ విప్లవయోధులు చేగువేర, ఫిడెల్ కాస్ట్రో, హ్యూగోఛావెజ్‌లాంటి నేతలు వెనిజులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని, ఆ స్ఫూర్తితోనే దేశానికి స్వాతంత్ర్యం తెచ్చుకున్నామని మదురో అన్నారు. అధ్యక్ష పదవికి ఎన్నికలు జరపాలన్న డిమాండ్‌ను ఆయన తిరస్కరించారు. ప్రతిపక్షాలతో చర్చలు జరిపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మరోసారి చెప్పారు. విదేశీ దురాక్రమణను సహించేదిలేదని అన్నారు. తనను తాను అధ్యక్షుడిగా ప్రకటించుకున్న జాన్‌గుయిడొ ప్రమాదకరమైన క్రీడను ఆడుతున్నారని, దేశంలో ఇది అంతర్యుద్ధానికి దారి తీస్తుందని మదురో హెచ్చరించారు. అమెరికా పతాకాలను పట్టుకొని తిరుగుతున్నవారు దేశంలో సైనిక జోక్యానికి విజ్ఞప్తి చేస్తున్నారని, వారు దేనికోసం విజ్ఞప్తి చేస్తున్నారో తెలిసే వ్యవహరిస్తున్నారా? అని ప్రశ్నించారు. వెనిజులాకు తీవ్ర నష్టం కలిగిస్తారని ఆయన అన్నారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాన్‌బోల్టన్ 5వేల మంది సైన్యాన్ని కొలంబియాకు పంపుతున్నట్టుగా ఇంతకుముందే తెలియజేశారు. సైనిక చర్య అనేది తమముందున్న ఒక మార్గమని ట్రంప్ కూడా చెప్పారు. అమెరికా దాడి ముప్పు నేపథ్యంలో శక్తివంతమైన సంఘీభావం తెలియజేయవలసిందిగా మదురో విజ్ఞప్తి చేశారు. అధ్యక్ష పదవికి జరిగిన పోటీలో మదురో 68 శాతం ఓట్లను పొంది విజయం సాధించారు. ఎన్నికల నిర్వహణలో 150 మంది అంతర్జాతీయ పరిశీలకులు పాలు పంచుకున్నారు.

వెనిజుల బంగారం వెనక్కి

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లోవున్న వెనిజులా బంగారాన్ని తిరిగి మదురో ప్రభుత్వానికి పంపాలని, ప్రభుత్వ అనుకూలురు డిమాండ్ చేస్తున్నారు. వెనిజులకు సంఘీభావంగా బ్యాంకు ముందు ప్రదర్శన జరిపారు.

బ్యాంకులో ఉన్న బంగారాన్ని తిరిగి తనకు పంపించవలసిందిగా బ్రిటన్ ప్రధాని థెరిసాకు వెనిజుల అధ్యక్ష భవనం లేఖరాసింది. ప్రభుత్వ రక్షణకుగాను ఈ బంగారాన్ని తిరిగి తమకు పంపించాలని ఆ లేఖలో ప్రభుత్వం కోరింది. దాదాపు 31 టన్నుల బంగారం బ్రిటన్ వెనిజులకు తిరిగి పంపనున్నది.

పాక్‌లో గిలానీపై ఆంక్షలు



లాహోర్ : పాకిస్తాన్ మాజీ ప్రధాని యూసఫ్‌రజాగిలాని విదేశాలకు వెళ్లకుండా ఆంక్షలు విధించారు. మంగళవారం రాత్రి ఆయన లాహోర్ విమానాశ్రయానికి చేరుకొని ఇతర దేశాలకు వెళ్లేందుకు సిద్ధపడగా భద్రతా అధికారులు ఆయనను నిలిపివేశారు. గిలాని బ్యాంకాక్‌మీదుగా దక్షిణకొరియాకు విమానంలో వెళ్లేందుకు సిద్ధమయ్యారని ఫెడరల్ దర్యాప్తు ఏజెన్సీ తెలియజేసింది. దక్షిణకొరియాలో ఒక సదస్సుకు హాజరయ్యేందుకు వెళుతున్నట్టుగా గిలాని పేర్కొన్నారు. ఆయన పేరు ప్రయాణీకుల జాబితాలో లేనందును నిలిపివేసినట్టు అధికారులు తెలిపారు. ఆయన పేరును బ్లాక్ లిస్టులో పెట్టినట్టుగా ఇమిగ్రేషన్ కౌంటర్‌లో అధికారులు గిలానీకి చెప్పారు. హోంమంత్రిత్వశాఖ ఆదేశాల మేరకే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఆయనపైన ఉన్న అన్ని కేసుల విచారణకు గిలాని హాజరవుతుండగా విదేశీ పర్యటనకు వెళ్లకుండా నిరోధించడంపై పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. తన పేరును బ్లాక్‌లిస్టులో పెట్టటానికి ఎలాంటి ఆధారాలు లేవని గిలాని వ్యాఖ్యానించారు.



వియత్నాంలో 27, 28 తేదీలలో
ట్రంప్ -కిమ్ భేటీ

వాషింగ్టన్ : ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్‌తో రెండవసారి వియత్నాంలో ఈనెల 27, 28 తేదీలలో భేటీ కానున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఆయన మంగళవారం రాత్రి దేశ ప్రజలనుద్దేశించి జరిపిన వార్షిక ప్రసంగంలో ఈ అంశాన్ని వెల్లడించారు. కాంగ్రెస్ ఉభయసభల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొరియా ద్వీపకల్పంలో శాంతిని నెలకొల్పేందుకు చరిత్రాత్మకమైన నూతన దౌత్యాన్ని సాహసంతో కొనసాగిస్తామని చెప్పారు. గత ఏడాది జూన్‌లో కిమ్, ట్రంప్ సింగపూర్‌లో మొదటిసారి సమావేశమై రెండు దేశాల మధ్య నెలకొనివున్న వివాదాస్పద అంశాలపైన చర్చలు జరిపారు. కొన్ని అంశాలపై అస్పష్టమైన ఒడంబడికలు కుదుర్చుకున్నారు. తాను చేయవలసింది ఇంకా ఎంతోవుందని, కిమ్‌తో సంబంధం మంచిదేనని ట్రంప్ అన్నారు. బుధవారం అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి స్టీఫెన్‌బెయ్‌గన్ ఉత్తరకొరియాకు బయలుదేరారు. ఆయన ఆ దేశ అధ్యక్షుడి ప్రతినిధి కిమ్‌హియోక్‌చోల్‌తో సమావేశమవుతారు. సింగపూర్‌లో ఇరుదేశాల నేతలు చేసుకున్న ఒడంబడికపైన చర్చిస్తారు. రెండు దేశాల మధ్య మారిన సంబంధాలు, కొరియా ద్వీపకల్పంలో శాశ్వత శాంతి, అణు నిరాయుధీకరణ, ఉత్తరకొరియా భద్రతకు అమెరికా నిర్దిష్టమైన హామీ తదితర అంశాలు చర్చకు రానున్నాయి.



చట్టబద్ధంగా రండి : అమెరికాకు రావాలనుకుంటే చట్టబద్ధంగా రావాలని ట్రంప్ అన్నారు. అక్రమ వలసలను అనుమతించేది లేదని ట్రంప్ తెలిపారు. తమ దేశ ప్రజల జీవితాలను, ఉద్యోగాలను రక్షించవలసిన కర్తవ్యం తనకు ఉన్నదని, అందువల్ల ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. మెక్సికో సరిహద్దు దేశ భద్రతకు ముప్పు కలిగిస్తుందని, అలాగే అమెరికా పౌరుల సంక్షేమం దెబ్బతింటుందని అన్నారు. అనేక మిలియన్ల వలసకారులు ఇక్కడ నివసిస్తున్నారు. వారంతా నియమ నిబంధనలు పాటించాలి. మా చట్టాలను గౌరవించాలి. చట్టబద్ధంగా దేశంలో ప్రవేశించినవారు మా దేశానికి, సమాజానికి అనేక విధాలుగా సహకరిస్తున్నారు. తమ దేశంలోకి రావాలని, అయితే చట్టబద్ధంగా మాత్రమే రావాలని ఆయన కోరారు. గతంలో కాంగ్రెస్ సభ్యులు అనేకమంది మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి ఓటు చేశారని, అయితే సరైన గోడ ఏనాడూ నిర్మాణంకాలేదని తాను నిర్మిస్తానని అన్నారు. ఈ సమావేశంలో ఆయన 82 నిమిషాలు మాట్లాడారు. తన రాజకీయ ప్రాధాన్యతలను చెప్పారుగాని విధానపరమైన నిర్దిష్ట వివరాలను ఏమీ వెల్లడించలేదు. అక్రమ వలసలు దేశంలో సంక్షోభాన్ని సృష్టిస్తాయని అన్నారు. ఎమర్జన్సీ అయినా విధించి సరిహద్దుల్లో గోడ నిర్మిస్తానని, ఈనెల 15లోపు డెమోక్రాట్లు, రిపబ్లికన్లు రాజీ పరిష్కారం కనుగొనాలని ట్రంప్ సూచించారు. అయితే గోడ నిర్మాణం వృథా వ్యయమని, దానివల్ల ఫలితముండదని డెమోక్రాట్లు భావిస్తున్నారు. అందువల్లే 5.7 బిలియన్ డాలర్లు ఇవ్వాలని ట్రంప్ చేసిన డిమాండ్‌ను కాంగ్రెస్ తిరస్కరించింది. ఆ తరువాత ట్రంప్ తన ప్రభుత్వాన్ని దాదాపు 35 రోజులు మూసివేసి ఆ తరువాత కాంగ్రెస్ చెప్పినట్టుగావిని ప్రభుత్వ మూతకు స్వస్తి పలికారు.

లండన్‌లో మార్క్స్ సమాధి ధ్వంసం



లండన్ : లండన్‌లో కారల్‌మార్క్స్, ఆయన కుటుంబ సభ్యుల స్మారకంగా నిర్మించిన సమాధిని దుండగులు మంగళవారం ధ్వంసం చేశారు. ప్రాచీన మైన విలువైన చిహ్నాన్ని దుండగులు ధ్వంసం చేసినట్టు సమాధి ప్రాంతాన్ని నిర్వహిస్తున్న ఇయాన్‌దుంగవెల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాధిపైన ఉన్న మార్బుల్ శిలాఫలకాన్ని, అలాగే పెలుసుగా వున్న సమాధి ప్రాంతాన్ని ధ్వంసం చేసినట్టు ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రత్యేకించి మార్క్స్ పేరును చెరిపివేయటానికి ప్రయత్నించారు. ఇది ఒక లక్ష్యంతోనే జరిగిన దాడి అని, నిర్వహణ చేస్తున్న ఫ్రెండ్స్ ఆఫ్ ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ దుంగవెల్ పేర్కొన్నారు. మార్క్స్ జర్మనీ నుండి 1849లో లండన్ చేరుకుని ఆ తరువాత తన జీవితాంతం ఇక్కడే నివసించారు. కమ్యూనిస్టు సిద్ధాంత రూపశిల్పి మార్క్స్ 64 ఏళ్ల వయసులో 1883 మార్చి 14న మరణించారు. అనంతరం 12 అడుగుల ఎత్తుగల స్తంభంపై మార్క్స్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ అందించిన ఆర్థిక సహాయంతో 1956లో ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. స్తంభంపైన 1880లో అంటించిన మార్బుల్ ఫలకం దెబ్బతిన్నది. దానిపైన రాసిన అక్షరాలు పాడైపోయాయి. ఆయన సతీమణి మరణించిన తేదీ, అలాగే ఆయన మనవడు హారీలాంగ్‌గుయట్ పేరును కూడా చెరిపివేశారు. మనమడు నాలుగేళ్ల వయసులోనే చనిపోయాడు. మార్క్స్ సమాధిపైన గతంలోనూ దుండగులు దాడిచేసి పాక్షికంగా ధ్వంసం చేశారు.

మయన్మార్‌కు బంగ్లాదేశ్ నిరసన

ఢాకా : మయన్మార్ రఖిన్ రాష్ట్రంనుండి తాజాగా మరికొంతమంది రోహింగ్యా ముస్లింలు తమ దేశంలోకి వలస వచ్చారని, అక్కడి ప్రభుత్వానికి బంగ్లాదేశ్ బుధవారం నిరసన వ్యక్తం చేసింది. రఖిన్ రాష్ట్రంలో ముస్లింలపైన మయన్మార్ సైన్యం దాడులు జరిపి మారణకాండ సృష్టించడంతో 7 లక్షల మందికిపైగా బంగ్లాదేశ్ చేరుకుని తాత్కాలిక శిబిరాలలో తలదాచుకుంటున్నారు. కొత్తగా తమ దేశంలోకి ప్రవేశించిన వారు బౌద్ధులని, అయితే ఇతర గ్రూపులవారు కూడా ఉన్నారని బంగ్లాదేశ్ విదేశాంగశాఖ అధికారి తెలిపారు. దేశంలోకి ప్రవేశిస్తున్న శరణార్థుల సంఖ్య పెరుగుతూనే ఉన్నదని, పేరు చెప్పటానికి ఇష్టపడని ఆ అధికారి వెల్లడించారు. సరిహద్దుల్లో మరికొంత మంది వేచివున్నారని, వారు కూడా దేశంలోకి ప్రవేశిస్తారని చెప్పారు. రఖిన్ రాష్ట్రంలో హింసలు నిలువరించేందుకు మయన్మార్ ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని బంగ్లాదేశ్ కోరింది. బంగ్లాదేశ్ ఇప్పటికే 7 లక్షలకుపైగా శరణార్థులకు అవసరమైన ఆహారం, నీరు ఇంకా ఇతర వస్తువులను అందించే విషయంలో తీవ్రంగా ఇబ్బందులు పడుతోంది. బంగ్లాదేశ్‌లో ఉన్న శరణార్థులను వెనక్కు పిలిపించుకునేందుకు మయన్మార్ ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ అది సక్రమంగా అమలుజరగలేదు.

ప్రీస్టులు, బిషప్‌ల తప్పులు నిజమే : పోప్

అబుదాబి : ప్రీస్టులు (మతాచార్యులు), బిషప్‌లు ఆర్థిక కుంభకోణాలకు, నన్‌లపై లైంగిక దాడులకు పాల్పడిన మాట వాస్తవమేనని పోప్ ఫ్రాన్సిస్ బహిరంగంగా అంగీకరించారు. అబుదాబినుండి విమానంలో బయలుదేరిన ఆయన తనతోపాటు ప్రయాణిస్తున్న విలేకరులతో మాట్లాడారు. మహిళలపై దాడుల సంక్షోభం ఇప్పుడే సమసిపోయే అవకాశం కన్పించలేదు. మీటూ ఉద్యమం ద్వారా ఇవన్నీ వెలుగులోకి వచ్చాయి. రోమ్‌కు తిరిగి బయలుదేరిన ఆయన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో బిషప్‌లు, విశ్వాసకులు పాల్గొన్న అసాధారణ ప్రార్థనా సమావేశాన్ని ప్రస్తావించారు. ఈ పర్యటనకు ముందు రెండువారాల క్రితం కుంభకోణాలు, లైంగిక దాడులపైన, పిల్లలకు లక్ష్యంగా చేసుకొని హింసించడంపై ప్రపంచవ్యాప్తంగా ఒక విధానాన్ని రూపొందించడం కోసం బిషప్‌ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉన్నతస్థాయిలో ఉన్నవారు ఈ నేరాలను కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. క్యాథలిక్ చర్చిలలో విద్య, ఆరోగ్యభద్రత, సామాజికసేవలో పాల్గొంటున్న సిస్టర్లపైన లక్ష్యంగా చేసుకుని మతాచార్యుడు లైంగిక దాడులకు పాల్పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించేందుకు పవిత్రమైన మార్గాన్ని అనుసరించాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరు తప్పుచేస్తున్నారని కాదు, అయితే ఇలాంటి తప్పులకు పాల్పడుతున్న మతాచార్యులు, బిషప్‌లు వున్నారని పోప్ తెలిపారు. ఈ వ్యవహారాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి కొంతకాలంగా పనిచేస్తూనే ఉన్నాం. ఈ అంశంపై మరింతగా పనిచేయలేమా? అని ప్రశ్నిస్తూ ఇందుకు సంకల్పం ఉంది, పరిష్కారమార్గంలో ఇప్పటికే ప్రయాణిస్తున్నాము అని పోప్ అన్నారు.

జీశాట్-31 సక్సెస్

(మొదటిపేజీ తరువాయి)

వాహన నౌక అరియాన్-5 ప్రయోగం విజయవంతం కావడం మాకు ఎంతో సంతోషాన్నిచ్చింది. కచ్చితమైన కక్ష్యలోకి ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టి ప్రయోగాన్ని విజయవంతం చేసిన అరియాన్ స్పేస్‌కు అభినందనలు. కేయూ బ్యాండ్‌తో జీశాట్-31 హైపవర్ సమాచార ఉపగ్రహం' అని ఆయన తెలిపారు.భూమధ్య రేఖకు 3.0 డిగ్రీల కోణంలో వంపు తిరిగిన 35,850 కిలోమీటర్ల భూమికి సుదూర స్థానం, 250 కిలోమీటర్ల భూమికి సమీప బిందువుతో ఒక దీర్ఘవృత్తాకార జియోసింక్రోనైస్ కక్ష్యలో అరియాన్-5 నుంచి జీశాట్-31 వేరు పడినట్లు ఇస్రో వివరించింది. కాగా జీశాట్-31 భారత్‌కు చెందిన 40వ సమాచార ఉపగ్రహం. జీవిత కాలం ముగింపు దశలో ఉన్న ఇన్‌శాట్ ఉపగ్రహం స్థానంలో ఇది తన సేవలను అందిస్తుంది. 2,535 కిలోల బరువు కలిగిన జీశాట్-31 కక్ష్యలోని కొన్ని ఉపగ్రహాలపై కార్యాచరణ సేవలను ఇది కొనసాగిస్తుంది. ఈ ఉపగ్రహం జియోస్టేషనరీ కక్ష్యలోని కేయూ-బాండ్ ట్రాన్స్‌పాండర్ సామర్థ్యాన్ని పెంచుతుందని ఇస్రో వెల్లడించింది. 'జీశాట్-31 ప్రత్యేక ఫ్రీక్వెన్సీ విభాగాలను, కవరేజ్‌ను కలిగి ఉంది. భారత ప్రధాన భూభాగం, ద్వీపం నుంచి సమాచార సేవలను అందిస్తుంది' అని ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.శివన్ తెలిపారు. జీశాట్-31 జీవిత కాలం 15 సంవత్సరాలు. గ్రౌండ్ ట్రాకింగ్ ప్రయోజనం కోసం ఉపగ్రహం ద్వారా రెండు కేయూ బ్యాండ్ సంకేతాలు ప్రసారం చేయబడతాయి. వీశాట్ నెట్‌వర్క్, టెలివిజన్ అప్‌లింక్స్, డిజిటల్ ఉపగ్రహ వార్తా సేకరణ, డీటీహెచ్-టెలివిజన్ సేవలు, సెల్యులర్ బ్యాక్ హల్ అనుసంధానం వంటి ఇతర అనువర్తనాలకు మద్దతుగా ఈ ఉపగ్రహం ఉపయోగపడుతుంది. ఈ ఉపగ్రహం ఒక విస్తృత బ్యాండ్ ట్రాన్స్‌పాండర్‌ను వినియోగించి బంగాళాఖాతం, హిందూ మహాసముద్రం, అరేబియా సముద్రంతోపాటు మహాసముద్ర ప్రాంతాల్లో సంభాషణలను సులభతరం చేసే ఏర్పాటు కలిగి ఉంది. ఇదిలాఉండగా, 1981లో అరియాన్ ఫ్లైట్ ఎల్03పై భారత్‌కు చెందిన ఆపిల్ ప్రయోగాత్మక ఉపగ్రహాన్ని ప్రయోగించిన నాటి నుంచి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)తో 24 ప్రయోగ కాంట్రాక్టులు జరిగినట్లు యూరోపియన్ ప్రయోగ సేవల సంస్థ తెలిపింది. 2018లో చివరగా అరియాన్-5తో జీశాట్-11 ప్రయోగించబడగా, 2019లో జీశాట్-31 తొలి ప్రయోగమని అరియాన్ స్పేస్ సీఈవో స్టీఫెన్ ఇజ్రాయెల్ వివరించారు. అరియాన్ స్పేస్ ద్వారా ఇస్రో త్వరలో జియోస్టేషనరీ ఉపగ్రహం జీశాట్-30ను ప్రయోగించనున్నది. 'జీశాట్-30 ప్రయోగానికి జూన్, జూలైలో ఏదొక సమయంలో ఫ్రెంచ్ గయానాకు త్వరలో తిరిగి వస్తాం' అని పాండియన్ చెప్పారు.

నిందితుల రక్షణకే..

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ ఎంపీ ముకుల్‌రాయ్ బీజేపీ గూటికి చేరారని, అందుకే సీబీఐ విచారణ సత్తనడకన సాగుతుందన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై మోడీ సర్కారు ప్రతీకారానికి పాల్పడుతోందన్నారు. కేరళ ముఖ్యమంత్రి విజయన్, మాయావతి, అఖిలేశ్‌యాదవ్, కన్హయ కుమార్‌లపై కేసులు అందులో భాగమేనని సురవరం ఆరోపించారు. కోల్‌కతా సీపీ రాజీవ్‌కుమార్‌ను అరెస్టు చేయవద్దని, కేవలం విచారణ మాత్రమే జరపాలని ఆదేశించిందని, రాజీవ్ కుమార్‌ను అరెస్టు చేయడానికి 40మంది సీబీఐ అధికారులు వస్తే బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ వారిని అరెస్టు చేయించారని పేర్కొన్నారు. కన్హయ కుమార్‌పై తప్పుడు కేసులు పెట్టినా చార్జిషీటు తప్పుల తడకగా ఉందని, కోర్టు కొట్టివేసిందని ఆయన గుర్తు చేశారు. ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీలపై కేసులు నమోదు చేస్తున్నారని, తప్పులకు పాల్పడిన బీజేపీ మాజీ సీఎంలు, నేతలపై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. కేంద్రం, రాష్ట్రం ఘర్షణ వల్ల సీబీఐ ప్రతిష్ట దెబ్బతిన్నదని, స్వతంత్రంగా వ్యవహరించేలా చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు. సీబీఐ వ్యవహారంలో సీఎం కేసీఆర్ మౌనానికి అర్థమేమిటని సురవరం ప్రశ్నించారు. కేసీఆర్ అవినీతి బయటపడుతుందనే బీజేపీకి భయపడుతున్నారని ఆరోపించారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కేబినెట్ లేకుండానే ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన సాగిస్తున్నారని, ఇది అప్రజాస్వామికమని అన్నారు. పంచాయతీలకు 29అంశాలు, మున్సిపాలిటీలకు 18 అంశాలు బదలాయించాలని, విధులు, నిధులు ఇవ్వాలని డిమాండు చేశారు. ఈ నెల 18, 19న యాదగిరిగుట్టలో సర్పంచులకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

ఖాకీల పిల్లిమొగ్గలు

(మొదటిపేజీ తరువాయి)

సంబంధిత అధికారులను కోరవలసిందిగా ఢిల్లీ పోలీసులను న్యాయస్థానం సూచించింది. అనుమతులు ఢిల్లీ ప్రభుత్వం ముందు పెండింగ్‌లో ఉన్నాయనీ, త్వరలో తమకు అందుతాయని భావిస్తున్నట్టు ఢిల్లీ పోలీసులు కోర్టుకు తెలిపారు. "అనుమతుల కోసం అధికారులు దీర్ఘకాలం వేచి ఉండలేరు" అని కోర్టు పేర్కొన్నది. అవసరమైన అనుమతులు లేకుండా చార్జిషీట్ దాఖలు చేయడంపై సుప్రీంకోర్టు ఇప్పటికే ఢిల్లీ పోలీసులను ప్రశ్నించింది. అనుమతులను సమర్పించేందుకు ఫిబ్రవరి 6వ తేదీ తుదిగడువుగా విధించింది. ఆ గడువు బుధవారంతో ముగిసినప్పటికీ పోలీసులు సమర్పించలేకపోయారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన అత్యున్నత న్యాయస్థానం పై విధంగా పేర్కొన్నది.

కన్హయ కుమార్, జేఎన్‌యూ మాజీ విద్యార్థులు ఉమర్ ఖలీద్, అనిర్బన్ భట్టాచార్య, తదితరులపై సిటీ కోర్టులో జనవరి 14వ తేదీన ఢిల్లీ పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. పార్లమెంట్ దాడికేసు సూత్రధారి అఫ్జల్ గురును ఉరితీసి ఏడాది అయిన సందర్భంగా 2016 ఫిబ్రవరి 9వ తేదీన వర్సిటీలో జరిగిన నిరసన ప్రదర్శనకు నాయకత్వం వహించి దేశద్రోహులకు మద్దతుగా నినాదాలు చేశారని ఆ చార్జిషీట్‌లో పోలీసులు పేర్కొన్నారు.

సమయం పడుతుంది : రాజ్యసభలో హంసరాజ్

జేఎన్‌టీయూ విద్యార్థి నాయకులు కొందరికి సంబంధం ఉన్న దేశద్రోహం కేసులో ప్రాసిక్యూషన్‌కు అనుమతులు మంజూరు చేసేందుకు సమయం పడుతుందని హోం మంత్రిత్వ శాఖ బుధవారం రాజ్యసభలో తెలిపింది. ఈ కేసులో అనేక మంది దోషులుగా ఉన్నారనీ అందుకు ఆధారాలు ఉన్నాయని అందువల్ల ఈ అంశంపై సమయం పడుతుందని హోం శాఖ సహాయ మంత్రి హంసరాజ్ అహిర్ సభలో తెలిపారు. కొంత మంది విద్యార్థులు, జేఎన్‌యూ నాయకులకు వ్యతిరేకంగా ఐపీసీ సెక్షన్లు 124-ఎ/ 147/ 149/ 120-బి/ 34 క్రింద ఢిల్లీలోని వసంత్ కుంజ్ (నార్త్) పోలీసు స్టేషన్‌లో నమోదైన దేశ ద్రోహం కేసుకు సంబంధించి ఢిల్లీ పోలీసులు జనవరి 14వ తేదీన మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. "ఢిల్లీ పోలీసులు తెలిపిన దాని ప్రకారం ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు పూర్తి అయింది, అనేక మంది దోషులు/అనుమానితులు, సాక్ష్యులు ఉన్నారు. అందువల్ల ఈ కేసు సమయం తీసుకుంటుంది" అని లిఖితపూర్వక సమాధానంగా తెలిపారు. దేశద్రోహం ఆరోపణలతోజేఎన్‌యూ విద్యార్థి నాయకులపై ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన చార్జిషీట్ దాఖలు చేయడంపై అడిగిన ప్రశ్నకు మంత్రి పై విధంగా చెప్పారు.

ఐఏఎస్‌ల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

బదిలీ చేశారు. ఇక్కడ జేఈవోగా ఉన్న పి.భాస్కర్‌ను సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉన్న కె.విజయ్‌ని జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ సెక్రటరీగా నియమించారు.

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో కృతికా శుక్లాను కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. టూరిజం శాఖ డైరెక్టర్‌గా ఉన్న హిమాన్షు శుక్లాను గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ ఉత్తర్వులు ఇచ్చారు.

మరో ముగ్గురు ఐపీఎస్‌లు..

గుంటూరు రేంజ్ ఐజీపీగా ఉన్న కె.వి.వి.గోపాలరావుని ఏపీఎస్‌పీ బెటాలియన్ ఐజీపీగా నియమించారు. ఇక్కడ పని చేస్తోన్న రాజీవ్‌కుమార్ మీనాను గుంటూరు రేంజ్ ఐజీపీగా బదిలీ చేశారు. విజయవాడ సిటీ డీసీపీగా ఉన్న గజరావు భూపాల్‌ను 6వ బెటాలియన్ కమాండెంట్‌గా నియమించారు.

బాధ్యతల స్వీకరణ

(మొదటిపేజీ తరువాయి)

హాజరుకానున్నారు.

మా కుటుంబానికి అండగా ఉంటా.. : ప్రియాంక

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ప్రియాంక.. తానెప్పుడూ తన కుటుంబసభ్యులకు అండగా ఉంటానని చెప్పారు.ఏఐసీసీ కార్యాలయానికి వచ్చే ముందు ఆమె తన భర్త రాబర్ట్ వాద్రాను కారులో ఈడీ కార్యాలయం వద్ద దింపారు.

మనీలాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వాద్రా బుధవారం ఈడీ ఎదుట హాజరయ్యారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం వాద్రా పిటిషన్ దాఖలు చేయగా.. విచారణకు హాజరుకావాలని ఢిల్లీ కోర్టు ఆదేశించింది. ఈనెల 16 వరకు ముందస్తు బెయిల్ జారీ చేసింది. ఈ క్రమంలోనే ఆయన బుధవారం ఈడీ కార్యాలయానికి వెళ్లారు.

అనుసంధానం...!

(మొదటిపేజీ తరువాయి)

మండలాల్లో మరో 75 వేల ఎకరాల మెట్ట భూములకు కూడా సాగునీటి సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. కాల్వ పరివాహక ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా పరిష్కారమవుతుందని ప్రభుత్వం తెలిపింది. కాల్వ వెంబడి గ్రామాల్లో ఉన్న రక్షిత మంచినీటి పథకాలను అభివృద్ధి చేయటంతోపాటు కొత్తగా ఆరు రిజర్వాయర్లను నిర్మించాలని జలవనరులశాఖ ప్రతిపాదించింది. వాటిలో సుమారు 8.30 టీఎంసీల నీటిని నిల్వ చేయాలని భావిస్తోంది. అనేక సంవత్సరాలుగా ఫ్లోరైడ్ నీటిని తాగుతూ కిడ్నీ వ్యాధి బారిన పడుతున్న ఉద్దానం ప్రాంత ప్రజలకు రక్షిత మంచినీటిని కూడా సరఫరా చేసేందుకు కాల్వ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. గతేడాది అక్టోబరులో ప్రభుత్వం వంశధార - బహుదా నదులను లింక్ చేస్తూ హైలెవల్ కాల్వను నిర్మించాలని ప్రతిపాదించింది. దీనిపై సీఎం చంద్రబాబు, జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అధికారులతో సమావేశం నిర్వహించి హైలెవల్ కాల్వ నిర్మాణంపై చర్చించారు. సెంట్రల్ వాటర్ కమిషన్ నిబంధనల మేరకు కాల్వ నిర్మాణంపై జలవనరులశాఖ అధికారులు సర్వే కూడా పూర్తి చేశారు.

రెండు దశల్లో నిర్మాణ పనులు

హైలెవల్ కాల్వ నిర్మాణ పనులను రెండు దశలలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి దశలో రూ.2,656.74 కోట్లను, రెండో దశలో రూ.3,669.87 కోట్లను ఖర్చు చేసేలా ప్రణాళికను రూపొందించారు. హైలెవల్ కాల్వ నిర్మాణంలో భాగంగా భూ సేకరణకే రూ.1,483.12 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. మొదటి దశలో 0 కిలో మీటరు నుంచి 55 కిలో మీటరు వరకు, రెండో దశలో 55వ కిలో మీటరు నుంచి 116వ కిలో మీటరు వరకు కాల్వ నిర్మాణ పనులను చేపడతారు. వంశధార నదిలో నుంచి కాల్వ నిర్మాణం చేపట్టాల్సి ఉండటంతో అండర్ టన్నెల్స్‌ను ఏర్పాటు చేసేలా డిజైన్ చేశారు. ఇందుకోసం వయడక్ట్ విధానాన్ని అవలంభించాలని జలవనరులశాఖ నిర్ణయించింది. అండర్ టన్నెల్స్ నిర్మాణానికి రూ.325.45 కోట్లు ఖర్చుకానుంది.

రిజర్వాయర్లకు రూ. 570.62 కోట్లు

నదుల అనుసంధానంలో భాగంగా నిర్మించనున్న హైలెవల్ కాల్వ నుంచి గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు ఆరు రిజర్వాయర్లను నిర్మించనున్నారు. వీటిని కూడా రెండు దశలలో చేపట్టేలా ప్రణాళికను రూపొందించారు. ఇందుకోసం రూ.570.62 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. తొలి దశలో రూ.72.80 కోట్లతో పెదలోగిడి రిజర్వాయర్, రూ.18.05 కోట్లతో రంగసాగరం రిజర్వాయర్‌ను, రూ.133.06 కోట్లతో మల్లివీడు రిజర్వాయర్‌ను నిర్మించనున్నారు. రెండో దశలో రూ.162.06 కోట్లతో అల్లాకుల, రూ.142.12 కోట్లతో హంసరాలి రిజర్వాయర్, రూ.42.53 కోట్లతో కంచిలి రిజర్వాయర్‌ను నిర్మించనున్నారు.

మాది పేదల పక్షం

(మొదటిపేజీ తరువాయి)

గణనీయంగా పెరిగిందని, ఇది మన ప్రభుత్వం అనే భావన ఏర్పడిందన్నారు. అధికార యంత్రాంగం కూడా పట్టుదలతో పని చేసి రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేశారని అభినందించారు. దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఫించన్లు 5 రెట్లు పెంచామన్నారు. అక్కా చెల్లెళ్లకు పసుపు-కుంకుమ పథకం కింద రూ.10 వేల ఆర్థిక సహాయం చేస్తున్నానని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులను వెచ్చించామని వివరించారు. ఆదరణ-2 పథకం కింద దాదాపు 8 లక్షల వృత్తిదారుల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆర్‌బీఐ అంగీకరించకపోయినా, ప్రధాని మోడీ కనికరించకపోయినా రూ.24 వేల కోట్ల రుణాలను మాఫీ చేశాం. కేవలం వ్యవసాయరంగానికి దాదాపు 81 వేల కోట్లు ఖర్చుపెట్టాం. ఇప్పుడు మళ్లీ అన్నదాత సుఖీభవ పథకం అమల్లోకి తెచ్చేందుకు రూ.5 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించామని తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే తమ ధ్యేయమన్నారు. ఇందుకోసం సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి అత్యధిక నిధులు కేటాయిస్తున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు ఏపీ జీవనాడి అని, దానిని ఎట్టిపరిస్థితుల్లో ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేసి 2020 జనవరి నాటికి గ్రావిటీతో నీరందిస్తామని స్పష్టం చేశారు. త్వరలో పంచనదుల సంగమాన్ని పూర్తి చేసి కరవు రహిత, సాగునీటి సమస్యలేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్ది వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా చేస్తామని తెలిపారు. తొలి నుండి టీడీపీ ప్రభుత్వానికి వెన్నెముకగా నిలుస్తున్న బీసీల రుణం తీర్చుకుంటానని, ఇందుకోసం రికార్డు స్థాయిలో బడ్జెట్‌లో 33 శాతం వారి సంక్షేమానికే కేటాయించామన్నారు. కరవులు ఇబ్బందులు ఉన్నా 11 శాతం అభివృద్ధి సాధించడం అంటే గొప్ప. ఏపీలో 300 శాతం ఎఫ్‌డీఐలు పెరిగాయి. దేశంలో అత్యధిక స్థాయిలో ఎఫ్‌డీఐలు సాధించింది మనమే. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రెండు సంవత్సరాలు తొలిస్థానంలో నిలిచామని తెలిపారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితుల్లో పాలకపగ్గాలు చేపట్టి విద్యుత్ కోతంటే తెలియని పరిస్థితిని కల్పించామని, గత 5 ఏళ్లలో విద్యుత్ చార్జీలు ఏమాత్రం పెంచకపోగా, భవిష్యత్తులో కూడా పెంచబోమని భరోసా ఇచ్చే పరిస్థితికి వచ్చామన్నారు. అనేక పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయని వివరించారు.

రాష్ట్రంలో ప్రతిపక్షం ఉందా..?

రాష్ట్రాభివృద్ధి, ప్రజల సమస్యలు ఏమాత్రం పట్టని వైసీపీపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసలు రాష్ట్రంలో ప్రతిపక్షం ఉందా అని ప్రశ్నించారు. ఎందుకు మిమ్మల్ని ఎమ్మెల్యేలుగా గెలిపించారు. అసెంబ్లీకి రాకుండా, ప్రజా సమస్యలు చర్చించకుండా ప్రజలకు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. శాసనసభకు రానివారు జీతాలెందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం కోసం మేం పోరాడుతుంటే, వైసీపీ అధినేత జగన్ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడుతున్నారని విమర్శించారు. తొలినుండి రాష్ట్రాభివృద్ధిని అడుగడుగునా అడ్డుకున్నారని, రాజధానిలో పొలాలు తగులబెట్టి రైతులను బెదిరించడం, పోలవరం ప్రాజెక్టుపై కేసులు వేయించడం, పట్టిసీమను అడ్డుకోవడం, తునిలో రైలు తగులబెట్టి కుల చిచ్చురేపాలని యత్నించడం, చివరకు ప్రపంచ బ్యాంకుకి కూడా రుణాలు ఇవ్వొద్దంటూ మెయిల్స్ పెట్టడం చేశారని పలు ఘటనలను ఉదాహరించారు.

కక్షపూరితంగా వ్యవహరిస్తున్న మోడీ

రాజధాని లేని, ఆర్థికంగా లోటుతో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకోవల్సిన కేంద్రం కక్షపూరితంగా వ్యవహరించిందని చంద్రబాబు విమర్శించారు. విభజన చట్టంలోని అంశాలు, హామీల ప్రకారం ప్రత్యేక హోదా అమలు చేసినా, వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇచ్చినా, పోలవరం, అమరావతి ప్రాజెక్టులకు అవసరమైన నిధులు ఇచ్చినా, లోటు బడ్జెట్ పూర్తి చేసినా ఏపీ ప్రగతి ఇంకా అనూహ్యంగా ఉండేదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రానికి ఏమాత్రం సహకరించకపోగా, కనీసం దేశాన్ని అయినా అభివృద్ధి చేశాడా ? అంటే చెప్పుకునే ఒక్క పని కూడా సక్రమంగా చేయలేదన్నారు. పైగా నోట్ల రద్దు, జీఎస్టీ అమలు వంటి చర్యల వల్ల నిరుద్యోగ సమస్యను తీవ్రం చేశారని, మరో పక్క రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ విధ్వంసం చేశారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. మోడీకి తనలాంటి నిజాయితీగల సీనియర్ నాయకులు అవసరం లేదని, జగన్, కేసీఆర్ లాంటివారే కావాలని ఎద్దేవా చేశారు. ముగ్గురు మోడీలు కలిసి రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని, వీరికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

సమష్టి కృషితోనే అద్భుత ప్రగతి

సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : గత నాలుగున్నరేళ్లలో దేశంలో ఎక్కడాలేనన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్రంలో అమలు చేశామని, దీనికి వివిధ రంగాల్లో వచ్చిన 670 అవార్డులే నిదర్శనమని సీఎం చంద్రబాబు చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖలకు కేంద్రం ఇచ్చిన అవార్డులతో శాసన సభ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రదర్శనను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏపీకి ఇన్ని అవార్డులు రావటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. మనం చేసిన పనికి ఈ అవార్డులు గుర్తింపు అని ఆయన వ్యాఖ్యానించారు. అధికారులు, ప్రజాప్రతినిధులంతా సమష్టిగా పనిచేయడం వల్లే మంచి ఫలితాలతో రాష్ట్రానికి 670 అవార్డులు వచ్చాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. హేతుబద్దత లేని విభజన వల్ల అనేక ఇబ్బందులు పడ్డామని గుర్తు చేశారు. అయినప్పటికీ దీనిని ఒక సవాల్‌గా తీసు కొని అందరం సమిష్టిగా, కసితో పనిచేయడం వల్ల అద్బుత ఫలితాలు సాధించగలిగామన్నారు. మున్నెన్నడూ లేని విధంగా రాష్ట్రానికి పెద్ద సంఖ్యలో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు రావడంతో ప్రభుత్వ ప్రతిష్ట మరింతగా పెరిగిందని ఆనందం వ్యక్తం చేశారు.



వీటిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో మరింత బాగా పని చేసేందుకు ఈ అవార్డులు దోహద పడతాయన్నారు. ఇప్పటివరకు ఏం సాధించామో ప్రజలకు చెప్పేందుకు ఈ ప్రదర్శన ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసన సభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మండలి ఇన్‌ఛార్జ్ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు పాల్గొన్నారు.

• సంక్షేమ బోర్డు కోసం

మహోద్యమం

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా యాభై లక్షల మంది హమాలీ, వీధి విక్రయదారులు, ఆటో కార్మికుల కోసం ప్రభుత్వం తక్షణమే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండు చేశారు. విజయవాడ ధర్నాచౌక్‌లో ఏఐటీయూసీ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్, విజయవాడ ఆటో వర్కర్స్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ హమాలీ ఫెడరేషన్ల ఆధ్వర్యంలో బుధవారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ సంక్షేమబోర్డు సాధించే వరకు ఈ ఉద్యమం సాగుతుందని హెచ్చరించారు. రాష్ట్రప్రభుత్వం అసంఘటిత కార్మికులను చిన్నచూపు చూస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వీధివిక్రయదారులు, హమాలీ, ఆటో కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించలేదని విమర్శించారు. రాష్ట్రంలోని కార్మికుల కోసం ఈ బడ్జెట్‌లో కేవలం ఆరు నుంచి ఏడువందల కోట్ల రూపాయిలు కేటాయించారంటే కార్మిక వర్గాలపై సర్కారు నిర్లక్ష్యం అర్థమవుతోందన్నారు. ప్రజల డబ్బుతో ప్రజల ఓట్లు కొనుగోలు చేసే బడ్జెట్ ప్రవేశపెట్టారని విమర్శించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నరేంద్ర మోడీ అసంఘటిత కార్మికులకు రూ.3వేలు పింఛన్ ఇస్తామని ప్రకటించారన్నారు. రూ.3వేలు సరిపోదని కనీసం రూ.7వేలు కనీస పింఛన్ ఉండాలని డిమాండు చేశారు. ప్రభుత్వం ఎన్నికల కోసం దివ్యాంగులు, వితంతవు, వృద్ధుల సామాజిక పింఛన్లు రెట్టింపు చేసిందనీ, అయితే ఈ పెంపును తాము వ్యతిరేకించడంలేదన్నారు. కానీ 60ఏళ్లపాటు సమాజంలో విశేషసేవలందించిన అసంఘటిత కార్మికులకు మాత్రం రూ.7వేలు పింఛన్ ఇవ్వాలని పోరాటాలు చేస్తోన్నామన్నారు. అయితే కేంద్రం ప్రకటించిన రూ.3వేల సామాజిక పింఛన్ ఇవ్వడానికి కూడా అనేక షరతులు పెట్టిందన్నారు. ఈ పింఛన్ కోసం కార్మికుడు 60 ఏళు వయస్సు వచ్చే వరకు వందరూపాయిలు ప్రీమియం చొప్పున కడితే 60 ఏళ్లు తర్వాత సామాజిక పింఛన్ ఇస్తాననడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎలాంటి షరతులు లేకుండా ప్రధానమంత్రి మోడీ 60ఏళు దాటిన అసంఘటిత కార్మికులకు రూ.7వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండు చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆటో కార్మికులు డీజిల్ ధరలు పెరిగినందున నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా ఫైనాన్స్ సంస్థలు అధిక వడ్డీలు గుంజడం వలన ఆటో కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ఆటోల లైఫ్‌ట్యాక్స్ రద్దు చేశామని చంద్రబాబు ప్రకటించారని, అది కేవలం రూ.6,300 లేనన్నారు. ఒకవైపు లైఫ్‌ట్యాక్స్ తగ్గించి మరొక వైపు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ రూ.7,500 వరకు పెంచడం అన్యాయమని విమర్శించారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించకపోతే ఈనెల 28వతేదీన అన్ని జిల్లా కలెక్టరేట్లను ముట్టడించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు ఐక్యంగా పోరాటాలు చేసి చట్టబద్ధంగా రావాల్సిన హక్కులను సాధించాలన్నారు. దీనికోసం హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ హమాలీ, ఆటో, వీధి విక్రయకార్మికుల కోసం సాగిస్తున్న ఈ ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్రకోశాధికారి బీవీవీ కొండల రావు, సీనియర్ నాయకులు పల్లా సూర్యారావు, రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తలాటం వీరబాబు, ఏఐటీయూసీ రాష్ట్రనాయకులు రావుల అంజిబాబు, మనోహరమాణిక్యం, శ్రీరామచంద్రమూర్తి, మన్మధ రావు, నీలం దుర్గారావు, ఆటోయూనియన్ నాయకులు వామనమూర్తి, ప్రభాకర్, మల్లిఖార్జున, వీధివిక్రయ దారుల సంఘం నాయకులు తెడ్డు వెంకటేశ్వరరావు, కొట్టు రమణ, రమేష్, ఏఐటీయూసీ నగర అధ్యక్ష కార్యదర్శులు తాతయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీంద్రనాథ్



ధర్నాలో పాల్గొన్న కార్మికులు

కాపుల కోటా బిల్లుకు ప్రతిపాదన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాపుల కోటా బిల్లును ఏపీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అసెంబ్లీలో ప్రతిపాదించారు. స్పీకర్ కోడెల శివప్రసాద్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ప్రశ్నోత్తరాల అనంతరం సభలో ఆరు బిల్లులను ప్రతి పాదించారు. ఆంధ్రప్రదేశ్ విలువ ఆధారిత పన్ను (సవరణ) బిల్లు -2019 అనుమతి కోసం ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టారు. ప్రైవేటు విశ్వ విద్యాలయాల (స్థాపన, క్రమబద్దీకరణ), సవరణ, ఆంధ్రప్రదేశ్ ప్రపంచ స్థాయి డిజిటల్ విద్యాబోధనల ప్రజ్ఞాపాటవాల కేంద్ర బిల్లును మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు సభలో ప్రతిపాదించారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల ఉప-ప్రణాళిక(ఆర్థిక వనరుల ప్రణాళిక, కేటాయింపు, వినియోగం) బిల్లును అచ్చెన్నాయుడు ప్రతిపాదించారు. ఆర్థికంగా బలహీన వర్గాల పౌరుల (రాష్ట్ర పరిధిలో ఉన్న విద్యాసంస్థలలోని సీట్లు, నియామకాలు/పబ్లిక్ సర్వీసుల పోస్టుల్లోని కాపులకు రిజర్వేషన్లు) బిల్లును ఆయన ప్రతిపాదించారు. ఏపీలో కాపులు కానట్టి, ఆర్థికంగా బలహీన వర్గాల (రాష్ట్ర పరిధిలో ఉన్న విద్యాసంస్థలలో సీట్లు, నియా మకాలు/పబ్లిక్ సర్వీసుల్లోని పోస్టుల రిజర్వేషన్లు) బిల్లును అనుమతి కోసం సభలో ప్రవేశపెట్టారు.

పలు పత్రాల ప్రవేశం

వ్యవసాయం అనుబంధిత రంగాలకు చెందిన 2017-18 వార్షిక నివేదిక ప్రతిని అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. 2017-18కిగాను ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్ 18వ వార్షిక నివేదిక, అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం, వైద్య విద్యకు చెందిన మూడేళ్ల ప్రగతి ప్రతులను సభా సమక్షంలో ఉంచారు. మాజీ ఎమ్మెల్యే జాగర్లమూడి రాఘవరావు మృతికి సంతాపసూచకంగా సభ్యులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

ఆప్కో చైర్మన్‌ను తొలగించాలి

సీఎంకు కె.రామకృష్ణ బహిరంగ లేఖ



విశాలాంధ్రబ్యూరో - అమరావతి: చేనేత కార్మికుల సంక్షేమానికి తూట్లు పొడుస్తూ వేలకోట్ల రూపాయిల అక్రమాలకు పాల్పడిన ఆప్కో చైర్మన్ గుజ్జల శ్రీనును ఆ పదవి నుంచి తక్షణమే తొలగించాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణ డిమాండు చేశారు. ఈమేరకు బుధవారం సీఎం చంద్రబాబుకి బహిరంగలేఖ రాశారు. అవినీతికి పాల్పడిన శ్రీనుపై సమగ్రంగా విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షా పదివేల చేనేతల కుటుంబాలు ఉపాధిలేక అల్లాడిపోతున్నాయనీ, ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రారంభించిన సహకార సంఘాలను నిర్వీర్యం చేసి చేనేత, జౌళిశాఖాధికారులతో కుమ్మక్కై వేలాది కోట్ల రూపాయిలను శ్రీను దోచేశారని పేర్కొన్నారు. స్కూల్ పిల్లల యూనిఫారమ్స్, రాజధాని రైతులకు ఇచ్చిన దుస్తులు, పారిశుధ్యకార్మికులకు ఇచ్చిన దుస్తులను నిబంధనలకు విరుద్ధంగా పవర్‌లూమ్ కంపెనీల నుంచి ఆప్కో చైర్మన్ కొనుగోలు చేశారని రామకృష్ణ తెలిపారు. వాటిని సహకార సంఘాల్లో కొనుగోలు చేసినట్లు తప్పుడు బిల్లులు సృష్టించి బట్ట అమ్మకం, కూలి వంటివాటిపై వచ్చే వందలకోట్ల రూపాయిల రాయితీని అప్పనంగా దోచేశారని రామకృష్ణ తన లేఖలో సీఎంకు వివరించారు. ఆయన చేనేత రుణమాఫీ, ఆర్ఆర్ఆర్ మాఫీ, ఐహెచ్‌డీఎస్ వంటి పథకాల్లో అక్రమాలకు పాల్పడినట్లు తెలిపారు. జాతీయ సహకార సంస్థ రుణాలనూ బినామీ సొసైటీలకు కేటాయించారని, అందుకు కొందరు అధికారులు సహకరించడం దుర్మార్గమైన చర్యగా రామకృష్ణ పేర్కొన్నారు. ఆప్కో చైర్మన్ రాజీనామాను డిమాండు చేస్తూ ఈనెల 8న మంగళగిరి ఆప్కో కార్యాలయం ముట్టడికి చేనేత కార్మిక సంఘం పిలుపునిచ్చిందని వెల్లడించారు. ఆప్కో చైర్మన్‌ను తొలగించడంతోపాటు దోచుకున్న సొమ్మును రికవరీ చేయాలని, ఆయనకు అధికారులపై చర్యలు తీసుకోవాలని రామకృష్ణ డిమాండు చేశారు.



ఆంధ్రుల ద్రోహి.. మోడీ గోబ్యాక్

- 8న మండల కేంద్రాల్లో నల్లజెండాల ప్రదర్శన
- 9న వామపక్షాల ర్యాలీలకు మద్దతు
- 10న నల్ల బెలూన్లతో నిరసన
- ఏపీ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఆంధ్రుల ద్రోహి 'మోడీ గోబ్యాక్' నినాదంతో ఈ నెల 8 నుంచి 10 వరకు వివిధ రూపాల్లో ఆందోళనలకు ఏపీ-విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. విజయవాడ దాసరి భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఉద్యమ కార్యాచరణను నేతలు ప్రకటించారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను విస్మరించిన ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటనకు రావడం దారుణమని దుయ్యబట్టారు. మూడు రోజులపాటు కొనసాగే ఆందోళనల్లో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి, యువజనులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 8న రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల్లో నల్ల జెండాలతో ప్రదర్శన, 9న వామపక్షాల ర్యాలీకి మద్దతిస్తామని తెలిపారు. 10న గుంటూరుతో పాటు 12 జిల్లాల్లో నల్ల బెలూన్లతో నిరసనలకు దిగుతామన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సుబ్బారావు మాట్లాడుతూ అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టులకు కేంద్రం ఎందుకు నిధులివ్వలేదని ప్రశ్నించారు. విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయకుండా రాష్ట్రానికి మోడీ ఎలా వస్తారని మండిపడ్డారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.సూర్యారావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తగినన్ని నిధులు కేటాయించలేదని విమర్శించారు. కేంద్రీయ విద్యా, వైద్య సంస్థలకు ప్రత్యేక నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర మాట్లాడుతూ మోడీ మళ్లీ రాష్ట్ర ప్రజలను మోసగించేందుకు వస్తున్నారని ధ్వజమెత్తారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అఫ్సర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రసన్నకుమార్, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ విజయవాడ నగర కార్యదర్శులు చరణ్‌సాయి, రాజేష్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై

అసెంబ్లీ గరం గరం..

- మంత్రి ప్రత్తిపాటిపై ఎమ్మెల్యే మోదుగుల ఫైర్
- రైతులను మోసం చేస్తున్న కంపెనీలు
- చర్యకు స్పీకర్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో నకిలీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ మోసపూరిత కంపెనీల యాజమాన్యంపై కఠిన చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని టీడీపీ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి శాసనసభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సభ ప్రశ్నోత్తరాల సమయంలో నకిలీ విత్తనాల వ్యవహారంపై ఆయన ప్రశ్నించారు. దీనిపై మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వివరణ సమగ్రంగా లేకపోవడంతో మోదుగుల ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో కోడెల జోక్యం చేసుకుని మాట్లాడుతూ..నకిలీ విత్తనాల సమస్యతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్న విషయం వాస్తవమేనని స్పష్టంచేశారు. రాష్ట్రంలో 70శాతం మంది రైతులు వ్యవసాయం సాగు చేస్తున్నారని, నకిలీ విత్తనాలు సరఫరా చేసే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ ఆదేశించారు. మోదుగుల మాట్లాడుతూ సీడ్ సర్టిఫికేషన్ లేకుండా విత్తనాల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రతివారం నకిలీ విత్తనాలపై మీడియాల్లో కథనాలు వస్తున్నాయని చెప్పారు. విజిలెన్స్ దాడుల్లో పట్టుబడిన నకిలీ కంపెనీలకు చట్టపరంగా రూ.50వేల అపరాధ రుసుం విధించి ఆర్నెళ్లపాటు జైలులో ఉంచాలని సూచించారు. అధికారులు మొక్కుబడిగా నకిలీ విత్తనాల కంపెనీల నిర్వాహకులను అదుపులోకి తీసుకుని, ఆ తర్వాత వదిలేస్తున్నారని విమర్శించారు. కోడెల జోక్యం చేసుకుని ఈ అంశంపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని, లేకుంటే వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సభకు వ్యవసాయశాఖ మంత్రి హాజరుకానందున ప్రత్తిపాటి పుల్లారావు వివరణిచ్చారు. ఇప్పటివరకూ 13 నకిలీ విత్తనాల కంపెనీలను ఏడాదిపాటు సస్పెండ్ చేశామని చెప్పారు. రైతులందరికీ ఏడాదిపాటు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లాల వ్యవసాయాధికారుల నుంచి అందిన జాబితాల ఆధారంగా విత్తన సరఫరా సంస్థలు (ఏపీఎస్ఎస్‌డీసీఎల్, ఏపీ ఆయిల్ ఫెడ్, ఎన్ఎస్‌సీ) విత్తనాలను అందుబాటులో ఉంచాయని మంత్రి చెప్పారు.

కడప స్టీల్ ప్లాంట్‌పై పాలక, బీజేపీ సభ్యుల వాగ్వివాదం

కడపజిల్లాల్లో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అంశంపై సమగ్ర వివరణ ఇవ్వాలంటూ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అడిగిన ప్రశ్నపై జరిగిన చర్చలో పాలకపార్టీ సభ్యులకు, బీజేపీ సభ్యుడు విష్ణుకుమార్‌రాజుకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. స్టీల్‌ప్లాంట్ వివరాలివ్వాలని రాష్ట్రాన్ని కేంద్రం కోరినప్పటికీ..సరిగ్గా స్పందించలేదని విమర్శించారు. స్టీలుప్లాంట్ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. దీనిపై మంత్రి సుజయ వెంకట కృష్ణ రంగారావు బదులిచ్చారు. రాయలసీమ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా పి.మధుసూదన్‌ను నియమించామని వెల్లడించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో ఎన్ని డీఎస్సీలు నిర్వహించారో వివరించాలని సభ్యుడు అనిల్ కుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి గంటా శ్రీనివాసరావు వివరణ ఇచ్చారు. డీఎస్సీ-2014 ద్వారా 8055 టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. డీఎస్సీ-2018 ద్వారా 6523పోస్టులు త్వరలో భర్తీ చేస్తామని వివరించారు. కేజీబీవీ పాఠశాలల్లో సౌకర్యాలు సరిగ్గా లేవని, బాలికలు అసౌకర్యానికి గురవుతున్నారని బొబ్బిలి చిరంజీవులు చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సుల పోస్టులను భర్తీ చేయాలని గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండు చేశారు. దీనిపై వైద్యారోగ్యశాఖ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో 1171 వైద్యుల పోస్టులను భర్తీ చేస్తామన్నారు.

చుక్కల భూములకు పరిష్కారమేది..?

రాష్ట్రంలో చుక్కల భూముల పట్టాదారుల సమస్యల్ని పరిష్కరించాలని విష్ణుకుమార్‌రాజ్‌తో పాటు పలువురు సభ్యులు డిమాండు చేశారు. దీనిపై రెవెన్యూశాఖ మంత్రి కేఈ కృష్ణమూర్తి మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి జిల్లాల కలెక్టర్లకు అధికారాలు అప్పగించామన్నారు. అక్కడ పరిష్కారమవ్వకుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయట్లేదని బీజేపీ సభ్యుడు విష్ణుకుమార్‌రాజు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆర్థికమంత్రి యనమల స్పందిస్తూ ఈ నిధుల పంపిణీ వ్యవహారం సీఎం పరిధిలో లేదని చెప్పారు. అనంతరం జీవో అవర్‌లో లింక్‌రోడ్లకు నిధులు, సమస్యలను ఉప్పులేటి కల్పన, పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఆబ్కారీ కమిషనర్‌గా మళ్లీ మీనా

పర్యాటకశాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : సీనియర్ ఐఎఎస్ అధికారి ముఖేష్ కుమార్ మీనాను మరోసారి అబ్కారీ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం పర్యాటక, బాషా, సాంస్కృతిక, పురావస్తు శాఖ కార్యదర్శిగా పని చేస్తున్న మీనా తాజా మార్పులలో అబ్కారీ శాఖకు బదిలీ అయ్యారు. పర్యాటక శాఖ కార్యదర్శిగా ఆయన పూర్తి అదనపు బాధ్యతలలో ఉంటారు. సాధారణంగా సివిల్ సర్వీస్ అధికారులు తమ పదవీ కాలంలో ఒకే పదవిని రెండు సార్లు నిర్వహించటం అరుదు. ఇప్పుడు మీనా ఆకోవలో చేరారు. రాష్ట్ర విభజన తరువాత అబ్కారీ కమిషనర్‌గా విధులు నిర్వహించిన మీనా ఆశాఖలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్న సారాయి రక్కసిని రాష్ట్రం నుంచి తరిమి కొట్టే దిశలో మీనా చేపట్టిన నవోదయం కార్యక్రమం విజయవంతమై రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారి తీసింది. అబ్కారీ అంటే ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే విభాగమే అయినప్పటికీ ఉద్యోగుల బాగోగులు, పదోన్నతుల పట్ల ఆయన ప్రత్యేక శ్రద్ద చూపటంతో సంవత్సరాల తరబడి పేరుకు పోయిన సమస్యలు పరిష్కారానికి నోచుకున్నాయి. ఉద్యోగంలో ప్రవేశించినప్పటికీ తదుపరి ఎటువంటి శిక్షణకు నోచుకోని అబ్కారీ కానిస్టేబుళ్లకు శిక్షణ అవకాశం కల్పించి వారిని శారీరకంగా, మానసికంగా పునరుత్తేజితులను చేసారు.

జనసేన పార్టీ ఆఫీసుపై దాడి

సీపీఎం ఖండన

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: గుంటూరులో జనసేనపార్టీ జిల్లా కార్యాలయంపై జరిగిన దాడి సీపీఎం రాష్ట్ర కమిటీ ఖండించింది. దాడిని హేయమైన చర్యగా పేర్కొన్నది. ఈ మేరకు సీపీఎం రాష్ట్ర కమిటీ బుధవారం ఒక ప్రకటన వెలువరించింది. దీనిని రాజకీయ దురుద్దేశంతో జరిగిన దాడిగా ప్రజలు భావిస్తున్నారని అభిప్రాయపడింది. రాజకీయ పార్టీల కార్యాలయాలపై దాడి చేయడం తగదని హితవు పలికింది. బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. భవిష్యత్తులో ఇలాంటి విద్వేష దాడులు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరింది.

మెరైన్ ఇంజనీరింగ్‌లో 6 లెక్చరర్ పోస్టులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఏపీపీఎస్సీ విడుదల చేసిన ప్రభుత్వ పాలిటెక్నికల్ లెక్చరర్ల పోస్టులకు(ప్రకటన-31/2/2018) అదనంగా మెరైన్ ఇంజినీరింగ్ విభాగం నుంచి ఆరు లెక్చరర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఈ మేరకు ఏపీపీఎస్సీ బుధవారం వెబ్‌సైట్‌లో వివరాలను వెల్లడించింది. జోన్-1,2 పరిధిలో మెరైన్ విభాగంలో ఈ ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఏపీపీఎస్సీకి రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ లేఖ రాశారు. పాలిటెక్నిక్ మెరైన్ ఇంజినీరింగ్ విభాగంలో నూతన కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ విభాగం నుంచి కొత్తగా ఆరు లెక్చరర్ల పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేస్తారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్ల భర్తీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తును అందుబాటులో ఉంచినట్లు ఏపీపీఎస్సీ తెలిపింది.

2008 టీచర్లకు వేతనాలు విడుదల

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డీఎస్సీ-2008 ద్వారా నియమితులైన హామీపత్రాల ఉపాధ్యాయులకు 2014 జూన్2 నుంచి వేతన వ్యత్యాసాల ప్రయోజనాల్ని వర్తింపజేస్తూ విద్యాశాఖ స్పెషల్‌చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాథ్‌దాస్ ఉత్తర్వులు జారీచేశారని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో విడుదలైన జీవో నంబరు-140కు భిన్నంగా ప్రస్తుత వివరణ ఉత్తర్వులు ఇచ్చారని పేర్కొన్నారు.

సెలూన్లకూ ఉచిత విద్యుత్తు...!

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: రాష్ట్రంలోని హెయిర్ కటింగ్ సెలూన్లకు నెలకు 150 యూనిట్లు ఉచితంగా విద్యుత్తు సరఫరాకు ప్రభుత్వ కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులు ఇచ్చారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్తు సరఫరా చేసేందుకు జీవో నెంబర్ 15 విడుదల చేశారు. దీనివలన రాష్ట్రంలో ఉన్న 17,748 హెయిర్ కటింగ్ సెలూన్ల నిర్వాహకులకు లబ్ధి చేకూరుతుంది. దీనికోసం ప్రభుత్వం ఏడాదికి రూ.32కోట్లు నిధులను కేటాయించింది. దీనికి కావాల్సిన బడ్జెట్‌ను బీసీ సంక్షేమశాఖ విడుదల చేస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉచిత విద్యుత్ సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీట్రాన్స్‌కో సీఎండీ, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ, ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీలను ఆదేశించారు.


నటి ఝూన్సీ ఆత్మహత్య



విశాలాంధ్ర- ముదినేపల్లి : అనతికాలంలోనే మంచి పేరు తెచ్చుకున్న బుల్లితెర నటి సువ్వాడ ఝూన్సీ (21) మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. తల్లితో పాటు హైదరాబాద్‌లో ఉంటున్న ఈమె ఓ యువకుడితో ప్రేమలో పడింది. అయితే ప్రేమ విఫలం కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడిందని తెలుస్తోంది.. ఝూన్సీ తన ఫ్లాటులో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. బుధవారం ఉదయం స్థానికులు తలుపులు తట్టగా ఎంత సేప్పటికీ తెరవకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. తలుపులు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన పోలీసులు ఝూన్సీ మృతి చెందినట్లు గుర్తించారు. ఝూన్సీ మరణవార్త స్థానికంగా విషాదాన్ని నింపింది. వడాలిలో ఉన్న ఆమె తల్లిదండ్రులు హైదరాబాదు తరలి వెళ్ళారు. ఝూన్సీ మృతదేహాన్ని వడాలికి తరలించనున్నట్టు సమాచారం. ఝూన్సీ కృష్ణా జిల్లా, ముదినేపల్లి మండలంలోని వడాలి గ్రామానికి చెందిన సువ్వాడ నాగేశ్వరరావు,అన్నపూర్ణమ్మల ప్రథమ కుమార్తె. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువింది. నటనపై ఆసక్తి, స్థానికంగా ఉన్న ఓ సినీనిర్మాత ప్రోత్సాహంతో ఆమె మూడేళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి స్థిరపడింది. టీవీ సీరియల్స్‌లో నటిస్తూ నటిగా ఎదిగింది. మంచి పేరు తెచ్చుకుంది. అయితే పరిశ్రమకు చెందిన ఓ యువకుడితో ప్రేమాయణం ఆమె ప్రాణాలు తీసింది. ప్రేమించిన వ్యక్తి మోసం చేయడంతోనే ఝూన్సీ ఆత్మహత్య చేసుకుందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

'వీఐహెచ్'తో విద్యార్థులకు ప్రోత్సాహకం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సీఈవో శుక్లా



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో 13ఇంజినీరింగ్ కళాశాల్లో వెంచర్ ఇంక్యుబేషన్ హబ్స్(వీఐహెచ్) ద్వారా విద్యార్థులను చిన్నతరహా వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దనున్నామని సంస్థ సీఈవో డాక్టర్ కృతికా శుక్లా చెప్పారు. బుధవారం విజయవాడలోని ఏపీఎస్ఎస్‌డీసీ కార్యాలయంలో విఐహెచ్ ఏర్పాటు చేయబోయే కళాశాలల ప్రతినిధులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరో 13ఇంజినీరింగ్ కళాశాలల్లో వెంచర్ ఇన్సియేషన్ సెంటర్లు(విఐసి) అభివృద్ధి చేస్తామని వివరించారు. ఇప్పటికే ఎంపికచేసిన 26 కళాశాల్లో 500మంది ద్వారా మోటార్స్, ఇన్వెస్టర్ నెట్‌వర్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. కళాశాల విద్యార్థుల్లో వ్యవస్థాపక సామర్థ్యం పెంపుదల, చిన్న తరహా వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దడం, మహిళా బృందాల్ని ప్రోత్సహిస్తూ వ్యాపార సంస్థలను సృష్టిస్తున్నామని తెలిపారు. దీంతో వేలాది మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధ్యమవుతాయని చెప్పారు.

సంపాదకీయం

ఆ దుష్ఫలితాలు పేదలపైనే..

వాతావరణ మార్పుల దుష్ప్రభావం మొత్తం భూగోళాన్ని చుట్టేస్తుంది. వేరే ఖండంలో కాలుష్యం పడగ విప్పింది, భూతాపం పెరిగింది అనుకోవడానికి వీల్లేదు. పక్కవాని గుడిసె అంటుకుంటే నాకేమిటీ అనుకోవడం మూర్ఖత్వమే అవుతుందని అమెరికాలో మంచుతుపాను సృష్టిస్తున్న విలయం చాటుతోంది. భూతాపానికి ఎవరు కారణమైనా, ఎక్కడ ఎక్కువగా ఉన్నా, భూగోళం మొత్తం మీద దాని విషపు పంజా వేటు పడుతుందని స్పష్టమవుతోంది. అదేవిధంగా వాతావరణమార్పుల ప్రభావం భూగోళంపై జీవించే సకల జీవులపై ఉంటుంది. అయితే ఈ దుష్ఫలితం వర్ధమాన దేశాలపై, పేదలపై చాలా ఎక్కువగా ఉంటుందని వివిధ నివేదికలు వెల్లడిస్తున్నాయి. భూతాపం పెరుగుదల దాదాపు 1.5 డిగ్రీల సెంటీగ్రేడు వరకూ అదనంగా పెరగడంతో కోట్లాది మంది ప్రజలు పేదలుగా మారిపోతున్నారని 2018 అక్టోబర్‌లో ఐక్యరాజ్యసమితి వాతావరణమార్పులపై విడుదల చేసిన నివేదిక వివరించింది. ఈ మార్పుల వల్ల ఆహారసమస్య, నీటికొరత మరింతగా పెరిగే అవకాశంఉందనీ, నిత్యావసరాల కోసం తీవ్రపోటీ తలెత్తుందని ఆ నివేదిక పేర్కొంది. అంతేకాదు, ప్రపంచంలో ఇప్పటికే అనేక సంఘర్షణలు కొనసాగు తున్నాయి.. వాటికితోడు కొత్త ఘర్షణలు పుట్టుకొచ్చే అవకాశం తలెత్తుతుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏటా 40బిలియన్ టన్నుల బొగ్గుపులుసు వాయువు విడుదలవుతున్నది. పారిస్ ఒప్పందం ప్రకారం దీన్ని 2050కల్లా వాతావరణంలో లేకుండా నియంత్రించాలని నిర్ణయించినా అది ఆచరణలో సాధ్యపడేలా కనిపించడంలేదు. ఒక్క బొగ్గుపులుసు వాయువే కాదు, దానికన్నా 84రెట్లు ప్రమాదకరమైన మిథేన్ వాయువు.. పశువులు, చమురుబావులు, బొగ్గుగనుల నుంచి వాతావరణంలో కలుస్తోంది. ఆర్కిటిక్‌ప్రాంతంలో పర్మా ఫ్రాస్ట్ కరుగుతున్నప్పుడు కూడా విడుదలవుతోంది. బొగ్గుపులుసు వాయువు కన్నా 300రెట్లు ప్రమాదకరమైన నైట్రస్ ఆక్సయిడ్, ఆధునిక వ్యవసాయ పద్ధతుల వల్ల ఎక్కువగా విడుదలవుతోంది. రిఫ్రిజరేషన్ వాయువులు, క్లోరోఫ్లోరో కార్బన్లు కూడా బొగ్గుపులుసువాయువుకన్నా వేలరెట్లు ప్రమాదకరమైనవి. ఇవికూడా వాతావరణంలో పెరుగుతున్నాయి. కాబట్టి ఈ గ్రీన్‌హౌస్ వాయువుల పెరుగుదలను నియంత్రించడంపై దృష్టిపెట్టడం చాలా అవసరం. ముప్పు ముంచుకొస్తున్నా.. కాలు ష్యాలను కట్టడిచేయడంలో మనం విఫలమవుతున్నాం. ఫలితంగా దుష్ఫలితాలు ఇప్పటికే మనం అనుభవించాల్సి వస్తున్నది. ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో తాగు, సాగునీటి సమస్య తలెత్తింది. దీంతో అనేక ప్రాంతాలు తమ చారిత్రక ప్రాభవాన్ని కోల్పోతున్నాయి. సేద్యపుభూముల శాతం తగ్గిపోతున్నది. ఆహారోత్పత్తుల కొరత వెంటాడుతోంది. దీంతో జాతుల మధ్య ఘర్షణలు మరింతగా పెరిగేందుకు దారితీస్తున్నది. ఉదాహరణకు దక్షిణాఫ్రికాలోని అతి ప్రాచీనమైన కేప్‌టౌన్‌లో 2015 నుంచి నీటి కొరత తలెత్తింది. ప్రపంచంలోని పెద్దనగరాల్లో ఒకటైన కేప్‌టౌన్‌లో మంచినీటిఎద్దడి తలెత్తి జనం ముఖ్యంగా పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2018లో ఇక్కడి జనం 4.3మిలియన్ల మంది అని అంచనా. అంటే రెండు దశాబ్దాల్లో 79శాతం మంది పెరిగారు. అదే సమయంలో నగరానికి నీటిని సరఫరా చేసే డ్యామ్ నీరు 15శాతం తగ్గిపోయింది. ఈ నగర పరిసరాల్లో నీటి సంక్షోభం మరింతగా విస్తరించే అవకాశం ఉందని చెబుతున్నారు. కాంగోలో వర్షపాతంలో మార్పులవల్ల ఆహారోత్పత్తి తగ్గిపోయింది. సాగు విస్తీర్ణం తగ్గడంతో ఉన్న కొద్ది సేద్యయోగ్యమైన భూమి మీద ఒత్తిడి పెరిగింది. దీంతో వివిధ జాతుల మధ్య ఘర్షణలు తలెత్తి దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘర్షణలలో ఎక్కువగా బలయ్యేది పేదలే. కరవు, ఆహార, నీటికొరత మరింత పేదరికానికీ, ఆవాసాలు కోల్పోవడానికి దారితీసి జనం విషవలయంలో చిక్కుకుంటున్నారు. తరచుగా వరదలు, కరవుతో ఆహారోత్పత్తుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల పేదలు అర్థాకలికి, పోషకాహార లోపానికి లోనవుతున్నారు. ప్రపంచ ఆహార పథకం 2018లో విడుదల చేసిన ఆహార సంక్షోభం నివేదిక ప్రకారం 23దేశాల్లో ఆహార సంక్షోభం తలెత్తింది. వీటిలో ఎక్కువగా ఆఫ్రికాలోనే ఉన్నాయి. అనావృష్టి ప్రభావం దాదాపు నాలుగు కోట్లమందిపై ఉంది. 143 దేశాలలో ఘర్షణల వల్ల 2017లో మూడు కోట్ల ఆరు లక్షలమంది నిర్వాసితులయ్యారు. అంటేరోజూ 80వేల మంది నిర్వాసితులవుతున్నారు. వరదలు, తుపాన్ల వల్ల నిర్వాసితులవుతున్న వారే ఎక్కువ మంది ఉన్నారు. వరదల వల్ల 86 లక్షల మంది, తుపాన్ల వల్ల 75 లక్షల మంది నిర్వాసితులయ్యారు. వాతావరణ మార్పుల ప్రభావం అన్ని చోట్లా కనిపిస్తోంది. ఢాకాలో తీర ప్రాంతాల్లో వరదలు వచ్చాయి. ప్యూర్టోరికోలో మరియా తుపాను బీభత్సం సృష్టించింది. పశ్చిమ ఆఫ్రికాలో ఛాద్ సరస్సు ఎడారిలా మారిపోతోంది. 2100 సంవత్సరానికల్లా యూరప్ సమాజ దేశాల్లో ఆశ్రయం పొందేవారు 28 శాతం పెరుగుతారని అంచనా. వాతావరణ మార్పులతో ప్రభావితమైన దేశాల్లో భారత్ ఐదో స్థానంలో ఉంది. మన దేశంలో 80 కోట్లమంది గ్రామాల్లో నివసిస్తారు. వీరికి వ్యవసాయం, సహజ వనరులే జీవనాధారం. దేశంలోని వ్యవసాయ భూముల్లో 50 శాతం వర్షాల మీద ఆధారపడ్డవే. రుతుపవనాల్లో మార్పులతో కరవు తలెత్తి అనేకమంది పేదల జీవనోపాధిని దెబ్బతీసింది. వాతావరణంలో మార్పులవల్ల పంటల విధానాలను మార్చుకోవలసి వచ్చింది. ఇది సామాజిక– ఆర్థిక మార్పులకు దారి తీసింది. ఈ ప్రభావం కూడా చిన్న రైతులపైనే ఎక్కువగా పడుతోంది. ఈ మార్పులవల్ల పేదరికం, పోషకాహార లోపం, రైతుల ఆత్మహత్యలు పెరుగుతాయి. ప్రఖ్యాత ఆవరణ వ్యవస్థల శాస్త్రవేత్త ఇ.ఒ.విల్సన్ అభిప్రాయం ప్రకారం ప్రపంచమంతటా ఏడాదికి 10వేల జాతులు లేదా రోజుకు 27జాతులు అంతరించిపోతున్నాయి. ప్రపంచ వన్య ప్రాణుల సమాఖ్య, అంతర్జాతీయ వృక్షజాతుల సంరక్షణ సంఘం విడుదల చేసిన అంతరించిపోతున్న జాబితాలో గంధం చెట్టు, సైకస్, సర్పగంధి వంటి ఔషధ మొక్కలు, సింహం, చిరుతపులి, తోడేలు, పులి, కొండ చిలువ, మొసలి, తాబేలు వంటి జంతువులు, రాబందులు వంటి పక్షులున్నాయి. వాతావరణ మార్పులు జీవవైవిధ్యం అనే ప్రకృతి ప్రధాన లక్షణాన్ని దెబ్బతీస్తోంది. మొక్కలు, జంతువులలో మాత్రమే గాకుండా ఆహారపు పంటల్లో కూడా గొప్ప వైవిధ్యం కనబడుతుంది. ఒకప్పుడు మనదేశంలో 50,000 రకాల వరి వంగడాలు సాగుబడిలో ఉండేవి. కానీ ఇప్పుడు మనం కేవలం ఒక డజను రకాలు మాత్రమే వినియోగిస్తున్నాం. రేడియేషన్ వల్ల గబ్బిలాల సంఖ్య, మూఢ నమ్మకాల వల్ల గుడ్లగూబల సంఖ్య, పట్టణీకరణ వల్ల పిచ్చుకలు తగ్గిపోయాయి.

వాతావరణ మార్పుల వల్ల పేదలు, వర్ధమాన దేశాలే ఎక్కువగా నష్టపోతున్నాయి. నిజానికి ఆ మార్పులకు ఈ దేశాలు కారణం కాదు కానీ ఆ మార్పుల వల్ల ఎదురవుతున్న సమస్యలను ఎదుర్కొనడానికి ఎక్కువగా మూల్యం చెల్లించుకొంటున్నది వర్ధమాన దేశాలే. వాతావరణ మార్పుల దుష్ఫలితాలను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోకపోతే సంపన్న, వర్ధమాన దేశాల మధ్య, పేదలు, సంపన్నుల మధ్య అంతరాలు అంతకంతకూ పెరిగిపోయే ప్రమాదం పొంచి ఉంది.

చురక

బడ్జెట్లతో ప్రభుత్వాలు
ప్రజలపైన విసిరే వల
సంక్షేమం పేర డబ్బు
చల్లి ఓట్లు పొందే కళ

మౌలిక అభివృద్ధిపైన
మాట్లాడని నేతలు
తెరుస్తుండ్రు తాత్కాలిక
తాయిలాల మూతలు

– వేల్పుల నారాయణ

'సీమ' పుండుపై కారం రాస్తున్న చంద్రబాబు!



వి. శంకరయ్య

ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమ పర్యటనకు వచ్చినపుడల్లా ఆ ప్రాంత ప్రజల పుండుపై కారం రాసి వెళుతున్నారు. ఇటీవల అనంతపురం జిల్లాలో హంద్రీ నీవాలో భాగమైన చర్లోపల్లి జలాశయం నుండి చిత్తూరు జిల్లాకు కృష్ణ జలాలు విడుదల చేస్తూ చేసిన ప్రసంగం సీమ ప్రజలను రెచ్చగొట్టే విధంగా వుంది. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు తరలించి కృష్ణా డెల్టాకు సరఫరా చేసి డెల్టాలో మిగిలిన నీరు రాయలసీమకు సరఫరా చేసినట్లు చేసిన ప్రకటన సీమ వాసులకు కృష్ణ నది జలాలలో ఎట్టి హక్కు లేదన్నట్లు పరోక్షంగా తేల్చి చెప్పారు. తమకు న్యాయబద్ధంగా రావలసిన తుంగభద్ర జలాలకు ఎసరు పెట్టారు. కేవలం తమ ప్రభుత్వ దయాదాక్షిణ్యాల పైననే సీమ వాసులు సాగు, తాగు నీరు పొందుతున్నారనే విధంగా ముఖ్యమంత్రి ప్రసంగం కొనసాగింది.

ఈ పాటికే రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా సాగు నీటితో పాటు పలు అంశాలపై సీమలోని ప్రజా సంఘాలు నిరసన ప్రదర్శనలు ధర్నాలు సాగిస్తున్నారు. రాయలసీమ పై ఎవరూ ఎటువంటి దయచూపనవసరం లేదని న్యాయంగా రావలసిన నీటి వాటా ఇచ్చి తదనుగుణంగా నీరు నిల్వ చేసుకొనేందుకు జలాశయాలు నిర్మించాలని కోరుతున్నారు. గతంలో ఇండియన్ ఇరిగేషన్ కమిషన్ సిఫార్సుల మేరకు కరువు పీడిత మెట్ట ప్రాంతాలలో పలు జలాశయాలు నిర్మించడం ద్వారా రెండు మూడేళ్ళ కొక సారైనా వర్షాలతో అవి నిండితే రైతులు రెండేళ్ళకొకసారైనా పంటలు పెట్టుకొనే వీలుంటుందని సీమవాసులు డిమాండు చేస్తున్నారు. పోలవరం పట్టిసీమ ప్రాజెక్టుల నిర్మాణంలో ముఖ్యమంత్రి చూపుతున్న శ్రద్ధకు సీమవాసులు అసూయపడటం లేదు. కానీ తమ ప్రాంతంలో నిర్మాణంలో వున్న ప్రాజెక్టుల యెడల అవలంభిస్తున్న సాచివేత వైఖరిని జీర్ణించుకోలేకున్నారు. పైగా ముఖ్యమంత్రి తరచూ చేస్తున్న ప్రసంగాలు ప్రాంతాలు జిల్లాల మధ్య విద్వేషాలు రగిల్చే విధంగా వున్నాయి. గత యేడాది రాయలసీమలో భారీ వర్షాలు పడ్డాయి. పాతిక సంవత్సరాల కాలంలో నిండని చెరువులు కుంటలు పొంగి పొర్లాయి. ఈ చెరువులు కుంటల వద్ద ముఖ్యమంత్రి జల హారతులు ఇస్తూ సీమకు 100 టీఎంసీ లు పైగా సాగు నీరు సరఫరా చేసినట్లు చేసిన ప్రకటన సాగర్ కుడి కాల్వ వాసులకు సీమ ప్రజలకు మధ్య పొరపచ్చాలు ఏర్పడ్డాయి. సీమలో భారీగా పడిన వర్షాలకు చెరువులు కుంటలు నిండితే తాను కృష్ణ జలాలు సరఫరా చేసినట్లు డప్పు వాయించి ప్రాంతాల మధ్య విద్వేషాలకు కారకులయ్యారు.

మరి ఈ యేడు ఏమి జరిగింది? నెల్లూరు, సీమ వాసుల మధ్య తగాదాలు సృష్టించే విధంగా వ్యవహరించారు. 2018 ఆగస్టు 16వ తేది నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 115 టీఎంసీలు విడుదల చేశారు. ఇందులో నుండి 51.75 టీఎంసీలు సోమశిలకు తరలించారు. రాయలసీమకు మిగిలింది కేవలం 64 టీఎంసీలు మాత్రమే. ఇందులో పారుదల నష్టం, ఆవిరి పోగా మిగిలింది 60 టీఎంసీలు లోపే వుంటుంది. పైగా శ్రీశైలం కుడి కాల్వకు 19 టీఎంసీలు, కెసి కెనాల్ కు 10 టీఎంసీలు నికర జలాలు ఇవ్వవలసి వుంది. ఇక మిగిలింది కేవలం 30 టీఎంసీలు మాత్రమే. ప్రభుత్వం అవలంబించిన అపసవ్య విధానాల వలన ప్రాంతాల మధ్య తగాదాలు రేకెత్తాయి. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ 44 వేల క్యూసెక్కుల విడుదల సామర్థ్యంతో నిర్మాణం చేపట్టిన పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈ యేడు కేవలం 24 వేల క్యూసెక్కులు మాత్రమే విడుదల చేశారు. ఈ నాలుగేళ్ళ కాలంలో ముఖ్యమంత్రి చొరవ తీసుకొని హెడ్ రెగ్యులేటర్ పూర్తి సామర్థ్యంతో నీరు విడుదల చేసే విధంగానూ, శ్రీశైలం కుడి ప్రధాన కాల్వ విస్తరణ పనులు పూర్తి చేసి వుంటే శ్రీశైలంకు వరద వచ్చిన రోజులో రోజుకు 4 టీఎంసీల నీరు విడుదల చేసే అవకాశం వుండేది. అలాంటప్పుడు సోమశిలకు 51 టీఎంసీలు తరలించినా సీమ వాసులకు 100 టీఎంసీలకు తగ్గకుండా నీరు లభ్యమయ్యేది.

ఇందుకు మరో ఉదాహరణ – హంద్రీ–నీవా. ప్రస్తుతం చిత్తూరు జిల్లాకు నీరు విడుదల చేస్తుండగా అనంతపురం జిల్లా వాసులు తగాదాకు దిగుతున్నారు. హంద్రీ–నీవా పథకంలో భాగంగా మల్యాల నుండి జీడిపల్లి రిజర్వాయరు వరకు 216 కి.మీ ప్రధాన కాల్వ 3680 క్యూసెక్కుల నీరు ప్రవహించే విధంగా తవ్వబడినా 2వేల క్యూసెక్కుల నీరుకూడా ప్రవహించడం లేదు. ఇందుకుగాను 1200 కోట్ల రూపాయల వ్యయంతో విస్తరణ పనులు చేపట్టినా ఇప్పటికీ పూర్తి కాలేదు. తత్ఫలితంగా 2018 ఆగస్టు 16 నుండి 2363 క్యూసెక్కుల నీరు మాత్రమే పంపింగ్ చేశారు. 12 పంపులకుగాను 7 మాత్రమే పని చేశాయి. ప్రస్తుతం జలాశయ మట్టం పడిపోతున్నందున 960 క్యూసెక్కులు మాత్రమే పంపింగ్ చేస్తున్నారు. అది చిత్తూరు జిల్లా అవసరాలు దృష్టిలో పెట్టుకొనే.

జనవరి 15వ తేదీ వరకు అందిన సమాచారం మేరకు 29.73 టీఎంసీలు మాత్రమే పంపింగ్ జరిగింది. 10 టీఎంసీలు కర్నూలు జిల్లాకు ఇచ్చారు. మిగిలిన అనంతపురం జిల్లాకు తరలించారు. గత యేడాది అనంతపురం జిల్లా ఒక్క దానికే 25 టీఎంసీలు ఇవ్వగా ఈ యేడు 20 టీఎంసీలు మాత్రమే ఇస్తున్నారు. అందులో నుండి చిత్తూరు జిల్లాకు తరలిస్తున్నారు. ఈ దురవస్థ ఎందుకు ఏర్పడింది? మల్యాల నుండి జీడిపల్లి వరకు కాలువ విస్తరణ పనులు పూర్తి చేసి వుంటే 4 వేల క్యూసెక్కుల నీరు పంపింగ్ చేసే అవకాశముండేది. అలాంటప్పుడు 40 టీఎంసీల నీరు కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు ఎట్టి పొంపొచ్చాలు లేకుండా అందజేసే అవకాశం వుండేది. సీమలో నిర్మాణంలో వున్న ప్రాజెక్టులు పూర్తి చేయకుండా పట్టిసీమ జలాలు అందజేశామని ముఖ్యమంత్రి తరచూ చేస్తున్న ప్రకటనలు భవిష్యత్తులో టిడిపికి యమపాశాలుగా మిగలనున్నాయి. బచావత్ అవార్డు మేరకు తుంగభద్ర లో లెవల్ కెనాల్ నుండి 29.50 టీఎంసీలు రావలసి వుండగా సరాసరి సగటున 15 నుండి 20 కూడా రావడం లేదు. తుంగభద్ర ఎగువ కాలువ నుండి 32.50 టీఎంసీలు రావల్సి వుండగా 20 టీఎంసీలు కూడా రావడం లేదని చెబుతున్నారు. తుంగభద్ర జలాశయం నుండి రెండు కాలువల ద్వారా 62 టీఎంసీలు రావలసి వుండగా సగటున 30 కూడా అందడం లేదు. మరి ఈ నీళ్ళు ఎక్కడికి పోతున్నాయి? సుంకేశుల నుండి శ్రీశైలం జలాశయం చేరుకున్నాయి. తుంగభద్ర రిజర్వాయరు పూడి పోయి నందున ఆ మేరకు తుంగభద్ర బోర్డు తగ్గించి నీరు సరఫరా చేస్తున్నది. మిగిలిన నీరు రాయలసీమ రైతుల నోళ్ళలో మట్టిగొట్టి శ్రీశైలం చేరి కిందకు పోతున్నాయి. పైగా శ్రీశైలంలో దాదాపు 90 టీఎంసీల జలాలు సామర్థ్యం సిల్టు పూడికతో తగ్గిపోయింది. అదే విధంగా వేదవతి పై నిర్మింపబడిన భైరవాని తిప్ప ప్రాజెక్టుకు 4.10 నికర జలాలు కేటాయింపు వుంది. కర్నాటకలో వేదవతి నదిపై నిర్మింపబడిన వాణి విలస్ సాగర్ కు 5.90 టీఎంసీలు నీటి కేటాయింపులున్నా కర్నాటక వివిధ రూపాల్లో ఎగువ భాగంలో నీరు కాజేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దురదృష్ట మేమంటే నికర జలాలు కేటాయింపు ఉన్న భైరవాని తిప్ప ప్రాజెక్టుకు మిగులు జలాలతో వుండే హంద్రీ–నీవా నుండి వందల కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకం చేపట్టారు. నికర జలాలు వదిలి పెట్టి మిగులు జలాలు మార్చడం దీని ఆంతర్యమేమిటి?

పైగా బచావత్ ట్రిబ్యునల్ వేదవతిలో 50.54 టీఎంసీలు ప్రవాహమున్నట్లు గుర్తించి కర్నాటకకు 38.07 టీఎంసీలు ఏపీకి 12.47 టీఎంసీలు కేటాయించింది. కానీ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ వేదవతిలో 74 టీఎంసీలు నీటి ప్రవాహమున్నట్లు తాజాగా నిగ్గు తేల్చింది. అంటే 23.5 టీఎంసీ లు అదనంగా వున్నాయి. ఈ నీరంతా కూడా శ్రీశైలం చేరుతోంది. గత నాలుగేళ్ళుగా వేదవతిపై కర్నూలు జిల్లాలో రెండు చోట్ల రిజర్వాయర్లు నిర్మించి 8 టీఎంసీలు నీరు రైతులకు సరఫరా చేయాలని కోరుతున్నా పుణ్య కాలం గడిచేసి ఎన్నికల ముందు తాయిలాలుగా మూడు టీఎంసీలతో రెండు జలాశయాలు నిర్మించేందుకు ఈ ప్రభుత్వం సమాయత్తమౌతోంది. ఈ పనినే గత రెండేళ్ళ క్రితం ప్రారంభించి వుంటే ఈ పాటికి ఈ పథకాలు రెండూ అమల్లోకి వచ్చేవి. అదే విధంగా బచావత్ అవార్డు మేరకు 39 టీఎంసీలు కేసీ కెనాల్ కేటాయించబడింది. 10 టీఎంసీలు సుంకేశుల నుండి 29 టీఎంసీలు నదీ ప్రవాహం నుండి తీసుకోవాలని అవార్డు ప్రకటించింది. అయితే ఇన్ని సంవత్సరాలు గడిచినా 29 టీఎంసీల నీరు నిల్వ చేసుకొనే రిజర్వాయరు నిర్మాణం జరిగిన పాపాన పోలేదు. ఈ నీరంతా కూడా శ్రీశైలం చేరుతోంది. సుంకేశుల సామర్థ్యం 2 టీఎంసీలకు మించి లేదు. ఫలితంగా అటు తుంగభద్ర నుంచి వచ్చే వరద వేదవతి నుండి వచ్చే వరద రాయలసీమకు అందకుండా శ్రీశైలం చేరుతోంది. ఈ సంవత్సరం సుంకేశుల నుండి శ్రీశైలానికి 176.146 టీఎంసీల నీరు విడుదల అయ్యాయి. బచావత్, బ్రిజేష్ కుమార్ అవార్డుల మేరకు సుంకేశుల నుండి శ్రీశైలం జలాశయానికి 31.5 టీఎంసీల నీరు మాత్రమే ప్రవహించవలసి వుంది. కానీ ఈ యేడు 176.146 టీఎంసీలు శ్రీశైలం చేరాయి. ఇందులో కెసి కెనాల్ కు కేటాయించిన నీరు తుంగభద్ర ఎగువ దిగువ కాలువలకు కేటాయించిన నీరు, వేదవతికి కేటాయించిన నీరు సీమ ప్రజలకు పూర్తిగా అందకపోగా ఆ నీరంతా కూడాను శ్రీశైలం జలాశయం చేరుతోంది. ఈ రోజు సీమ వాసులు కోరుకునేది తమకు కేటాయించిన నీరు కూడా సక్రమంగా లభ్యం కావడం లేదని ఆ నీరు నిల్వ చేసుకొనేందుకు జలశయాలు లేవని వాపోతున్నారు. 2014 ఆగస్టు 15 వ తేదీ కర్నూలులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ వేదవతి పై జలాశయాలు అదే విధంగా గుండ్రేవుల రిజర్వాయరు నిర్మాణం చేపడతానని చేసిన వాగ్దానం గాలికి పోయింది. అందు కేసీమ నేడు కుతకుతలాడుతోంది. తమకు న్యాయబద్ధంగా కేటాయించబడిన నీరు అందజేయకుండా పైగా పుండు పై కారం రాసినట్లు పట్టిసీమ జలాలు తీసుకొచ్చి సీమను ఉద్ధరిస్తానని చెబుతున్న ముఖ్యమంత్రిని సీమ ప్రజలు విశ్వసించడం లేదు.

వ్యాస రచయిత : విశ్రాంత పాత్రికేయుడు,
సెల్ : 9848394013



వ్యవసాయానికి అరకొర సాయం

మధ్యప్రదేశ్ రైతుల్లో అసంతృప్తి

ఎల్ఎస్ హర్దేనియా

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌పై మధ్యప్రదేశ్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్ర రైతుల్లో నైరాశ్యం, అసంతృప్తి కనిపిస్తోంది. బీజేపీ దానిని విప్లవాత్మక బడ్జెట్‌గా అభివర్ణించగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ ఇది ఓ 'జుమ్లా' అని అన్నారు. ప్రజల్లో 'అచ్ఛేదిన్' ఆశలు ఏ కొద్దిపాటి మిగిలివున్నా మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్‌తో అవి ఆవిరయ్యాయి. 'ఈసారి ప్రవేశపెట్టినది కేవలం ఎన్నికల బడ్జెట్. ఓ జుమ్లాగా.. ఛలావా (మోసం)గా రుజువవుతుంది. చివరి రోజుల్లో ఈ ప్రభుత్వానికి రైతులు, పేదలు, గోమాత గుర్తుకొచ్చారు. అవసరమైన దానికన్నా రైతులకు ఇచ్చినది చాలా తక్కువ' అని ముఖ్యమంత్రి ట్వీట్ చేశారు.

ఇది 'జుమ్లా బడ్జెట్' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జ్యోతిరాదిత్య సింధియా వ్యాఖ్యానించారు. వరుస ట్వీట్లతో మోడీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 'రైతులకు వార్షికంగా రూ.6వేలు చొప్పున ఆర్థిక సహాయం ఇస్తామన్న మోడీ ప్రభుత్వ ప్రకటన కూడా జుమ్లాల జాబితాలోనే చేరుతుంది. అది ఎప్పటికీ రైతుల చేతికి అందదు. పంట బీమా పథకం, ఎంఎస్‌పీ కూడా ప్రకటనలకే పరిమితమయ్యాయి. రైతులను అడుగడుగునా అవమానిస్తూ, అడ్డగిస్తూ వచ్చిన ఈ ప్రభుత్వం వారికివ్వాల్సిన గౌరవాన్ని ఎప్పటికైనా ఇస్తుందా?' అని ఆయన ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు.

2014 లోక్‌సభ ఎన్నికలప్పుడు 10 కోట్ల ఉద్యోగాలను కల్పిస్తా మన్న బీజేపీ హామీ ఏమైందని, బడ్జెట్‌లో ఎక్కడా దాని ప్రస్తావన ఎందుకు లేదని మోడీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నేతలు నిలదీస్తున్నారు. రైతు సంఘాలన్నీ కూడా కేంద్రప్రభుత్వం ప్రకటించిన రూ.6వేల వార్షిక సహాయాన్ని అవమానకరంగానే పేర్కొన్నాయి. అరకొర సహాయంతో అన్నదాతను మోడీ ప్రభుత్వం అవమానిస్తోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. 'సాగుకు అయ్యే ఖర్చుకు అనుగుణంగా పంట ఉత్పత్తికి తగిన ధర లభించే విధంగా రైతులకు హామీయిచ్చినట్లయితే ఏడాదికి రూ.12వేలను మేమే ప్రభుత్వానికి అందజేస్తాం' అని భారతీయ కిసాన్ మజ్దూర్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు శివకుమార్ శర్మ అలియాస్ కాకాజీ అన్నారు. చెమటోడ్చిపనిచేసే రైతులకు నాలుగు నెలలకొక సారి రూ.2వేలు ఇవ్వడం అవమానకరమని ఆయన చెప్పారు. భారతీయ కిసాన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ యాదవ్ మాట్లాడుతూ ' సాగు ఖర్చు రోజురోజుకూ పెరుగుతుంటే ప్రభుత్వం ఈ తరహా ప్రకట నలతో రైతులతో పరాచకాలాడుతోందా..' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. వ్యవసాయ పరికరాలన్నింటినీ జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. కిసాన్ సంఘర్ష్ సమితి రమాకనత్ ధన్కర్ మాట్లాడుతూ ' వార్షికంగా రూ.6వేలు ప్రకటించడానికి బదులు కచ్చితమైన కనీస మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించి ఉంటే సబబుగా ఉండేది. చెరకు పంటకు తగిన ధర రైతులకు లభించడం లేదు. బడ్జెట్‌లో భాగంగా ప్రధాని మోడీ ప్రకటించినది సముద్రంలో నీటి బిందువుతో సమానం' అని వ్యాఖ్యానించారు.

ఓ వైపు రైతులు అసంతృప్తిగా ఉండగా మరోవైపు ఉద్యోగులు తమకు ఆదాయపు పన్నుపై రాయితీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నారు. పన్ను మినహాయింపు వల్ల మధ్యప్రదేశ్‌లోని దాదాపు ఐదు లక్షల మంది అధికారులకు లబ్ధి చేకూరనుంది. రాజ్‌పత్రిత్ అధికారి సంఘ్ అధ్యక్షుడు అశోక్ శర్మ మాట్లాడుతూ 'క్లాస్–4 ఉద్యోగులు ఎప్పుడూ కూడా ట్యాక్స్ నెట్ పరిధిలోకి రారు. అయితే రూ.5లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వడంతో క్లాస్–2, క్లాస్–3 ఉద్యోగులకు ప్రయోజనం ఉంటుంది' అని అన్నారు.

మధ్యప్రదేశ్ స్వాస్థ్య కర్మచారీ సంఘ్ అధ్యక్షుడు లక్ష్మినారాయణ్ శర్మ మాట్లాడుతూ ' రూ.5లక్షల వరకు పన్ను మినహాయించడం స్వాగతించదగిన చర్య. పన్ను శ్లాబులను కూడా తగ్గించి ఉంటే సబబుగా ఉండేది. 20శాతానికి బదులు 10శాతంగా నిర్ణయించి ఉంటే న్యాయంగా ఉండేది' అని అభిప్రాయపడ్డారు. కాల్‌పాత్రా మల్టీప్లేయర్ లిమిటెడ్ ఎండీ ఆదిత్య మాన్య మాట్లాడుతూ 'బడ్జెట్ బాగుంది. కేంద్రప్రభుత్వం తొలిసారిగా పేద, మధ్యతరగతి ప్రజలకు ఇంటి వద్దకే సేవలను అందించింది. పేదలు, మధ్యతరగతి వర్గాలను పరిగణనలోకి తీసుకొని ఈసారి బడ్జెట్‌ను రూపొందించారు. దీని వల్ల సార్వత్రిక ఎన్నికల్లో మోడీకి కచ్చితంగా ప్రయోజనం ఉంటుంది' అని అన్నారు.

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా ట్రేడర్స్ (సీఏఐటీ) ప్రధాన కార్యదర్శి భూపేంద్ర జైన్ మాట్లాడుతూ, ఇది పూర్తిగా ఎన్నికల బడ్జెట్. వర్తకులు, వాణిజ్యవేత్తలు చెల్లించే పన్నులను రైతులకు మిఠాయిలు పంచినట్లు పంచారు. ఇది న్యాయం కాదు. మేం రైతు వ్యతిరేకులం కాదు కానీ వర్తకుల ప్రయోజనం కోసం కూడా బడ్జెట్ లో ఏదో ఒకటి ఉండాలి కదా!' అంటూ అసంతృప్తిని వ్యక్తంచేశారు. ఎంపీ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్ సింగ్ మాట్లాడుతూ, రైతులకు నెలకు రూ.6వేలు చొప్పున ప్రకటించి ఉంటే వారు ప్రశాంతంగా పనిచేసుకునే వారు. చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయంతో పాటు చిరు ఉద్యోగాలు చేయాల్సి వస్తోంది. ఇది పూర్తిగా ఎన్నికల బడ్జెట్. అయితే సార్వత్రిక ఎన్నికల్లో దీని వల్ల మోడీకి ఎంత మేరకు ప్రయోజనం ఉంటుందన్నది వేచి చూడాల్సిందే' అని తెలిపారు. టాక్సేషన్ నిపుణులు వేసిన లెక్కల ప్రకారం పన్ను మినహాయింపు వల్ల దాదాపు 18 లక్షల మంది పన్ను చెల్లింపుదారులకు లబ్ధి చేకూరుతుందని తెలుస్తోంది. ఈ ప్రతిపాదనను రియల్ ఎస్టేట్ వర్గాలు స్వాగతించాయి. బడ్జెట్‌లో ప్రకటించిన పింఛన్ పథకం ద్వారా అసంఘటిత రంగానికి చెందిన 10 లక్షల మందికిపైగా కార్మికులకు ప్రయోజనం కలుగుతుంది. ఈపీఎఫ్ఓ బీమా పరిమితిని రూ.2.5లక్షల నుంచి రూ.6లక్షలకు పెంచడం ద్వారా దాదాపు 32 లక్షల మంది పాలసీదారులకు లబ్ధి చేకూరుతుంది.

ఎన్ని 'కల(లో)' వ'రాలు'

అక్షర శరాలు

– అలేఖ్య

వచ్చే సాధారణ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా అగ్ర వర్ణాలకు పదిశాతం రిజర్వేషన్లు ప్రకటించి అధికారపక్షం బ్రహ్మాస్త్రం ప్రయోగించానని సంబరపడుతుంటే, ఇప్పుడు పేదలందరికి కనీస ఆదాయం అందజేస్తామని ప్రతిపక్షం పాశుపతాస్త్రాన్ని సిద్ధం చేస్తోంది. ఈ రాజకీయ పార్టీలు ఎన్నికలప్పుడు ప్రజలను సమ్మోహితులను చెయ్యటానికి రకరకాల అస్త్రాలు సిద్ధం చేసుకోవటం సర్వసాధారణం. ఎన్నికల ముందు మాత్రమే వీరికి ప్రజల సంక్షేమం గుర్తుకొస్తుంది. వీరు ఎన్నికలప్పుడు ప్రకటించే పథకాలకు తాడు, బొంగరం వుండదు. వీటివల్ల ఎంత మందికి లబ్ధి చేకూరుతుంది, ఎంత ఖర్చవుతుంది, ఎంతకాలం అమలు పరచాలి అనే అంశాలను పరిశీలించకుండా, విశ్లేషణ చెయ్యకుండా నోరుంది కదా అని ప్రకటించటంవల్ల, తదనంతర కాలంలో ఇవి ఆచరణకు నోచుకోకుండా పోతున్నాయి. కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య, ఇంటికో ఉద్యోగం, రుణమాఫీలు వంటివన్నీ అమలు కాకపోవటానికి కారణం వాటి గురించి సమగ్ర అధ్యయనం చెయ్యకపోవటమే.

ఎన్నికలప్పుడు ఎవ్వరు ఏ పథకం ప్రకటించినా అది మధ్యతరగతి వర్గాలను, పేదలను దృష్టిలో పెట్టుకునే రూపకల్పన చేస్తుంటారు. మరి మన దేశంలో అసలు పేదలు ఎంతమంది వున్నారు, వారి అవసరాలేమిటీ, పేదరికానికి కారణమేమిటని ఏ ప్రభుత్వం విశ్లేషణ చేసిన పాపానపోలేదు. కార్మిక చట్టాల ప్రకారం పద్దెనిమిది వేల రూపాయల కనీస వేతనం పొందలేని వారంతా పేదలేనని పేర్కొంటున్నారు. కాని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడినవారికి పది శాతం రిజర్వేషన్లు ప్రకటించేటప్పుడు ఎనిమిది లక్షలలోపు సంవత్సర ఆదాయం వున్నవారు ఆర్థికంగా వెనుకబడినట్లు ప్రకటించారు. ఇంకోపక్క ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను అమలు చెయ్యటానికి కనీస వార్షిక ఆదాయం రెండు లక్షలలోపు వున్నవారే అర్హులు. అంటే రెండు లక్షల వార్షిక ఆదాయంపైబడి వున్నప్పుడు ఎన్నికల పథకాలు ఏరకం పేదలకు అమలు పరుస్తారో అవి ప్రకటించే నాయకులకే తెలియాలి.

దేశంలోని పేదలు ఎవరు, ఎంతమంది పేదలున్నారు. పేదరికానికి కారణాలేమిటి అనే విషయాలేవీ తెలియవు కాని పేదరికాన్ని మాత్రం నిర్మూలిస్తామని ప్రగల్భాలు మాత్రం పలుకుతారు. గుడిదగ్గర బిచ్చగాళ్ల బొచ్చెలో నాలుగు రూపాయలు ఎక్కువ వేస్తే పేదరికం పోయి, వాళ్లు అడుక్కోవటం మానేసి కోటీశ్వరులైపోతారని కాబోలు మన రాజకీయ నాయకులు కలలు కంటున్నారు. చేపలు పట్టటం నేర్పాలి కాని, చేపలు ఎన్నాళ్లని ఉచితంగా పంచుతామనే ఆలోచన వీరికి తట్టకపోవటం మన రాజకీయ నాయకుల అవివేకానికి సంకేతం. బహుశా అవివేకం కాదేమో? తెలిసే చేస్తున్నారేమో అనిపిస్తుంది. వీరి వాలకం చూస్తుంటే, పేదలు ఎప్పుడూ నిరుపేదలగానే మిగిలిపోవాలని వీరి ఆలోచన. వీరు కనుక అభివృద్ధి చెందితే తమకే పోటీ వస్తారని భయం. ఎన్నికలప్పుడు ఇప్పటికే దొడ్డిదారిన అనేక రకాలుగా పేదవారికి నగదు పంపిణీ చేస్తున్నారు. అవసరాన్నిబట్టి రూ. 500 నుండి రూ. 5000 వరకు ఓటు కొనుగోలుకు వెచ్చిస్తున్నారు. మొన్నటి ఉపఎన్నికల్లో ఒకడుగు ముందుకేసి కొంతమంది ఓటర్ల బ్యాంకు అకౌంట్లలోకి నగదు బదిలీ చేశారన్నది నిజం. ఇప్పుడు ఈ ముసుగులో గుద్దులాటలెం దుకు మానిఫెస్టోలోనే పెట్టేసి ఆ డబ్బేదొ ప్రభుత్వ ఖజానా నుంచే బదిలి చేస్తే పోలేదా అని ఆలోచించి "కనీస ఆదాయం పేరుతో" నేరుగా నగదు బదిలీ చేసే ఆలోచన చేస్తున్నారు.

2012 లెక్కల ప్రకారం 22 శాతం మంది దారిద్ర్యానికి దిగువన నివసిస్తున్నారు. అంటే 27.60 కోట్ల మంది ప్రజలు రోజుకు 1.25 డాలర్లు మాత్రమే ఖర్చుపెట్టే స్తోమత కలిగి వున్నారు. సుమారుగా వీరి నెలసరి ఆదాయం రూ. 3000 లోపే వుంది. నాలుగన్నరేళ్లు వీరందరి గురించి ఎప్పుడూ ఎవ్వరూ పట్టించుకోకుండా ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడే కొద్దీ వీరి కంచాల్లో విందు భోజనం వండి వారుస్తామని వాగ్దానాలు చేస్తున్నారు. వీరందరికీ ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాం అని పాలకులు వాదించవచ్చు. కాని నిజానికి ప్రభుత్వాలు అందిస్తున్న అనేక పథకాలు, సబ్సిడీలవల్ల వీరికి ఏ ఉపయోగం లేదు. ఆదాయంమీద పన్ను మినహాయింపు, విమానాల ఇంధనంపై సబ్సిడీ, రైలు ప్రయాణాలపై ఇచ్చే రాయితీ, బంగారం మీద ఇచ్చే సబ్సిడీ, పెట్రోలుపై ఇచ్చే సబ్సిడీలవల్ల సరుపేదలకు ఏ ఉపయోగం లేదు కానీ మధ్యతరగతి వారికి మాత్రం కొంతమేర లబ్ధి చేకూరవచ్చు. ఆహారం, విద్య, వైద్యం, వంటగ్యాస్, ఎరువులు వంటి వాటిపై ఇచ్చే సబ్సిడీలు మాత్రమే వీరికి నేరుగా లబ్ధి చేకూరుస్తాయి. ఇవికాక పంటల బీమా, ఉపాధి పథకం (ఎంజీఎన్ఆర్ఇ), మధ్యాహ్న భోజనం, విద్యార్థుల స్కాలర్‌షిప్పులు, చేనేత సహాయం వంటివన్నీ కలిసి జీడీపీలో 3.7 శాతం వుంటాయి.

సబ్సిడీ	జీడీపీలో శాతం	సబ్సిడీ	జీడీపీలో శాతం
వంట గ్యాస్	0.21	రైలు ప్రయాణాలు	0.08
ఎరువులు	0.04	విమాన ఇంధనం	0.01
ఆహారం	0.94	ఆదాయపన్ను	0.44
విద్య	0.49	పెట్రోలు	0.48
వైద్యం	0.10	బంగారం	0.08
రైతు రుణ వడ్డీ మాఫీ	0.10		
	1.55		1.09
పేదలకందే సబ్సిడీలు		పేదలకు అవసరంలేని సబ్సిడీలు	

ఒకవేళ నేరుగా పైన పేర్కొన్న 27.60 కోట్ల మంది పేదలకు నగదు బదిలీ చెయ్యాలంటే కనీసం రూ. 4,50,000 కోట్లు ప్రతి ఏడాది అవసరం. ఒక్కొక్క పేదవాడు నెలకు రూ. 3,000 సంపాదిస్తున్నాడనుకుంటే నెలకు సుమారు 15,000 రూపాయలు వీరి ఖాతాలో జమచెయ్యాలి. అంటే ఈ మొత్తం దేశ జీడీపీలో 21 శాతం వుంటుంది. ఇంత పెద్ద మొత్తం ప్రతిఏడాది పంపిణీ చెయ్యాలంటే ఇప్పుడున్న పథకాలను ఆపి ఆ నిధులు ఇటు మళ్లిస్తే తప్ప సాధ్యపడదు. ఎవరైనా ఇప్పుడు ఇస్తున్న సబ్సిడీలతోపాటు అదనంగా నగదు బదిలీ చేస్తామంటే ఒప్పుకుంటారు కాని, ఇప్పుడున్న వాటిని ఆపి కొత్తవి ఇస్తామంటే ఎవ్వరూ ఒప్పుకోరు. ఈ విషయం మన రాజకీయ నాయకులకు తెలుసు. అందుకే నగదు బదిలీ చేస్తాం అని మాయమాటలు చెపుతారు కాని, ఎంతమందికిస్తారు. ఎన్నాళ్లిస్తారు, నిధులు ఎక్కడి నుంచి తెస్తారనే విషయం మాత్రం చెప్పరు. ఇప్పటికే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అప్పుల్లో కూరుకుపోయాయి. ఉద్యోగులకు జీతాలను కూడా ఇవ్వలేని స్థితిలో వున్నాయి. అటువంటప్పుడు ఇంత పెద్ద పథకాన్ని ఎలా అమలు చెయ్యగలరని విజ్ఞత గల ఓటర్లు ఆలోచించాలి. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందని, కొత్త ఎరలకు లొంగిపోతే ఎన్నికలైన తరువాత ఉన్న పథకాలు ఆగిపోతాయనే సత్యాన్ని గ్రహించాలి.

అసలు ఈ దుస్థితికంతటికి కారణం ఓటర్ల అజ్ఞానం, దురాశే. పవిత్రమైన ఓటును అమ్ముకుంటున్నంత కాలం ఈ దుస్థితి తప్పదు. ఏ పార్టీ అధికారంలోకొచ్చినా మాకొరిగేదేముంది, పదో పరకో ఎన్నికలప్పుడే కదా దొరికేది అని ఓటర్లు ఆలోచిస్తున్నారు తప్ప, తాత్కాలిక ప్రయోజనం కోసం మొత్తం ప్రజాస్వామ్యవ్యవస్థకే తూట్లు పొడుస్తున్నామని ఆలోచించలేకపోతున్నారు. వీరి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని తెలివిగల రాజకీయ కురువృద్ధులు పోస్టుడేటెడ్ చెక్కుల రూపంలో నగదును బదిలీ చేస్తున్నారు. అంటే మళ్లీ వీరు అధికారంలోకొస్తేనే ఈ చెక్కులు చెల్లుబాటవుతాయి. ఒకవేళ వీళ్లు అధికారంలోకి రాకపోతే ఆ చెక్కులతో నాలుక గీసుకోవలసిందే. అంటే చెక్కులు ఎక్కడ పనికిరాకుండా పోతాయో అనే భయంతోనైనా తమకు ఓటు వేస్తారని అనుభవజ్ఞుల ఆలోచన. ఇప్పటిదాకా ఎన్నికల తాయిలాలతో ఓటర్లను ప్రలోభాలకు మాత్రమే గురిచేశారు. ఇప్పుడు ఓటర్లలో ఓ రకమైన భయాన్ని కూడా కలుగజేస్తున్నారు. పల్లెటూళ్లలో ఓటుకు డబ్బులిచ్చి తమకే ఓటు వేయాలని దీపాలార్పి ప్రమాణం చేయించుకుంటారు. ఒక రకంగా పోస్టుడేటెడ్ చెక్కులు కూడా ఇటువంటివే. రేపటి రోజు మరో రాజకీయ మేధావి ప్రామిసరీ నోట్లు వ్రాసిచ్చినా ఇస్తారు. ఎన్నికలప్పుడు నేరుగా డబ్బు పంచితే పోలీసులు పట్టుకుంటారని టోకెన్లు/చీటీలు పంచుతారు. తదనంతరం ఈ చీటీలను చూపిస్తే నగదు ఇస్తారు. ఈ పద్ధతి నేరమైతే, చెక్కులు పంపిణీ కూడా నేరమేనన్న సంగతి ఓటర్లు గ్రహించాలి.

తెలంగాణలో ఇటీవల పంచాయితీ ఎన్నికల్లో ఓ అభ్యర్థి డబ్బు పంచినా ఓడిపోయాడు. దానితో ఆగ్రహించి తనకు ఓటెయ్యనివారు తన డబ్బు తనకు తిరిగివ్వాలని ఇంటింటికి తిరిగి వసూలు చేసుకుంటున్నాడు. అభ్యర్థులు తాము పెట్టిన ఖర్చు వెనక్కి తీసుకోవటానికి వెనుకాడనప్పుడు, హామీలు నెరవేర్చని రాజకీయ పార్టీలను అధికారం నుంచి దింపే హక్కు కూడా ప్రజలకుంది. ఓటువేసే ముందే ఈ రాజకీయ మాయల పకీర్లబుట్టలో పడకుండా జాగ్రతపడితే ఐదేళ్లు బాధపడాల్సిన అవసరం వుండదు.

విశాలాంధ్ర

బతుకు

The Life

గురువారం
07 ఫిబ్రవరి 2019


గాలిలో విన్యాసం



విన్యాసాలు చూడటం కోసమే సర్కస్‌కి టికెట్లు కొనుక్కొని మరీ వెళతారు. అదే రోడ్డుపై అలాంటి విన్యాసాలు అదీ గాలిలో కనబడితే..... చూడకుండా వెళ్ళలేరు. ఇలాంటి విన్యాసాలే నవీ ముంబైలోని నెరుల్ రోడ్డుపై జరిగాయి. వీటిని వీక్షకులు వారి సెలఫోన్‌లో బందిస్తున్న చిత్రమిది.

ప్రకాశం... పేదల డాక్టరు!

వైద్యం....అత్యంత ఖరీదైనవాటిల్లో ఒకటిగా మారిపోయిన రోజులివి. ఎంత ఖరీదైపోయిందంటే...ప్రాణం పోయిన తర్వాత నిర్జీవమైన కట్టెను ఆసుపత్రి నుంచి బయటకు తీసుకొచ్చేందుకూ అడిగినంత ముట్టచెప్పాల్సిందే. లేదంటే శవాన్ని ఇంచుకూడా కదిలించే పరిస్థితి లేదు. ఇక ప్రాణాలు నిలబెట్టాలంటే....అత్యవసర పరిస్థితి ఏర్పడిందంటే ఆసుపత్రులు ఎలా వ్యవహరిస్తున్నాయో? వైద్యులు ఎలా ప్రవర్తిస్తున్నారో మన అందరం చూస్తున్నదే. ప్రాణాలతో చెలగాటమాడుతున్న నేటి వైద్యవ్యవస్థలో మంచి వాళ్ళని ఎంచి చూడాలంటే భూతద్దం కావాల్సిందే. అలాంటి మంచి వాళ్ళల్లో ఒకరు...డాక్టర్ ముల్లంగి ప్రకాశం. ఉండేది మన విజయవాడ నగరంలోనే. ఆయన మంచి డాక్టరే కాదు...పేదల డాక్టర్ కూడా. పైసా లేని నిరుపేదల పాలిట దేవుడాయన. రోగంతో తల్లడిల్లిపోయే బీదసాదలకు ప్రాణదాత ఆయన. ఇంత చేస్తున్నాడంటే ఏమంతగా చదువుకోలేదేమో అనుకునేరు...ఆయన విదేశాలకూ వెళ్ళివచ్చారు. అక్కడా వైద్య సేవలందించారు. అయినా...అరమరికలు లేకుండా...స్వార్థానికి పోకుండా, అత్యాశకు తావివ్వకుండా ఇక్కడా వైద్యం అందిస్తున్నారు. అందుకే ఆయన మనసున్న మంచి డాక్టరు అయ్యారు...పేదల డాక్టరు అనే పేరు సంపాదించుకున్నారు. ఎంతోమంది రోగుల గుండెల్లో ప్రాణదాతగా స్థానం దక్కించుకున్నారు.





నిగర్వి.... నిరాడంబరత... గొప్ప వ్యక్తిత్వం.... వెరసి...ముల్లంగి ప్రకాశం....డాక్టర్ ప్రకాశం.... పేదల డాక్టరు ప్రకాశం. పేదల డాక్టరు అనిపించుకున్నారంటేనే ఆయన వ్యక్తిత్వం ఎంత గొప్పదో మనం అర్థం చేసుకోవచ్చు. అదీ ఏ గ్రామీణ ప్రాంతంలోనో కాదు...నగరంలో...మన విజయవాడ నగరంలో ఈ పేరు సంపాదించడమంటే మాటలు కాదు. ఊహ తెలిసిన నాటి నుంచి కాటికి కాలు జాపేవరకూ పైసాయే పరమాత్మ అనుకుంటున్న నేటి రోజుల్లో డబ్బు వ్యామోహానికి దూరంగా...వృత్తి నిబద్ధతకు కట్టుబడి ఉన్నారు ముల్లంగి ప్రకాశం. నాలుగు దశాబ్దాలుగా వైద్యరంగంలో ఉన్న ప్రకాశం ఇన్నేళ్ళుగా తనదైన శైలిలో నామమాత్రపు ఫీజుతోనే వైద్యం చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలకీ అందుబాటులో ఉంటున్నారు.

ఇరాన్‌లో...

అర్ధ శతాబ్దం క్రితం మాట ఇది. ఆయన చదువుకున్నది ఆ రోజుల్లోనే మరి. ఐదు దశాబ్దాల ముందు ఉన్న సామాజిక పరిస్థితులను ఒక్కసారి గుర్తు చేసుకోండి. యాభై ఏళ్ళు వెనక్కి వెళితే...ఎలా ఉండేదో మీ తాతముత్తాలను ఒక్కసారి అడగండి. ఆ రోజుల్లో ఉన్నత చదువులకి వెళ్ళడం ఎంత కష్టమో చెబుతారు. అలాంటి పరిస్థితులకు ఎదురొడ్డి నిలిచి ఎంబీబీఎస్ పూర్తి చేశారు ప్రకాశం. 1971లో కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల నుంచి ఎంబీబీఎస్ పట్టా తీసుకున్నారు. 1972లో సీఎంసీ వెల్లూరు ఆసుపత్రిలో వైద్యునిగా పనిచేశారు. 1975 వరకూ అక్కడ పనిచేసి, అంచెలంచెలుగా స్వయంకృషితో 1976లో భారత ప్రభుత్వం తరపున ఇరాన్‌లో వైద్య సేవలందించారు. 1981లో మనదేశానికి తిరిగి వచ్చారు. మెడిసిన్‌తో పాటుగా ఎఫ్‌సిసిపి (ఫెలో ఇన్ కాలేజ్ ఆఫ్ చెస్ట్ ఫిజిషియన్)లోనూ ప్రత్యేక శిక్షణ పొందారు.

సామాజిక సేవలు - ఉచిత సేవలు

పేదలకు వైద్య సేవలతో పాటుగా పలు సామాజిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ప్రతీ సంవత్సరం పలు సందర్భాల్లో ఉచిత వైద్య సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుంటారు. ఉచిత వైద్య శిబిరాలలో బీపీ, షుగరు, కళ్ళ, దంత పరీక్షలతో పాటుగా కాల్షియం, మోకాళ్ళ నొప్పులకు, ఆస్మా వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు కూడా అందిస్తుంటారు. 2016లో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సుకుగాను డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ లిమిటెడ్ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఉపయోగపడే ఆహార విధానం, వ్యాయామం తదితర విధానాలపై చర్చించారు.

ఏదైనా జబ్బు చేస్తే దానికయ్యే ఖర్చు గురించి బెంబేలెత్తే ఈ రోజుల్లో ప్రకాశంలాంటి సామాజిక స్పృహ గల డాక్టర్ల సంఖ్య మరింత పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నామమాత్రపు ఫీజు, అవసరం మేరకే పరీక్షలు, తగిన మోతాదులో మందులు ఇవ్వడం, అవసరమైనవారికి ఉచిత సేవలు అందించడం లాంటి సుగుణాలు ఉన్న డాక్టరు ప్రకాశం నిజంగా అభినందనీయులు. వైద్య లోకానికి ఆదర్శనీయులు.

- గోపాలుని రాధాకృష్ణ

మనోధైర్యమే మందు

రోగికి మందు కంటే ఎక్కువగా పనిచేసేది మనోధైర్యమే. నేటి డాక్టర్లు మర్చిపోయిన ఈ సూత్రాన్ని అక్షరాలా పాటిస్తున్నారు ముల్లంగి ప్రకాశం. తన వద్దకు వచ్చే రోగులకు సరైన సూచనలు, సలహాలతో మనోధైర్యాన్ని కలిగిస్తూ రోగనివారణకు కృషి చేస్తారాయన. అన్ని ఆసుపత్రుల్లో మాదిరిగా రోగికి అవసరమున్నా, లేకపోయినా ఎడాపెడా పరీక్షలు రాయరాయన. అనారోగ్యానికి మందులు కూడా అవసరమున్నంత వరకే ఇస్తారు. అది కూడా అతి తక్కువ ఖర్చుతో.

కాల్వ గట్టున క్లినిక్

విదేశాలకు వెళ్ళి వచ్చిన డాక్టరు, ప్రభుత్వం తరపున పని చేసిన డాక్టరు ఒక ఆసుపత్రి పెట్టాలనుకుంటే ఏం ఆలోచిస్తారు? ఎవరికోసం పనిచేయాలనుకుంటాడు? వీటికి సమాధానాలు అందరికీ తెలిసినవే. నగరం నడిబొడ్డున...డబ్బులు బాగా ఇచ్చేవాళ్ళ కోసం...అని అందరూ చెబుతారు. కానీ ఇందుకు భిన్నం ముల్లంగి ప్రకాశం. వైద్యంలో అన్ని అర్హతలు ఉన్నా, ఎంతో నైపుణ్యం సంపాదించినా, నిష్ణాతుడు అనిపించుకున్నా....మన దేశానికి తిరిగి వచ్చిన తర్వాత...మన విజయవాడ నగరంలో....కొత్త వంతెన సమీపంలో క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. క్లినిక్‌ను ఏర్పాటు చేయడంలోనే కాదు...వైద్యాన్ని అందించడంలోనూ తన ప్రత్యేకతను చాటుకున్నారాయన. ప్రత్యేకించి రైవస్ కాల్వ ఒడ్డున ఉండే పేద ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారు. ఆయన చెయ్యేస్తే రోగం ఎగిరిపోయినట్టే....ఆయన మందిస్తే చెంగున గెంతేయాల్సిందే అంటారు ఈ ప్రాంత ప్రజలంతా. అంతటి ప్రజాదరణను సంపాదించుకున్నారు డాక్టర్ ప్రకాశం. ఇటీవల కాలంలో పేదలతో పాటు దిగువ, మధ్య తరగతి కుటుంబాల వారూ వైద్యం కోసం ఆయన దగ్గరకి వస్తున్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్‌లాంటి వివిధ రకాల వైరల్ వ్యాధులకు మంచి వైద్యం అందిస్తారని పలువురు చెబుతున్నారు. ముఖ్యంగా కాల్వ గట్టున నివసించే ప్రజలను పలు వ్యాధులు ప్రభావితం చేస్తుంటాయి. తన స్థాయికి మించిన జబ్బులను ప్రత్యేక వైద్య నిపుణుల దగ్గరకు పంపిస్తుంటారు. జలుబు, దగ్గు, జ్వరం వంటి చిన్నచిన్న రుగ్మతలకు చక్కటి మంచిలిచ్చి రోగి త్వరగా కోలుకునేలా చేస్తున్నారు.



ఒత్తిడికి విరుగుడు నవ్వు

శరీరం తన పనులను మెదడు ఆదేశానుసారం చేస్తుంది. మానసిక శక్తి బలహీనపడినప్పుడు ఆరోగ్యం, ఉత్సాహం, సంతోషం కుంటుపడతాయి. ఆత్మవిశ్వాసం, ధైర్యం సన్నగిల్లిపోతాయి. శారీరకంగా ఏదయినా ప్రమాదం జరిగినప్పుడు శరీరం మీదే కాదు మెదడు మీద కూడా ఒత్తిడి కలుగుతుంది. అలాగే, మానసికంగా ఒత్తిడి ఏర్పడినప్పుడు ఆ ప్రభావం రోగ నిరోధక వ్యవస్థ మీద ప్రసరిస్తుంది.



దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులు, సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, పనుల ఒత్తిడి లాంటి ఎన్నెన్నో కారణాలు మానసిక ఇబ్బందులకు గురిచేస్తాయి. ఆత్మీయుల ఎడబాటు, సన్నిహితుల మరణం, భగ్నప్రేమ మానసిక వ్యధకు కారణమవుతాయి. ఆ స్థితిలో రోగనిరోధకశక్తి బలహీనపడుతుంది. ఆ కారణంగా అధిక రక్తపోటు, అల్సరు, ఆస్తమా, గుండెపోటు, అజీర్ణం లాంటి అనేక రకాలైన అనారోగ్యాలు కలుగుతాయి. శారీరక అనారోగ్యాన్ని దూరం చేయడానికి మందులు ఉన్నట్లే, మానసిక అనారోగ్యాలను తొలగించేందుకూ మందులు ఉన్నాయి.

మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు, మానసిక ధైర్యాన్ని పెంచుకునేందుకు మనకుగా మనం కొన్ని ప్రయత్నాలూ చేయవచ్చు. వాటిలో కొన్నింటిని తెలుసుకుందాం.

- ప్రతి విషయానికీ చలించిపోతూ అశాంతినీ, మనోవ్యధనూ పెంచుకోకూడదు.
- ఎక్కువ సమయం ఒంటరిగా ఉండకూడదు
- నలుగురితో కలిసి ఉంటూ నవ్వుతూ మాట్లాడడం వల్ల మానసిక చింతలు తొలగించుకోవచ్చు.
- జోక్స్ ఎక్కువగా చదవడం, హాస్య సంభాషణలు తలుచుకుని మనసారా నవ్వడం చేయాలి.
- హాస్యభరిత పుస్తకాలు, మంచి పుస్తకాలు చదవడం ద్వారా మానసిక భావోద్వేగాలను అదుపు చేసుకోవచ్చు.
- ఇంటా, బయటా పనిచేసే మహిళలు ఒత్తిడి పెరగకుండా పనివిభజన చేసుకోవాలి.
- హడావుడి లేకుండా ఏయే పనులకు ఎంత సమయం పడుతుందో ప్రణాళిక వేసుకోవాలి
- కాలాన్ని వృధా చేయకుండా, ఆనందాన్ని మిస్సవకుండా ఎలాంటి పని చేసినా, ఎంత పనిచేసినా మానసిక ఒత్తిడి మన దరి చేరదు.



పెరడుకు నిండుదనం...

నూరు వరహాలు



సాధారణంగా ప్రతి ఇంట్లోనూ ఉండే పూల మొక్కల్లో ఒకటి నూరువరహాలు. ఇది పురాతన కాలం నుంచి ప్రతి పెరట్లో ఉంటూ వస్తుంది. కేరళలో ఈ పువ్వు లేని పెరటిని అసలు ఊహించుకోలేరు. ఈ పువ్వును వారు మల్లెపువ్వును చూసినట్లుగా చూస్తారు. అంతేకాక దీనిని ఒక వనమూలికలాగా పరిగణిస్తారు. దీని కారణం ఇందులో న్యూట్రియన్స్ ఎక్కువగా ఉండటం.

ఈ పువ్వులు ఎరుపు, లేత పసుపు రంగులో, తెలుపులో ఉంటాయి. కానీ ఎరుపు వర్ణంలో అధికంగా దొరకుతాయి. ఎంతో అందంగా ఉండే ఈ పువ్వును ఆయుర్వేద వైద్యంలో ఉపయోగిస్తారు. ఈ పువ్వులు పొదవుగా, గుంపుగా ఉండి చూసే వారి ఆకట్టుకుంటాయి





అంటుకట్టడం...

ఒక ప్లాస్టిక్ కవర్‌కు చిన్న రంధ్రాన్ని చేసి ఉంచుకోండి. దీనిలో మట్టి, సహజమైన ఎరువును కూడా వేసి రెండు రోజులు ఉంచండి. తర్వాత ఈ చెట్టు నుంచి నాలుగు అంగుళాల కొమ్మను తీసుకుని కుండీలో ఉంచండి. ఇలా మొక్క నుంచి కొమ్మను తీసుకున్న గంటలో చేయాలి. 20రోజుల తర్వాత కొత్త వేర్లు ఏర్పడి మొక్క బతుకుతుంది. కొత్తగా ఆకులు వచ్చిన తర్వాత దీన్ని కవర్ నుంచి తీసి కుండిలో గానీ నేలలో గానీ నాటుకోవచ్చు. ఈ మొక్కకు క్రమం తప్పకుండా రోజు విడిచి రోజు నీళ్ళు పోయాలి.

నేరుగా నాటడం...

అంటుకట్టడం కుదరని పక్షంలో దీన్ని వర్షాకాలంలో సరాసరి భూమిలో నాటవచ్చు. వర్షాకాలంలో మొదలైన తర్వాత ఒక మీటరు పొడవున్న ముదురు కొమ్మను తీసుకొని డైరెక్ట్‌గా మొక్కను నాటవచ్చు. దీని కోసం ముందుగానే వేప ఎరువు 100గ్రాముల, డోలమైట్ 50గ్రాములు, సహజమైన ఎరువు తీసుకోవాలి. వీటిని మొక్కనాటే గుంటలో వేసి ఆ తర్వాత కొమ్మను నాటాలి. ఇలా చేసేటప్పుడు మొక్క నుంచి కొమ్మ వేరుచేసిన వెంటనే చేయాలి. రెండు రోజుల తర్వాత నుంచి దీనికి బలం చేకూర్చాలి. ఇలా చేస్తే మొక్క బలంగా ఎదుగుతుంది.


ఈ మొక్కకు పువ్వులు ఎక్కువగా పూయాలంటే ప్రతి రెండు నెలకొకసారి దీనికి సేంద్రీయ ఎరువులను వేయాలి.

కీటకాలు దరిచేరకుండా..

ఈ మొక్కకు పచ్చపురుగు సమస్య ఎక్కువ. ఈ పురుగు కొమ్మల్ని, ఆకుల్ని కూడా తినేస్తుంది. అందుకని వేప నూనె, ఆకులు దీనికి ఎప్పటికప్పుడు అందిస్తుండాలి. ఇలా చేస్తే మొక్క కీటకాల బారిన పడకుండా ఏపుగా ఎదుగుతుంది.


ఆయుర్వేదపరంగా..

నూరు వరహాల మొక్క ఆకులు, పువ్వులు, మొత్తం చెట్టును ఆయుర్వేదంలో ఉపయోగిస్తారు. దీంతో కడుపు నొప్పి, దెబ్బలకు, డయేరియా వంటి వాటికి చికిత్సలా వాడతారు. పురాతన కాలంలో ఈ మొక్క నుంచి తయారు చేసిన నూనెను గాయాలపై రాసేవారు.



క్లాసిక్ లాకెట్స్

ఈ లాకెట్లను వేశారా? పోనీ చూశారా? రెండింటికీ ఛాన్స్ లేదులెండి. లేటెస్ట్ క్రేజీ ట్రెండ్ ఏదంటే ఈ లాకెట్లే. ఈ సిల్వర్ లాకెట్లు ఫ్యాషన్ మార్కెట్‌ను కుదిపేస్తున్నాయి. క్లాసిక్ లాకెట్స్‌గా మగువల మనసు దోచేస్తున్నాయి. మరి కొనేందుకు, వేసేందుకు మీరూ సిద్ధమేనా!





నేను - సుడిగుండం

(నవల) 38

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575



నిన్నటి సంచిక తరువాయి

మనకు ఇన్ని సంవత్సరాల్లో వచ్చిన జ్ఞానం యిదా! మనం ఇష్టం వచ్చిన పనులు చేయటానికా? ఇది ప్రేమా? పతనమా? ఆదర్శమా? జ్ఞానమా? ఇవి నువ్వు జవాబు చెప్పుకోవలసిన ప్రశ్నలు. నీకు రాము అనే పేరు నచ్చలేదు. నేను రాముడికి ఒకే భార్య అన్నదాని వరకు తీసుకుంటున్నాను. బహుశా ఆ పేరు నీకు నచ్చక పోవటానికి నీకు తెలియని కారణం నీలో వుండవచ్చు.

ఇది ప్రభాతం కాదు.

ఇక నుండి వెన్నెలా, నిదా పోరాటం చేస్తారు. అది నీ మీదా, నీలాంటి భావాల్ని ప్రచారానికి పెడుతున్న వారి మీదా అన్నది భవిష్యత్తు చెబుతుంది. .

ఇప్పటికే నీలాంటి వారిని కొంతమందిని చూసాను. ముందు ముందు చాలామందిని చూడాలి. ఈ సమాజం ఇంక మారదు అనుకుంటున్నావు కాబట్టి నీ స్వంత సుఖం చూసుకున్నావు. నువ్వు అనిందితతో...

అసలు అలాంటి పేరుని నేను నీకు సజెస్ట్ చేసాను! ఆమెతో ఆగవు. ముందు ముందు ఇంకొన్ని సంబంధాలలోకి వెళ్తావు. అయినా నీ నిన్నటి స్నేహితురాలిగా ఒకటి చెప్పాలి. ఇది మీ వ్యక్తిగతమే. మీ బతుకు మీరు బతకండి. ఎవరో ఏదో అంటారనో, అనుకుంటారనో ఇదో మహత్తర కార్యక్రమంగా జనంలోకి రాకపోవటం మంచిది. అప్పుడు మీకు పూలదండలే పడవు. తీవ్రంగా వ్యతిరేకించే వారూ వుంటారు. వాళ్లు సంప్రదాయవాదులే కానవసరం లేదు.

వారు అడిగే ప్రశ్నలు మిమ్మల్ని చికాకు పరుస్తాయి.

ఇప్పటివరకు మీతో ఏకీభవించని వారు కూడా ఇలాంటి సమయంలో వున్న కొద్దిపాటి వారిని కూడా పోగొట్టుకోవటం ఎందుకు అని మౌనంగా వున్నారు. వాళ్లూ మాట్లాడతారు.

"ఇవన్నీ మా స్ట్రాటజీలో భాగం. మేం ధ్వంసం చేయాలనుకుంటున్నవి ఇవే. మా జీవితాలు వ్యాపారంలో భాగం అనుకుంటే మీ ఇష్టం..

- అమిత

ఈ ఉత్తరంలో నీ సంబంధాలు అనిందితతో ఆగవు అని అమిత అనటం నన్ను బాధ పెట్టింది.

ఆ తర్వాత నుండి ఒక్కొక్కరూ రావటం మొదలయింది. మీకు చెప్పగలిగిన వాళ్లం కాదు. అన్నీ తెలిసినవాడివి. జీవితంలో ఇదో మచ్చగా మిగిలి పోతుంది అన్నవారున్నారు. సైలెంట్‌గా వున్నారు కొందరు.

నాతో అవసరం వున్నవారు ఇది సమస్య కాదు. బతికి వున్నంత కాలం ఒకరితో వుండటం కుదరదు. నిన్ను వ్యతిరేకించే వారు, పాత భావాల్లో బతుకుతున్నారు. మన జీవితం చిన్నది. ఇష్టం లేకుండా ఎవరూ ఎవరితో సంసారం చేయలేరు. అప్పుడు ఏదో చేసాం కాబట్టి ఇప్పుడు దానికి కట్టుబడాలనటం సరయింది కాదు. కాకపోతే ఈ రోజు కాకపోతే రేపు వారికి ఎంతో కొంత ఇవ్వండి. కోర్టుల ఉద్దేశం కూడా అదే. భరణం అనేది అందుకే వచ్చింది అన్నవారున్నారు. .

నేను అమితని కలవాలి అనుకున్నాను. అయితే పనుల ఒత్తిడి వల్ల కుదరలేదు. అలాగే జయదేవ్ మాస్టార్ని కూడా. ఛానల్ ఆరంభం అయింది.

అనిందితకి కనీసం ప్రేమని వ్యక్తం చేసే అవకాశం లభించలేదు. ప్రపంచం చుట్టి రావాలని వుండేది- వెన్నెలతోనూ, నిదాతోనూ. కనీసం నిందాకి మన దేశాన్ని దగ్గరుండి చూపించాలనుకున్నాను. అవేవీ కుదరలేదు.

ఇప్పటివరకు నిదా నాకు కనీసం ఫోన్ చేయలేదు. నేను ఫోన్ చేసినా తీయలేదు. తర్వాత వెన్నెల సెల్‌ఫోన్ పని చేయటం లేదు!

నేను నిదాని చూద్దామని ఓ రోజు వెన్నెల ఇంటికి వెళ్లాను. తలుపుకి తాళం వేసి వుంది. మా ఊరు వెళ్లినట్లుంది. నిదా చదువు దెబ్బ తింటోందన్న బాధ నాలో మొదలయింది.

'ప్రేమ'కి కూడా వ్యాపార ప్రపంచం సమయం ఇవ్వదు!

****

చివరి అధ్యాయం

నేనూ - అనిందిత

మొదట్లో నేను నిదా గురించి బాధపడ్డాను. అయితే ఒకప్పుడు నేను అనుభవించిన జీవితం గుర్తు వచ్చింది.

అప్పుడు మావయ్య సపోర్ట్ వున్నా నేను పేదరికపు అంచుల్లో వున్నాను. గొప్పగా బతకలేదు.

అందుకే జీవితం తాలూకు ప్రతి చిన్న కోణం నాకు తెలుసు. నిదా పుట్టిన దగ్గర్నుండి మా ఆర్థిక పరిస్థితి ఫర్వాలేదు. తను పెరుగుతున్న కొద్దీ మంచి జీవితం ఇవ్వగలిగాను. నిదాని నేను కావాలంటే వెన్నెల వ్యతిరేకించదు.

"నీకు మీ నాన్న కావాలంటే తన దగ్గరకు వెళ్లు" అంటుంది. తను మాత్రం నా దగ్గరకు రాదు.

నిదా మరీ చిన్నపిల్ల కాదు. ఒక్కసారన్నా నన్ను చూడాలని అనిపించలేదా? నాతో వుండనవసరం లేదు. నువ్వు మన ఇంటికి ఎందుకు రావటం లేదు అని అడగవద్దా? ఇప్పటివరకూ ఓ స్థాయి జీవితానికి అలవాటు పడింది. ఎంతకాలం తను కొత్త జీవితానికి అలవాటు పడుతుందో చూస్తాను.



అయినా నిదాకి కూడా నాలానే జీవితానుభవాలు అవసరం. అయితే ఈ నాన్న హృదయంలో నిదాకి, వెన్నెలకి ఎప్పుడూ చోటు వుంటుంది.

కనీసం తను కోరుకున్న చదువుల కోసం అయినా నా దగ్గరకు రావాలి. అప్పటిదాకా నేను వేచి చూస్తాను అనుకున్నాను.

****

ఛానల్ మొదలు పెట్టాక కొంత వర్క్‌లోడ్ తగ్గించుకున్నాను. నేనూ - అనీ నా కుటుంబంలో వచ్చిన పరిణామాల గురించి మాట్లాడుకున్నాం.

వెన్నెల గురించి చెప్పాను. నవ్వింది.

"నువ్వు విడాకులు తీసుకుందాం అన్నావు. నాకు నా భర్త నచ్చనప్పుడు అతను అడగలేదు. నేను డివోర్స్ తీసుకుంటాను అన్నాను" అంది.

"నీ అంత చదువుకోలేదు తను" అన్నాను.

"నేను ఒకటి అడుగుతాను. నీ భార్యకి ఇప్పటివరకూ ఇంకో రిలేషన్ లేదా?"

షాకయ్యాను. అంతలోనే....

"వెన్నెల అలాంటిది కాదు" అన్నాను.

"ఎలా చెప్పగలవు?"

నేను మాట్లాడలేదు.

"మనం లివ్ ఇన్ రిలేషన్‌లోకి రాకముందు ఏం జరిగింది! ఓ యాక్సిడెంటల్ స్థితిలో మనం కలిసాం. అలాంటి పరిస్థితి నీ భార్యకు వచ్చి వుండదా? నువ్వూ, నేనూ బయటకు చెబుతాం. కొందరు చెప్పరు. అలా చేయటం తప్పని నేను అనటం లేదు. సెక్స్‌కి - పెళ్లికి ముడి పెట్టవద్దు. దూరం పెంచొద్దు. అసలు మన తిండికి, సెక్స్‌కి మధ్య పెద్ద తేడా వుండదు. రెండూ నిత్యావసరాలు. ఆ తేడా గుర్తించకుండా గుండెలు బాదుకునే వారిని చూస్తే నాకు జాలి" అంది.

ఎందుకో అనిందిత మాటల్లో వాస్తవం వుందనిపించింది.

"తిండికి లేనివారు, అవకాశాలు లేనివారు, సెక్స్ విషయంలో రాజీ పడతారు. మనసులో మాత్రం కోరికల పుట్టలు. ఇప్పుడిప్పుడే అమెరికా నుండి, ఇతర కంట్రీస్ నుండి కుప్పలు కుప్పలుగా డబ్బు వచ్చి పడుతోంది. మనకు ఆ డబ్బులు మాత్రం కావాలి. ఆ కల్చర్ వద్దా?" అంది.

అవును కదా!

"ఇప్పుడిప్పుడే ఇండియన్ ఎకానమీ మారుతోంది. మధ్య తరగతి నుండి ఉన్నత మధ్యతరగతి, అటునుండి ఇంకాస్త పెద్ద స్థితికి వెళ్తున్నారు. మన దగ్గరున్న బ్లాక్ మనీ లక్షల కోట్లకి చేరుకుంటుంది. ఇప్పుడు నోట్ చేసుకో.... రానున్న దశాబ్దాల్లో ఓ భార్య - ఓ భర్త - ఓ జీవితం అనే కాన్సెప్ట్ పాతకాలం నాటిది అవుతుంది. నో బడీ కెన్ స్టాప్ దట్ ఛేంజ్' అంది.

అలా మేం మా సంబంధాన్ని కొనసాగిస్తున్నాం.

అంతర్లీనంగా అనీని చూస్తున్నప్పుడు నేను ఎగ్జయిట్ అవుతుంటాను. మేం శారీరకంగా కలుసుకున్న ప్రతిసారీ నాకు కొత్త అనుభూతి కలుగుతుంది.

ఈ మధ్యకాలంలో నేను తెలుగు సాహిత్యం, ఆంగ్ల సాహిత్యం చదువుతున్నాను. అందులోనూ ముంబయ్‌లో ఇలాంటివి ఎన్నో జరుగుతుంటాయి. ఒక్కొక్కరిది ఒక్కో సంచలనం.

వారు మాట్లాడుతుంటే ఇది కూడా ఆలోచించాలి కదా అనిపిస్తోంది.

ఇంతకుముందు అలౌకిక ప్రేమలు, ప్రయాణాలు, అందమైన ప్రకృతి, సంగీతాలు, చలికాలాలు, ఇవన్నీ చదివేటప్పుడు మధ్యలో ఆగిపోయేవాడిని. 'ఈస్తటిక్ ట్రాష్' అనుకునే వాడిని.

అసలు ఎలాంటి బాదరబందీ లేకుండా ఇంత అందం, ఇంత సుఖం లభిస్తుంటే ఇప్పుడు చంద్రుడు - సముద్రం సృష్టిలోని ప్రతిదీ నాకు కొత్తగా కనిపిస్తోంది. విశాఖ సముద్రం వేరు. ముంబయ్ సముద్రం వేరు. అసలు నిన్నంతా నా కల. ఇప్పుడు వాస్తవం చేసుకున్నాను.

****

.ఓ రోజు నేను అనీని అడిగాను.

"నువ్వు తల్లివి కావాలనుకోవటం లేదా?"

"ఓ! నీకు చెప్పటం మరిచిపోయాను. ఆ మధ్య పిరియడ్స్ రాకపోతే అనుమానం వచ్చింది. నేనే టెస్ట్ చేసుకున్నాను. కన్ఫామ్ అయింది. వెంటనే అబార్షన్ చేయించుకున్నాను" అనగానే షాక్‌తో చూసాను.

"నాతో ఓ మాట అనుంటే బాగుండేదేమో" అన్నాను.

"నువ్వు నెలరోజులు ముంబయ్‌లో లేవు. తర్వాత నేను ఈ విషయం మరిచిపోయాను. అయినా ఇదంత ముఖ్యమైన విషయమా?"

"అఫ్‌కోర్స్. ఇలా ఎందుకు చేయాలనిపించింది?"

(ఇంకా ఉంది)

సీసీఐ కొత్త కార్యదర్శిగా ఎవరు నియమితులయ్యారు ?



కరెంట్ ఎఫైర్స్ ఆబ్జెక్టివ్ బిట్స్

1. ప్రపంచంలోని ఏడు ఖండాల్లో గల అత్యంత ఎత్తయిన శిఖరాలు అధిరోహించిన మొట్టమొదటి భారతీయ సైనికాధికారిగా రికార్డు సృష్టించింది ఎవరు ?
1. కల్నల్ ఎస్.కె.శ్రీవాస్తవ 2. కర్నల్ రణ్‌వీర్ జామ్‌వాల్
3. కల్నల్ పి.ఎస్.రాజేశ్వర్ 4. కల్నల్ విజయ్‌సింగ్

2. సూక్ష్మ, చిన్న మధ్య తరహా సంస్థల (ఎంఎస్‌ఎంఈ) ఆర్థిక సుస్థిరతకు చేపట్టాల్సిన దీర్ఘకాలిక సూచనలు చేసేందుకు భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ) ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి ఎవరు నేతృత్వం వహిస్తారు ?
1. సెబీ మాజీ చైర్మన్ యు.కె.సిన్హా
2. సెబీ మాజీ చైర్మన్ సి.బి.భావే
3. సెబీ మాజీ చైర్మన్ ఎం.దామోదరన్
4. సెబీ మాజీ చైర్మన్ జి.ఎన్.బాజ్‌పాయ్

3. భారతీయ పేటెంట్ చట్టం 1970 కింద పేటెంట్ హక్కులను కలిగి, వాణిజ్యపరంగా మార్కెట్లోకి వచ్చినదగ్గరునుండి ఎన్నేళ్లపాటు సంబంధిత ఔషధానికి ధరల నియంత్రణ వర్తించదని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ నోటిఫికేషన్ జారీచేసింది ?
1. నాలుగేళ్లు 2. ఐదు ఏళ్లు
3. ఆరేళ్లు 4. ఎనిమిదేళ్లు

4. హెన్లీ అండ్ పార్టనర్స్ పాస్‌పోర్ట్ ఇండెక్స్ రూపొందించిన ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్టుల జాబితాలో తొలి స్థానంలో నిలిచింది ఏది ?
1. జపాన్ 2. అమెరికా 3. జర్మనీ 4. ఫ్రాన్స్

5. ఐసీసీ మహిళల క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌తోపాటు వన్డే ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులను ఎవరు సొంతం చేసుకున్నారు ?
1. మిథాలి రాజ్ 2. లతిక కుమారి
3. పూనమ్ రౌత్ 4. స్మృతి మంధాన

6. టెక్సాస్‌లో ఫోర్ట్ బెండ్ కౌంటీ న్యాయమూర్తిగా భారత సంతతి అమెరికా న్యాయ నిపుణుడు ప్రమాణస్వీకారం చేశారు. ఆయన పేరేమి ?
1. మనీశా సింగ్ 2. ప్రీత్ భరారా
3. స్వాతి దండేకర్ 4. కేపీ జార్జి

7. 2019 జనవరి 13న తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో సిక్కుల పదో గురువు గురుగోబింద్ సింగ్ 350వ జయంతి సందర్భంగా ఆయన స్మారకార్థం ఎన్ని రూపాయల వెండి నాణేన్ని ప్రధాని నరేంద్రమోడీ విడుదల చేశారు ?
1. రూ.200 వెండి నాణెం 2. రూ.250 వెండి నాణెం
3. రూ.300 వెండి నాణెం 4. రూ.350 వెండి నాణెం

8. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖకు చెందిన ప్రతిష్ఠాత్మక నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ (ఎన్‌బీఈ) సభ్యుడిగా, దక్షిణ భారత ప్రతినిధిగా ఎవరు నియమితులయ్యారు ?
1. డాక్టర్ ప్రకాశ్‌చంద్ర జైన్ 2. డాక్టర్ శుభాకర్
3. డాక్టర్ పోతినేని రమేష్‌బాబు 4. డాక్టర్ కేశవులు

9. దేశంలో అగ్రకులాల్లో పేదలకు విద్య, ఉద్యోగాలంత్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని భారత ప్రభుత్వం 2019 జనవరి 7వ తేదీన కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా కల్పించిన 10 శాతంతో కలిపి మొత్తం విద్య, ఆరోగ్య రంగాల్లో ఎంత శాతం దాకా రిజర్వేషన్లు ఇకపై అమలవుతాయి?
1. 57.5 శాతం 2. 58.5 శాతం
3. 59.5 శాతం 4. 60.5 శాతం

10. ప్రతిష్ఠాత్మక గోల్డెన్‌గ్లోబ్ - 2019 పురస్కారాల వేడుకల్లో ఉత్తమ దర్శకుడిగా అవార్డును కైవసం చేసుకున్నది ఎవరు ?
1. పీటర్ ఫారెల్లీ (గ్రీన్‌బుక్) 2. బ్రాడ్‌లీ కూపర్ (స్టార్ ఈజ్ బార్న్)
3. ఆడమ్ మెక్‌కే (వైస్) 4. అల్ఫోన్సొ కారొన్ (రోమా)

11. ప్రతిష్ఠాత్మక గోల్డెన్‌గ్లోబ్ - 2019 పురస్కారాల వేడుకల్లో ఉత్తమ నటి (మ్యూజికల్ ఆర్ కామెడీ)గా అవార్డును కైవసం చేసుకున్నది ఎవరు ?
1. ఎమిలీ బ్లంట్ (మేరీ పాప్పిన్స్) 2. చార్లీజ్ థెరాన్ (టల్లీ)
3. ఒలీవియా కోల్‌మన్ (ది ఫేవరెట్) 4. కాన్‌స్టాన్స్ వు (క్రేజీ రిచ్ ఏసియన్స్)

12. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తోపాటు అనేకమంది అంతర్జాతీయ, ఫస్ట్‌క్లాస్ ఆటగాళ్లను దేశానికి అందించిన ప్రముఖ కోచ్ రమాకాంత్ అచ్రేకర్ 2019 జనవరి 2న మృతిచెందారు. ఆయనకు ఏ సంవత్సరంలో పద్మశ్రీ పురస్కారం లభించింది ?
1. 2009లో 2. 2010లో 3. 2011లో 4. 2012లో

13. కరెన్సీ విలువల్లో అస్థిరతలకు చెక్ పెట్టేందుకుగాను జపాన్‌తో ఎన్ని బిలియన్ డాలర్ల మేర ద్వైపాక్షిక స్వాప్ ఏర్పాటు ప్రతిపాదనకు ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ భేటీ ఆమోదం తెలిపింది ?
1. 75 బిలియన్ డాలర్లు 2. 85 బిలియన్ డాలర్లు
3. 95 బిలియన్ డాలర్లు 4. 105 బిలియన్ డాలర్లు

14. ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంక్ ఆఫ్ బరోదా (బీఓబీ) ఏ బ్యాంకుల విలీన ప్రక్రియకు కేంద్ర కేబినెట్ 2019 జనవరి 2న ఆమోదం తెలిపింది ?
1. కెనరా బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్
2. పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్
3. సిండికేట్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
4. దెనా బ్యాంక్, విజయా బ్యాంక్

15. దేశంలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడంతోపాటు రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఎవరి నేతృత్వంలో ఒక అత్యున్నత స్థాయి కమిటీని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఏర్పాటు చేసింది ?
1. నందన్ నీలేకని 2. హేమంత్ భార్గవ
3. యు.కె.సిన్హా 4. ఎం.వీరప్ప మొయిలీ

16. వెనిజులా అధ్యక్షునిగా రెండోసారి బాధ్యతలు చేపట్టింది ఎవరు ?
1. హ్యూగో ఛావెజ్ 2. హెన్రీ ఫాల్కన్
3. నికొలస్ మదురో 4. జేవియర్ బెర్టుక్కీ

17. బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ ఓపెన్-2019లో పురుషుల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు కైవసం చేసుకున్నారు ?
1. గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా) 2. కీ నిషికొరి (జపాన్)
3. జెరెమీ ఛార్డీ (ఫ్రాన్స్) 4. ఆండీ ముర్రే (బ్రిటన్)

18. ఆంధ్రప్రదేశ్ (ఏపీ) రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌ఓసీ) కార్యాలయం రాష్ట్రంలో ఎక్కడ ప్రారంభమైంది ?
1. తిరుపతిలో
2. విజయవాడలో
3. విశాఖపట్నంలో
4. గుంటూరులో



19. ప్రీమియర్ బ్యాడ్మింటన్ నాలుగో సీజన్‌లో విజేతగా నిలిచిన జట్టు ఏది ?
1. అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్
2. అవధ్ వారియర్స్
3. చెన్నై స్మాషర్స్ 4. బెంగళూరు రాప్టర్స్

20. అంఫి (అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా) గణాంకాల ప్రకారం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్‌ను తోసిరాజని అతిపెద్ద మ్యూచువల్ ఫండ్ కంపెనీగా అవతరించింది ఏది ?
1. ఐసీఐసీఐ మ్యూచువల్ ఫండ్ 2. ఆదిత్య బిర్లా సన్‌లైఫ్
3. హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ 4. రిలయన్స్ మ్యూచువల్ ఫండ్

21. యూఎస్‌ఏ క్రికెట్ సంఘాన్ని ఎన్నవ సభ్యదేశంగా చేర్చుకుంటున్నట్లు ఐసీసీ ప్రకటించింది ?
1. 103 దేశం 2. 104వ దేశం
3. 105వ దేశం 4. 106వ దేశం

22. నాలుగు టెస్టుల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌ను భారత్ 2-1తో సొంతం చేసుకుంది. ఎన్నేళ్ల తరువాత భారత్ ఈ సిరీస్ గెలిచింది ?
1. 70 ఏళ్ల తరువాత 2. 71 ఏళ్ల తరువాత
3. 72 ఏళ్ల తరువాత 4. 73 ఏళ్ల తరువాత

23. ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఆరో సీజన్‌లో విజేతగా నిలిచిన జట్టు ఏది ?
1. బెంగాల్ వారియర్స్ 2. హర్యానా స్టీలర్స్
3. బెంగళూరు బుల్స్ 4. తెలుగు టైటాన్స్

24. క్రికెట్ రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా భారత కెప్టెన్ విరాట్ కోహ్లి, రవిశాస్త్రిలకు 2019 జనవరి 11న సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ (ఎస్‌సీజీ) గౌరవ సభ్యత్వం అందజేసింది. ఎవరి తరువాత ఈ గౌరవం అందుకున్న ఆస్ట్రేలియేతర క్రికెటర్లుగా కోహ్లి, శాస్త్రి నిలిచారు ?
1. సచిన్ టెండూల్కర్, మార్టిన్ గప్టిల్ 2. క్రిస్ గేల్, సౌరవ్ గంగూలీ
3. సచిన్ టెండూల్కర్, బ్రియాన్ లారా 4. రాహుల్ ద్రావిడ్, జాంటీ రోడ్స్

25. 'ప్రజలు (పీపుల్), ప్రయోజనం (ప్రాఫిట్), ప్రపంచం (ప్లానెట్)' కోసం చేసిన కృషి ఆధారంగా.. దేశాధినేతల్లో ఒకరికి ఏటా అందజేసే మొట్టమొదటి 'ఫిలిప్ కాట్లర్' పురస్కారం ఎవరికి లభించింది ?
1. ఫ్రాన్స్ ప్రధాని ఎడ్వర్డ్ ఫిలిప్ 2. భారత ప్రధాని నరేంద్ర మోడీ
3. ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మారిసన్ 4. ఇటలీ ప్రధాని గియుసెప్పె కొంటె

26. 106వ భారతీయ సైన్స్ కాంగ్రెస్ (ఐఎస్‌సీ) 2019 జనవరి 3-7 తేదీల మధ్య ఎక్కడ జరిగింది ?
1. జలంధర్ (పంజాబ్) 2. జైసల్మేర్ (రాజస్థాన్)
3. వడోదర (గుజరాత్) 4. మనాలి (హిమాచల్‌ప్రదేశ్)

27. అంతర్జాతీయ బాక్సింగ్ అసోసియేషన్ (ఐబా) విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో 48 కేజీల విభాగంలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నది ఎవరు ?
1. పింకి జంగ్రా 2. మేరీ కోమ్
3. సరితాదేవి 4. సిమ్రన్‌జిత్ కౌర్

28. అత్యంత వేగంగా 19వేల అంతర్జాతీయ పరుగులు సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించింది ఎవరు ?
1. మహేంద్రసింగ్ ధోని 2. రోహిత్ శర్మ
3. శిఖర్ ధావన్ 4. విరాట్ కోహ్లి

29. మేఘాలయలో అక్రమ బొగ్గు గనుల తవ్వకాలకు అడ్డుకట్ట వేయడంలో విఫలమైనందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఎన్ని కోట్ల రూపాయల జరిమానాను విధించింది ?
1. రూ.100 కోట్లు 2. రూ.125 కోట్లు
3. రూ.150 కోట్లు 4. రూ.175 కోట్లు

30. వన్డేల్లో పదివేల పరుగులు పూర్తిచేసిన ఐదో భారత క్రికెటర్‌గా రికార్డులకెక్కింది ఎవరు ?
1. మహేంద్రసింగ్ ధోని 2. విరాట్ కోహ్లి
3. రోహిత్ శర్మ 4. శిఖర్ ధావన్

31. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఇన్ 2019 జనవరి 8, 9, 10 తేదీల్లో చైనాలో పర్యటించారు. కిమ్ చైనాలో పర్యటించడం ఇది ఎన్నవసారి ?
1. మొదటిసారి 2. రెండవసారి
3. మూడవసారి 4. నాలుగవసారి

32. ప్రతిష్ఠాత్మకమైన 'మోషన్ పిక్చర్స్ సౌండ్ ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ అమెరికా' సంస్థ భారత్‌కు చెందిన వ్యక్తిని సభ్యుడిగా ఎంపిక చేసుకుంది. ఆయన ఎవరు ?
1. సవతా సంబ్రత్
2. రసూల్ పుకుట్టి
3. సందీప్ మాధవమ్
4. సినోయ్ జోసెఫ్

33. సింగపూర్ నేషనల్ యూనివర్సిటీకి చెందిన లిక్వాన్ యు స్కూల్ అనుబంధ ఏషియా కాంపిటేటివ్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ (ఏసీఐ) సర్వే చేసి రూపొందించిన జాబితాలో సులభతర వాణిజ్యంలో దేశంలో ప్రథమస్థానంలో నిలిచిన రాష్ట్రం ఏది ?
1. ఆంధ్రప్రదేశ్ 2. మధ్యప్రదేశ్
3. అరుణాచల్ ప్రదేశ్ 4. ఉత్తరాఖండ్

34. క్యూబా విప్లవం జరిగి 2019 జనవరి 1వ తేదీ నాటికి సరిగ్గా ఎన్నేళ్లు పూర్తయ్యాయి ?
1. 50 ఏళ్లు 2. 60 ఏళ్లు
3. 70 ఏళ్లు 4. 80 ఏళ్లు

35. జీవశాస్త్రాల రంగంలోని సంస్థలకు వేదికగా నిలిచే 'బయోఏషియా' సదస్సు 2019 ఫిబ్రవరి 25 నుంచి 27 వ తేదీ వరకు ఎక్కడ జరగనుంది ?
1. జైపూర్‌లో 2. తిరువనంతపురంలో
3. బెంగళూరులో 4. హైదరాబాద్‌లో

36. హెన్రీ అండ్ పార్ట్‌నర్స్ పాస్‌పోర్ట్ ఇండెక్స్ రూపొందించిన ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్టుల జాబితాలో భారత పాస్‌పోర్టు ఎన్నవ స్థానంలో నిలిచింది ?
1. 79వ స్థానంలో 2. 80వ స్థానంలో
3. 81వ స్థానంలో 4. 82వ స్థానంలో


37. కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొత్త కార్యదర్శిగా ఎవరు నియమితులయ్యారు ?
1. పి.కె.సింగ్ 2. సుధీర్ భార్గవ
3. వినోద్‌కుమార్ యాదవ్ 4. హేమంత్ భార్గవ

38. కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్ (సీఐఐ)గా ఎవరు నియమితులయ్యారు ?
1. అనంత పద్మనాభన్ 2. ఎం.ఉమాశంకర్ కుమార్
3. సుధీర్ భార్గవ 4. పి.కె.సింగ్

సమాధానాలు

1. 2	2. 1	3. 2	4. 1	5. 4	6. 4
7. 4	8. 3	9. 3	10. 4	11. 3	12. 2
13. 1	14. 4	15. 1	16. 3	17. 2	18.2
19. 4	20. 3	21. 3	22. 2	23. 3	24.3
25. 2	26. 1	27. 2	28. 4	29. 1	30.1
31. 4	32. 2	33. 1	34. 2	35. 4	36.1
37. 1	38. 3				

ఓపీఏఎల్‌లో 31 పోస్టులు



వడోదరలోని ఓఎన్‌జీసీ పెట్రో అడిషన్స్ లిమిటెడ్ (ఓపీఏఎల్)లో ఖాళీగా ఉన్న 31 ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు...

టెక్నికల్ పోస్టులు : పాలిమర్ ఆపరేషన్స్-6, యుటిలిటీస్ అండ్ ఆఫ్‌సైట్స్-2, సెంట్రల్ టెక్నికల్ సర్వీసెస్-1, ఆపరేషన్స్ కంట్రోల్ గ్రూప్-3, ఫైర్-2, మెకానికల్ మెయింటెనెన్స్-1, సివిల్-1.

బిజినెస్ సపోర్ట్ పోస్టులు : ఫైనాన్స్-4, మెటీరియల్స్ మేనేజ్‌మెంట్-3, ఎస్‌ఏపీ-3. హ్యూమన్ రీసోర్స్-4, లీగల్-1.

అర్హత, వయసు : సంస్థ నిబంధనల ప్రకారం.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తుకు చివరితేదీ : ఫిబ్రవరి 10, 2019.

వెబ్‌సైట్ : www.opalin-dia.in

భిలాయ్ స్టీల్ ప్లాంట్‌లో 149 పోస్టులు



స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) అధ్వర్యంలోని భిలాయ్ స్టీల్ ప్లాంట్‌లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 149 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాల వారీ ఖాళీలు : ఫైర్ ఇంజనీర్-3, ఆపరేటర్ కమ్ టెక్నీషియన్ (ట్రైనీ)-116, జూనియర్ స్టాఫ్ నర్స్ (ట్రైనీ)-8, ఫార్మసిస్ట్ (ట్రైనీ)-5, జూనియర్ మెడికల్ టెక్నాలజిస్ట్ (ట్రైనీ)-17.

అర్హత : పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ ఆఫ్ ఫైర్ ఇంజనీరింగ్, మెట్రిక్యులేషన్, డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్, ఐటీఐ, బీఎస్సీ, డిగ్రీ ఇన్ ఫార్మసీ ఉత్తీర్ణతతో పాటు నిబంధనల ప్రకారం దే హధారుద్యం కూడా ఉండాలి.

వయసు : 18-28 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక : పోస్టులను బట్టి రాత పరీక్ష/ట్రేడ్ టెస్ట్/స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తుకు చివరితేదీ : ఫిబ్రవరి 9, 2019.

వెబ్‌సైట్ : https://www.sail.co.in

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో 40 పోస్టులు

ముంబైలోని షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌సీఐ)-మారిటైమ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లోని జీఎంఈ కోర్సు ద్వారా మెరైన్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు : 40 (జనరల్-20, ఓబీసీ-11, ఎస్సీ-6, ఎస్టీ-3).

అర్హత : గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 50% మార్కులతో మెకానికల్ ఇంజనీరింగ్‌లో బీఈ/ బీటెక్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. పదో తరగతి/ ఇంటర్ స్థాయిలో ఇంగ్లిష్ సబ్జెక్టులో కూడా 50% మార్కులు తప్పనిసరిగా ఉండాలి.

వయసు : ఏప్రిల్ 1, 2019 నాటికి 28 ఏళ్లకు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక : రాత పరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : జనరల్, ఓబీసీలకు రూ.1000; ఎస్సీ, ఎస్టీలకు రూ.100.

దరఖాస్తుకు చివరితేదీ : ఫిబ్రవరి 11, 2019.

రాత పరీక్ష తేదీ : ఫిబ్రవరి 17, 2019.

వెబ్‌సైట్ : www.shipindia.com



విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
358.42 ▲	128.10 ▲	0	31,760	-200 ▼	41,300	71.55
36,975.23	11,062.45	31,500 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	ప్రొద్దుటూరు 31,870 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	41,300 (కిలో (రూపాయల్లో))	ప్రొద్దుటూరు 43,848 (కిలో (రూపాయల్లో))	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాభం (శాతాల్లో)
టెక్‌మహీంద్ర	811.35	8.04
జీ ఎంటర్‌టైన్	388.00	6.20
సిప్లా	534.95	5.31
టాటాస్టీల్	486.70	4.39
గ్రాసిం	739.85	4.20

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	నష్టం (శాతాల్లో)
అదానీపోర్ట్స్	330.35	-2.78
రెడ్డీల్యాబ్స్	2,789.70	-1.13
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,526.05	-1.02
టైటన్ కంపెనీ	1,072.00	-0.72
ఎన్‌టీపీసీ	137.75	-0.69

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	71.56	71.55
యూరో	81.82	81.52
పౌండ్	93.17	92.66
ఆస్ట్రేలియా డాలర్	51.84	51.06
సింగపూర్ డాలర్	52.92	52.86

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	31,760	34,967
చెన్నై	31,760	34.967
బెంగళూరు	31,350	33,529
ముంబై	32,620	34,967
విజయవాడ	--	34,400
విశాఖపట్నం	--	33,820
ప్రొద్దుటూరు	--	33,460
ముడి చమురు	61.98	

'క్రిప్టో' గోవిందా..!?

- వ్యవస్థాపకుడు అకస్మిక మృతి
- పాస్‌వర్డ్, రికవరీ కీ మాయం
- రూ.932 కోట్లు ఫ్రీజ్





న్యూఢిల్లీ : క్రిప్టో కరెన్సీ వ్యవస్థాపకుడు గెరాల్డ్ కాటన్ అకస్మిక మరణంతో లక్షలాది మంది మదుపర్లు నిండా మునిగిపోయారు. క్రిప్టో కరెన్సీ లావాదేవీల వేదిక పాస్‌వర్డ్‌లు, రికవరీ కీ తదితర కీలక సమాచారం కేవలం గెరాల్డ్‌కు మాత్రమే తెలుసు. కెనడాకు చెందిన గెరాల్డ్ గత ఏడాది డిసెంబరులో ఆకస్మికంగా చనిపోయారు. పాస్‌వర్డ్, రికవరీ కీ తన దగ్గరే రహస్యంగా ఉంచుకోవటంతో... దాదాపు 187 మిలియన్ల కెనడా డాలర్లు (రూ.982 కోట్లు) ఫ్రీజ్ కాగ... ఈ గండం నుంచి గట్టెక్కేందుకు టెక్ నిపుణులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎలాంటి ఫలితం కనిపించలేదు. దీంతో సంస్థలోని ఇతర అధికారులు తలలు పట్టుకున్నారు. మరోవైపు గెరాల్డ్ ఎలా చనిపోయాడు? నిజంగా చనిపోయాడా లేదా కంపెనీ మోసం చేస్తోందా? అనేక అనుమానాలు, ప్రశ్నలతో ఆన్‌లైన్ దుమారం రేగింది. అంతే కాదు గెరాల్డ్ భార్య జెన్నిఫర్ రాబర్ట్‌సన్‌కు వేధింపులు, బెదిరింపులు తీవ్ర మయ్యాయి. దీంతో వీటిని నుంచి తనకూ, కంపెనీకి రక్షణ కల్పించాలంటూ ఆమె కోర్టును ఆశ్రయించారు. దీంతో బిట్‌కాయిన్, లైట్ కాయిన్, ఎథిరియం లాంటి డిజిటల్ కరెన్సీ లావాదేవీల వేదిక క్వాడ్రిగా సీఎక్స్ ఎక్స్ఛేంజ్‌కు నోవా స్కోటియా ఉన్నత న్యాయస్థానం దివాలా రక్షణను మంజూరు చేసింది. ఈ వేదికపై కరెన్సీ లావాదేవీలను నిలిపివేసింది. కేవలం అతనికి మాత్రమే తెలిసిన పాస్‌వర్డ్‌లు ఎక్కడా రాసిపెట్టలేదని, దీంతో వాటిని కనుక్కోవడం చాలా కష్టంగా మారిందంటూ కంపెనీ తరపున జెన్నిఫర్ రాబర్ట్‌సన్ అఫిటవిట్ దాఖలు చేశారు. గెరాల్డ్ సెల్ ఫోన్లు, ఇతర కంప్యూటర్లలోని సమాచారం కోసం ఎన్క్రిప్షన్లను ఛేదించడానికి నిపుణులతో ప్రయత్నిస్తున్నామనీ, కానీ ఫలితం లభించలేదన్నారు. క్వాడ్రిగాలో 363,000 ఖాతాదారుల నమోదు గాకా, సుమారు లక్షా పదిహేను వేల మంది యూజర్లకు 250 మిలియన్ల కెనడా డాలర్లు రుణపడి ఉన్నామని అఫిడవిట్‌లో రాబర్ట్‌సన్ పేర్కొన్నారు. అటు ఇన్వెస్టర్లు కూడా ఈ వ్యవహారంపై న్యాయ పోరాటానికి సిద్ధపడుతున్నారు. కాగా ఇండియాలో ఒక అనాథాశ్రయానికి సేవలందిస్తున్న క్రమంలో గెరాల్డ్ కాటన్ డిసంబరు 9న చనిపోయారని జనవరి 14న సోషల్ మీడియా ద్వారా కంపెనీ ప్రకటించింది.

లాభాల్లో ఐటీ, లోహ రంగాలు

358 పాయింట్లు నమోదుచేసిన సెన్సెక్స్



ముంబై: దేశీయ మార్కెట్లు బుధవారం సెషన్‌లో లాభాలతో ముగిశాయి. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడటంతో సూచీలు కూడా చురుగ్గా కదిలాయి. ముఖ్యంగా లోహరంగ , ఐటీ సూచీలు బాగా లాభపడ్డాయి. అడాగ్ షేర్లు బుధవారం మరింత కుంగాయి. ఒక్క రిలయన్స్ ఇన్ఫ్రానే దాదాపు 27శాతం విలువ కోల్పోయింది. మరోపక్క ఎస్ఆర్ఎఫ్ షేర్లు 10శాతం లాభపడ్డాయి. సోమవారం ట్రేడింగ్‌లో కూడా 3శాతం లాభపడ్డాయి. ఐటి ఇండెక్స్‌తో సహా సెక్టరల్ సూచీలన్నీ గ్రీన్‌లో ట్రేడ్ అయ్యాయి. బిఎస్ఇ బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 358పాయింట్లకుపైగా ర్యాలీ చేసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ కీలక 11,000మార్కును దాటింది. 30షేర్ల సెన్సెక్స్ 358.42పాయింట్లతో 0.98 శాతంతో 36,975పాయింట్లు నమోదుచేసింది.నిఫ్టీ 128.10పాయింట్లతో 1.17శాతంతో 11,062 పాయింట్లు నమోదుచేసింది. బజాజ్ ఫైనాన్స్,టాటా స్టీల్, ఓఎన్‌జిసి, బజాజ్ ఆటో, సన్‌ఫార్మా, ఎన్‌పిటిసి, కోల్ ఇండియా, టాటామోటార్స్, ఐసిఐసిఐ బ్యాంకు, రిలయన్స్ గ్రూపు 4.34శాతం లాభాల్నినమోదుచేయగా యాక్సిస్ బ్యాంకు,ఇండస్‌ఇండ్ బ్యాంకు 0.54శాతం నష్టపోయాయి. బిఎస్ఇ లార్ట్‌కాప్ 1.13శాతంతో ర్యాలీ నమోదుచేయగా, మిడ్‌కాప్ 0.12శాతం నష్టపోయింది. స్మాల్ కాప్ 0.05శాతం లాభం నమోదుచేసింది. సెక్టరల్ కేటగిరీలో బ్యాంకింగ్, ఫార్మా, మెటల్,ఐటి స్టాక్స్ ర్యాలీ నమోదుచేసి 2శాతం లాభించింది. విదేశీ మదుపరులు సుమారు రూ.420.65కోట్ల షేర్లను కొనుగోలు చేయగా, దేశీయ మదుపరులు రూ.194.31కోట్ల విలువ గల షేర్లను కోనుగోలుచేసారు. ఆసియాలో జపాన్ నిక్కీ 0.14 శాతం లాభపడింది. చైనా, కొరియా మార్కెట్లు నూతన సంవత్సరం సందర్భంగా సెలవు దినంగా ప్రకటించాయి. యూరోజోన్‌లో ఫ్రాంక్‌ఫర్ట్ డిఏఎక్స్ 0.43శాతం నష్టపోయిది. పారిస్ సిఏసి 40 0.40శాతం నష్టపోయింది. లండన్ ఎఫ్‌టిఎస్ఇ 0.32శాతం నష్టాన్నినమోదుచేసింది. డాలర్ మారకంతో రూపాయి 5పైసలు నష్టపోయి ఇంట్రా డేలో 71.62 నమోదైంది. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ 0.76శాతంతో బ్యారెల్ 61.51 వద్ద నమోదైంది.

విజ్ఞానం

2100నాటికి సముద్రజలాల రంగు మార్పు



వాతావరణంలో వస్తున్న పెను మార్పుల కారణంగా 2100 సంవత్సరం చివరి నాటికి సముద్రజలాల రంగు ముదురుగా మారనుందని శాస్త్రజ్ఞులు ఆందోళన చెందుతున్నారు. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అధ్యయనకారులు నివేదిక ఆధారంగా ప్రపంచంలోని సగం సముద్రజలాల రంగు ఆల్గే ప్రభావంతో రంగు మారనున్నట్లు తెలుస్తోంది. సబ్‌ట్రాపిక్స్‌లోని ప్రాంతాల జలాల రంగు మరింత నీలంగా మారనుంది. నీటిలో జీవించే ఫైటోప్లాంక్‌టన్ అనే ఏకకణజీవులపై ఈ ప్రభావం మరింత పడనుంది. ధృవప్రాంతాల్లోని పచ్చని ప్రాంతాలు ముదురు పచ్చగా మారనున్నాయి. ఇవి కంటికి కనపడని చర్యలే... భూమధ్య రేఖాప్రాంతాలు, ధృవప్రాంతాల్లోని నీరు మరింత ముదురుగా మారనున్నాయని పేర్కొన్నారు. నీటిలో ఉండే మాలిక్యూల్స్ సూర్యకాంతిలోని నీలంరంగును మినహాయించి మిగిలిన రంగులను సంగ్రహించడంతో నీరు నీలంగా మనకు కనిపిస్తుంది.కానీ సముద్రంలోని జీవులు ఉదాహరణకు ఫైటోప్లాంక్‌టన్ ఆకపచ్చరంగును తక్కువగా సంగ్రహించడంతో పచ్చగా కనిపిస్తుంది. ఉష్ణోగ్రత, సముద్రపు రంగుకు ఉన్న సంబంధంపై పరిశీలన చేసారు. 2100 నాటికి ఉష్ణోగ్రత మూడు డిగ్రీల సెల్సియస్‌కు చేరినట్లయితే ఏం జరుగుతుందనే దానిపై పరిశీలన ఇంకా కొనసాగుతోంది. శాటిలైట్ల ద్వారా ఈ మార్పులను గమనించవచ్చు..వీటిద్వారా సముద్ర జలాల్లో జరుగుతున్న పర్యావరణ మార్పులను తెలుసుకోవచ్చు..

వ్యాయామంతో ఆలోచనాపటిమ మెరుగు..



క్రమం తప్పని వ్యాయామంతో ఆలోచనా పటిమని పెంచుకోవచ్చునని తెలుస్తోంది. కేవలం వృద్ధులలోనే కాకుండా యువకుల్లో సైతం క్రమం తప్పని ఏరోబిక్ వ్యాయామం జ్ఞాపకశక్తిని, ఆలోచనా నైపుణ్యాలను ప్రభావితం చేస్తుందని తాజా అధ్యయన వెల్లడించింది. వాకింగ్, సైక్లింగ్‌తోపాటు మెట్లు ఎక్కడం వంటి వాటితో మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చు.. వ్యాయామం మన నడత, పద్ధతులపై ప్రభావంచూపుతుంది. లక్ష్యాలను నిర్దేశిస్తుంది. వయసుపెరిగే కొలదీ, ఆలోచనా నైపుణ్యత తగ్గుతుందనేది ఇప్పటివరకూ ఉన్న అభిప్రాయం. క్రమం తప్పకుండా చేసే వ్యాయామంతో దీనికి చెక్ పెట్టవచ్చు..వ్యాయామంతో మెదడు పైపొర మందంకూడా పెరుగుతుంది. 20 నుండి 67 ఏళ్ల వయసున్న 132మందిపై చేపట్టిన అధ్యయనంలో పొగతాగనివారిలో సైతం వ్యాయామం లేకపోతే వారిలో ఫిట్‌నెట్ శాతం తగ్గినట్లుతెలుస్తోంది. ఆరునెలలపాటు ఎయిరోబిక్ వ్యాయామం కనీసం వారానికి నాలుగుసార్లు చేసినవారిలో పలు మార్పులను చూడవచ్చు..

రూ.3.5 లక్షల కోట్ల మొండి బకాయిలు

హెచ్చరించిన ఇండియా రేటింగ్స్

ముంబై: కార్పొరేట్ రుణాల్లో మరో రూ.3.50 లక్షల కోట్లు మొండి బకాయిలుగా మారే అవకాశం ఉందని తాజా నివేదిక ఒకటి హెచ్చరించింది. గత ఏడాది సెప్టెంబరు నాటికి రూ.13.5-14 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలు ఒత్తిడిని ఎదుర్కొంటుండగా.. అందులో రూ.3.5 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు ఇంకా అధికారికంగా (ఒత్తిడిలో ఉన్నట్లు) గుర్తించలేదని ఇండియా రేటింగ్స్ నివేదిక వెల్లడించింది. అధికారికంగా గుర్తించని వాటిలో 40 శాతం (రూ.1.5-2 లక్షల కోట్లు) మేర రుణాలు 2020 సెప్టెంబరు కల్లా మొండి పద్దులోకి చేరే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. వీటి కోసం బ్యాంకులు అదనంగా రూ.40 వేల కోట్ల మేర కేటాయింపులు జరపాల్సి రావచ్చని ఇండియా రేటింగ్స్‌లో బ్యాంకింగ్, ఆర్థిక సేవల సంస్థల విభాగ అసోసియేట్ డైరెక్టర్ జిందాల్ హరియా అన్నారు

నానో తయారీ... అమ్మకాలూ లేవు



న్యూఢిల్లీ: టాటా మోటార్స్ చిన్న కారు నానో జనవరిలో ఒక్క నానోను కూడా తయారు చేయలేదు ఒక్కటీ అమ్ముడు పోలేదు. ఈ ఏడాది అక్టోబర్ నుంచి నూతన భద్రతా ప్రమాణాలు, 2020 ఏప్రిల్ నుంచి వచ్చే బీఎస్ -6 కాలుష్య నియంత్రణ ప్రమాణాలకు అనుగుణంగా నానో కారును ఆధునీకరించే ప్రణాళికలు ఏవీ లేవని ఇటీవలే టాటా మోటార్స్ సేల్స్ విభాగం హెడ్ ప్రకటించిన విషయం గమనార్హం. ఈ ఏడాది జనవరిలో ఒక్కనానో కారును కూడా తయారు చేయలేదని, గతేడాది ఇదే నెలలో మాత్రం 83 నానో కార్లను తయారు చేసినట్టు టాటా మోటార్స్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఇచ్చిన సమాచారంలో పేర్కొంది. ఇక 2018 జవవరిలో దేశీయ మార్కెట్లో 62 నానో కార్లు అమ్ముడుపోగా, 2019 జనవరిలో ఒక్క నానో కూడా విక్రయం కాలేదని టాటా మోటార్స్ తెలిపింది. ఇక ఎగుమతుల విషయానికొస్తే గత నెలలో ఒక్క యూనిట్‌ను ఎగుమతి చేయలేదని, గతేడాది ఇదే నెలలోనూ ఇదే పరిస్థితి ఉందని వెల్లడించింది. ఈ విషయమై టాటా మోటార్స్ కంపెనీ ప్రతినిధిని మీడియా ప్రశ్నించగా... ప్రస్తుత రూపంలో ఉన్న నానో నూతన భద్రతా, కాలుష్య ప్రమాణాలను చేరలేదని, కొత్త పెట్టుబడులు అవసరమని చెప్పారు. ఈ విషయంలో ఇంత వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. కస్టమర్ల నుంచి డిమాండ్ ఉంటే నానోను తయారు చేస్తామని చెప్పారు. టాటా మోటార్స్ గతేడాది జూన్‌లో ఒక్క నానో కారును తయారు చేయగా, అదే నెలలో దేశీయ మార్కెట్లో మూడు నానో వాహనాలను విక్రయించింది. మధ్యతరగతి వర్గాలను లక్ష్యంగా చేసుకుని టాటా మోటార్స్ నానో కారును తొలిసారిగా 2008లో మార్కెట్‌కు పరిచయం చేసింది.

హైదరాబాద్‌లో ఎస్‌హెచ్‌జీ ఆఫీసు

విశాలాంధ్ర, హైదరాబాద్ బ్యూరో : ఉన్నత విద్యపై ఆసక్తి కలిగిన విద్యార్థులకు సేవలందించడానికి దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్‌హెచ్‌జీ హాస్పిటాలిటి గ్రూప్ డైరెక్టర్ ఎమిలైన్, ఎనిలిన్ క్యాంపస్ మేనేజర్ వసుధ మురళికృష్ణ తెలిపారు. ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించడం కోసం 2020నాటికి 10వేల మంది విద్యార్థులను పంపించాలని నిర్ణయించినట్లు వారు వెల్లడించారు. బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన సంస్థ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంతర్జాతీయ నాణ్యతతో బోధన చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఇటలీ, పారిస్‌లో తమ కళాశాలలు ఉన్నాయని, ఫ్రాన్స్‌లో 5కళాశాలలు ఉన్నాయని, వీటిని 50 స్కూల్స్‌లా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దేశంలోని అన్ని ప్రధాన పట్టణాల్లో తమ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యాబోధన పూర్తి అయిన వారికి ప్రపంచంలో పేరొందిన సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అడ్మిషన్ మేనేజర్ సంజీవ్ బాబు పాల్గొన్నారు.

టెక్ మహీంద్రా ఆదాయం 15శాతం వృద్ధి

న్యూఢిల్లీ : డిసెంబరుతో ముగిసిన త్రైమాసికం దేశీయ ఐటీ దిగ్గజం 'టెక్ మహీంద్రా'కు బాగానే కలిసొచ్చింది. అనుబంధ కంపెనీలతో కలిపి ఈ కాలానికి కంపెనీ రూ.8,944 కోట్ల రాబడులపై రూ.1,203 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 15 శాతం, నికర లాభం 27.5 శాతం పెరిగాయి. 'ఈ త్రైమాసికంలో రాబడులతో పాటు లాభ శాతమూ పెంచుకున్నాం. ఈ సంవత్సరానికి లక్ష్యంగా నిర్ణయించిన 500 కోట్ల డాలర్ల వార్షిక టర్నోవర్‌ను చేరుకోవడం ఆచరణ యోగ్యంగానే కనిపిస్తోంది' అని కంపెనీ సీఈఓ సీపీ గుర్నానీ తెలిపారు.

'అనిల్' షేర్లు అధోగతి...!

ముఖ విలువ కంటే దిగువకు...



ముంబై : అనిల్ ధీరుభాయ్ అంబానీకి చెందిన కీలక కంపెనీల షేర్లు మార్కెట్లో ఘోరంగా దిగజారాయి. ఈ వారం లావాదేవీల ఆరంభం నుంచి అనిల్ అంబానీ కంపెనీలు కోలుకోని దెబ్బ తింటున్న క్రమంలో.. ఆయా కంపెనీల షేర్ల పతనం బుధవారం మరింత వేగంగా నేలకు దూసుకు వెళ్లాయి. ఒక దశలో ఆర్‌కామ్ షేరు ధర ముఖవిలువ రూ.5 కంటే పడిపోయింది. రిలయన్స్ ఇన్ఫ్రా షేరు విలువ దాదాపు 27శాతం పతనమైంది. విక్రయాలు ఐదింతలు పెరగటం మదుపరులు ఆందోళన చెందారు. దాదాపు 325.5 లక్షల వాటాలు చేతులు మారాయి. ఈ మొత్తం కంపెనీ పెట్టుబడిలో 12.6 శాతంకు సమానం. ప్రమోటర్ల షేర్లు తనఖాలోకి వెళ్లడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. ఒకప్పుడు టెలికాం రంగాన్ని శాసించిన ఆర్‌కామ్ పరిస్థితి దయనీయంగా మారింది. ఈ షేరు విలువ బుధవారం 11శాతం కుంగి రూ.4.85కు చేరింది. ఇది ముఖ విలువ కంటే తక్కువ. కేవలం మూడు లావాదేవీల్లో ఆర్‌కామ్ 58 శాతం విలువ కోల్పోవడం విశేషం. దివాలా ప్రక్రియపై ఆర్‌కామ్ శుక్రవారం సాయంత్రం చేసిన ప్రకటనతోనే ఈ పరిస్థితి తలెత్తింది. ఇక ఇదిలా ఉంటే..రిలయన్స్ పవర్ 14 శాతం పడిపోయి రూ.10.30కు చేరింది. రిలయన్స్ హోం ఫైనాన్స్ 12 శాతం కుంగి 31.55 వద్దకు, రిలయన్స్ నేవల్ అండ్ ఇంజినీరింగ్ 11 శాతం కుంగి 7.75 మార్కును తాకాయి. అడాగ్ గ్రూప్‌లోని ఆరు లిస్టెడ్ కంపెనీలు కలిపి 25-61శాతం వరకు విలువ కోల్పోయాయి. ఒక్క రిలయన్స్ నిప్పన్ లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ పరిస్థితి మాత్రం కాస్త ఫరవాలేదు.

7 నుంచి దరఖాస్తుల స్వీకరణ

పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ లోక్‌సభ, అసెంబ్లీ టిక్కెట్లకు ఈ నెల 7 నుంచి 10వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2019లో పోటీ చేయాలనుకునే కాంగ్రెస్ ఆశావాహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. తొలిరోజున అనంతపురం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కళ్యాణదుర్గం శాసనసభ నుంచి పార్టీ టిక్కెట్టు కోరుతూ తన దరఖాస్తును పార్టీ నేతలకు పంపుతానని వివరించారు. 2009 నుంచి 2014 వరకు కళ్యాణదుర్గం అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించానని పేర్కొన్నారు. 2014 ఎన్నికల్లో పెనుగొండ అసెంబ్లీ నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యానని గుర్తుచేశారు. కళ్యాణదుర్గం అసెంబ్లీ కాంగ్రెస్ శ్రేణుల కోరిక మేరకు ఈ నెల 7వ తేదీ ఉదయం 10.30 గంటలకు దరఖాస్తు చేస్తానని రఘువీరారెడ్డి వివరించారు.

విదేశీయులకు ఎన్‌బీడబ్ల్యూజారీ

విశాలాంధ్ర-విశాఖ సిటీ బ్యూరో: ఒక కేసులో కోర్టుకు హాజరు కాని ముగ్గురు విదేశీయులకు విశాఖ నాలుగవ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ న్యాయమూర్తి బుధవారం ఓ నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీచేశారు. వివరాల్లోకి వెళితే ఆడి సురేష్‌బాబుకు సూర్యశక్తి ఇండియా ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య వివాదంపై కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ కేసులో సూర్యశక్తి ఇండియా ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ఏ2 పీటర్ కె.స్నీబెర్జర్ (అమెరికా), ఏ4 మద్దిశెట్టి సత్యరామానందం (ఫ్రెంచి) ఏ5 ఆంధ్రా యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ మట్టా వెంకటకృష్ణయ్య కోర్టుకు హాజరు కావడం లేదని ఆడి సురేష్‌బాబు కోర్టును ఆశ్రయించారు. దీంతో ముగ్గురు నిందితులకు న్యాయమూర్తి ఎన్‌బీడబ్ల్యూ జారీ చేశారు. తదుపరి విచారణను మార్చి 13కు వాయిదా వేశారు.

కెనరా స్మాల్ క్యాప్ ఫండ్ ఆవిష్కరణ

విజయవాడ : తమ నూతన ఫండ్ ఆఫర్‌ను ఓపెన్ ఎండెడ్ పథకంగా ఆవిష్కరిస్తున్నట్లు కెనరా రొబెకో ఎస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ వెల్లడించింది. ఈ పథకాన్ని స్మాల్ క్యాప్ కంపెనీలలో పెట్టుబడి పెట్టేందుకు లక్ష్యంగా చేసుకున్నారు. సుదీర్ఘకాలంలో ఇతర ఈక్విటీ తరగతులతో పోలిస్తే అత్యధిక రాబడులను సృష్టించే సామర్థ్యం ఈ స్మాల్ క్యాప్ కంపెనీలకు ఉంటుంది. ఈ ఎన్ఎఫ్ఓ జనవరి 25 న తెరిచారు. మరియు ఫిబ్రవరి 8న ముగుస్తుంది. ఈ స్కీమ్‌లో భాగంగా కనీసం 65శాతం కార్పస్ స్మాల్ క్యాప్ కంపెనీల ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత ఇన్స్ట్రుమెంట్స్‌లో పెట్టుబడిగా పెడతారు. ఈ ఫోర్ట్ ఫోలియోలో 35 శాతం వరకూ నిధులను లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్ ఫోర్ట్ ఫోలియో బీటాను నిర్వహించేందుకు పెట్టుబడిగా పెడతారు. కెనరా రొబెకో మ్యూచువల్ ఫండ్ సీఈవో, మాట్లాడుతూ రజనీశ్ నరులా మాట్లాడుతూ, "ఓవిభాగంగా స్మాల్ క్యాప్ పథకాలు ఆదరణ పొందుతున్నాయి. దీర్ఘకాలంలో అత్యుత్తమ రాబడులను అందించే సామర్థ్యం వీటికి ఉంది. ప్రస్తుత మార్కెట్ ఒడిదుడుకులను పరిగణలోకి తీసుకుంటే, స్మాల్ క్యాప్స్ ఖచ్చితంగా ఇన్వెస్టర్ల ఎస్సెట్ కేటాయింపుల్లో భాగంగా ఉండాలి. మా నూతన స్మాల్ క్యాప్ ఫండ్ తో మేము స్థిరంగా ఆదాయం పొందుతున్న కంపెనీలలో పెట్టుబడులు పెట్టడానికి చూస్తున్నాం" అన్నారు.

మార్చి31 వరకూ ఇసుజు డీసర్వీస్ పథకం...!



విజయవాడ : వినియోగదారుల నుంచి వస్తున్న ప్రోత్సాహకరమైన స్పందన నేపథ్యంలో ఇసుజు మోటార్స్ ఇండియా డీ-మ్యాక్స్ రెగ్యులర్ క్యాబ్ మోడల్స్ పై తమ డీ-సర్వీస్ పథకాన్ని మార్చి31, వరకూ పొడిగించింది. ఈ పథకాన్ని మొద టిసారిగా సెప్టెంబర్ 2018న ఆవిష్కరిం చారు. భారతదేశంలో డీ-మ్యాక్స్ రెగ్యులర్ క్యాబ్ కొనుగోలుదారుల నుంచి ఈ పథకానికి అపూర్వ స్పందన లభించింది. ఈ పథకం గణనీయమైన విలువ ప్రతిపాదనను అతి తక్కువ యాజమాన్య నిర్వహణ ఖర్చును అదనపు ఖర్చు లేకుండా అందిస్తోంది. డీ-మ్యాక్స్ రెగ్యులర్ క్యాబ్ ఓ ప్రాధాన్యత పికప్ ట్రక్ గా వాణిజ్య వేత్తలు, ఔత్సాహిక వ్యాపారవేత్తల నడుమ నిలుస్తోంది. ఈ డీ-సర్వ్ పథకంలో మూడు సంవత్సరాలు/ ఒక లక్ష కిలోమీటర్లు (ఏది ముందు అయితే అది) కోసం ఉచిత పిరియాడిక్ మెయిన్‌టెనెన్స్ - వీటిలో పీఎంఎస్ భాగాలు, లూబ్రికెంట్స్, సంబంధిత లేబర్ ఖర్చులు, కొన్ని రకాల వేర్ అండ్ టేర్ ఉత్పత్తులు ఉంటాయి. ప్రమాదం వల్ల కలిగిన నష్టానికి చేసే మరమ్మత్తులు దీనిలో ఉండవు (నియమ నిబంధనలు వర్తిస్తాయి) వినియోగదారులు తమ దగ్గరలోని ఇసుజు ఆధీకృత డీలర్ ఔట్‌లెట్‌లో ఈ పథకంలోని మరిన్ని వివరాల కోసం సంప్రదించవచ్చు.

పీఎంఏవై ఇళ్లకు ఆధార్ రూ.176 కోట్ల సబ్సిడీ...!

విజయవాడ : ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బి) రూ.175.56 కోట్ల సీఎల్ఎస్ఎస్ సబ్సీడీని అందించనుంది. మొత్తం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) పథకంలో ఆర్థికంగా బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్), అల్పాదాయ వర్గాల (ఎల్ఐజి)కు చెందిన 7592 మంది అర్హులకు లబ్ధి చేకూర్చనుంది. ఈ సబ్సీడీ లబ్ధిదారుల రుణ ఖాతాకు జమచేస్తారు. దీంతో నెలవారీ చెల్లించే ఈఎంఐ మొత్తాన్ని తగ్గుతుంది. డిసెంబర్ 31, 2018 నాటికి ఆధార్, ప్రభుత్వ సిఎల్ఎస్ఎస్ సబ్సీడీని దాదాపు 10,000 కుటుంబాలకు అందజేసింది. ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ ఎండి అండ్ సీఈవో డియో శంకర్ త్రిపాఠి మాట్లాడుతూ " దేశంలోని అల్పాదాయ వర్గాలు, ఆర్థికంగా బలహీన వర్గాలకు ఆధార్ అండగా ఉంటుందని, పిఎంఎవై ఒక గొప్ప ప్రేరక శక్తిగా పనిచేస్తుంది. పలు కార్యక్రమాల ద్వారా పిఎంఎవై గురించి విస్తృతమైన అవగాహనను కలిగిస్తూ 2022 నాటికి అందరికీ గృహాలను అందజేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి మద్దతు నివ్వడం కోసం లబ్ధిదారులకు క్రెడిట్ లింక్డ్ సబ్సీడీని అందించేందుకు క్షేత్ర స్థాయి నుంచి పూర్తి సహకారాన్ని అందిస్తుంది." అని అన్నారు.

ఇంగ్లిష్, మ్యాథ్స్ నేర్చుకోవడం

ఇకపై ఈజీ..



విద్యా రంగంలో స్టార్టప్స్ అంటే? స్కూల్ సిలబస్‌ను స్మార్ట్‌ఫోన్లలోకి తీసుకొచ్చినవి.. ఆన్‌లైన్‌లో ఫీజులు, పాఠశాల నిర్వహణ చేసేవి.. లంచ్ బాక్స్‌లు అందించేవి..., స్కూల్ బిల్డింగ్స్ నిర్మాణం కోసం రుణాలిచ్చేవి... ఇలా చాలా ఉన్నాయి. కానీ, దేశంలో తొలిసారిగా వ్యక్తిగత విద్యార్థుల అభ్యసన ప్రక్రియలను అందుబాటులోకి తెచ్చింది మాత్రం హైదరాబాద్‌కు చెందిన '360 లెర్నింగ్ ఎడ్యుకేట్.కామ్'. అందులోనూ ఇంగ్లిష్, గణితం వంటి కీలక సబ్జెక్ట్స్ వర్క్‌షీట్స్‌ను కూడా అభివృద్ధి చేసింది. సంస్థ సహ వ్యవస్థాపకుడు జితేంద్ర మాచిరాజు స్వస్థలం తూర్పు గోదావరి జిల్లా. బీటెక్ పూర్తయ్యాక ఆయన ఎక్సీడ్ ఎడ్యుకేషన్‌లో ఎనిమిది సంవత్సరాలు పనిచేశారు. తర్వాత హయత్‌నగర్, చంపాపేట్‌లో సొంతంగా పాఠశాలలు నిర్వహించారు. ఎక్సీడ్‌లో, స్కూల్స్‌లో ఉన్న సమయంలో ఆయన మన విద్యావ్యవస్థలో కొన్ని లోపాలను గుర్తించారు. విదేశాల్లో మాదిరిగా మనదేశంలోని పాఠశాలల్లో వ్యక్తిగత అభ్యసన ప్రక్రియలు లేకపోవడం వాటిల్లో ఒకటి. దీనివల్లే విద్యార్థుల విద్యా విధానంలో తేడాలొస్తున్నాయని ఆయన గమనించారు. దీన్ని అధిగమించాలంటే విద్యార్థులకు పర్సనల్ లెర్నింగ్ కావాలి. అందుకే మిత్రుడు కర్నాటి ప్రమోద్ కుమార్‌తో కలిసి 2015 నవంబర్ 14న రూ.10 లక్షల పెట్టుబడితో హైదరాబాద్ కేంద్రంగా 360 లెర్నింగ్‌ఎడ్యుటెక్.కామ్‌ను ప్రారంభించారు.

ఇంటికే వర్క్‌షీట్స్..

ప్రస్తుతం 3 నుంచి 13 ఏళ్ల వయస్సు విద్యార్థులు లేదా 8వ తరగతి లోపు విద్యార్థులకు గణితం, ఇంగ్లిష్ సబ్జెక్ట్స్ వర్క్‌షీట్స్ ఈ సంస్థ అందిస్తోంది. పోటీ పరీక్షలతో సహా దేనికైనా మ్యాథ్స్, ఇంగ్లిష్‌పై పట్టుండాలి. అందుకే ఈ సబ్జెక్ట్స్ మీద ఈ సంస్థ దృష్టి పెట్టింది. విద్యార్థి పరిజ్ఞానం, అభ్యసన తీరును బట్టి ఒక్కొక్క విద్యార్థికి ప్రత్యేకంగా వర్క్‌షీట్స్‌ను ఈ సంస్థ రూపొందిస్తోంది. ఇందుకోసం 8 మంది నిపుణుల బృందం ఉంది. ఇందులో సబ్జెక్ట్స్ నిపుణులతో పాటూ పిల్లల మానసిక వేత్తలూ ఉంటారు. వర్క్‌షీట్స్‌ను పరిష్కరించేటపుడు ఏమైనా సందేహాలొస్తే... వీడియోకాల్ ద్వారా నిపుణులు అందుబాటులోకి వస్తారు. ప్రతి వారం విద్యార్థికి వ్యక్తిగత వర్క్‌షీట్స్‌ను ఇంటికి తీసుకెళ్లి ఈ సంస్థ సిబ్బంది అందజేస్తారు. వాటిని పరిష్కరించాక నిపుణుల బృందం పరిశీలిస్తుంది. తర్వాత విద్యార్థి అభ్యసన శక్తిని అంచనా వేసి వేరే వర్క్‌షీట్స్‌ను అందిస్తుంటారు.

రూ.5 కోట్ల నిధుల సమీకరణ..

2017లో రూ.75 లక్షల ఆదాయాన్ని ఈ సంస్థ ఆర్జించింది. గత ఏడాది రూ.2 కోట్లు వ్యాపారాన్ని చేరుకోవచ్చని అంచనా. త్వరలో బెంగళూరు, చెన్నై, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో సేవలను సంస్థ యాజమాన్యం ప్రారంభించనుంది. ప్రస్తుతం ఈ సంస్థలో 40 మంది ఉద్యోగులున్నారు. అజయ్ ఈదూరి, రవి మంథా ఇద్దరు కలిసి సీడ్ రౌండ్‌లో రూ.1.2 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఏంజిల్ రౌండ్‌లో ఈ సంస్థ రూ.5 కోట్లు సమీకరించనుంది. ఇందుకోసం పెట్టుబడిదారులతో చర్చలు జరుగుతున్నాయి. 6 నెలల్లో ఆరు నెలల్లో ఒప్పందం చేసుకుంటామని జితేంద్ర వివరించారు.



5 నెలలకు రూ.5 వేలు..

ప్రస్తుతం '360 లెర్నింగ్'లో 3,500 మంది విద్యార్థులున్నారు. ఒక్క విద్యార్థికి ఒక్క సబ్జెక్ట్ వర్క్‌షీట్స్‌కు గాను 5 నెలలకు రూ.5 వేలు చార్జీ ఉంటుంది. త్వరలో ఐఐటీ ఫౌండేషన్ వర్క్‌షీట్స్‌ను విద్యార్థులకు ఈ సంస్థ అందించనుంది. ఏడాదిలో మరో 2 వేల మంది విద్యార్థులను చేరుకోవటంతో పాటూ 10, 12వ తరగతుల గణితం, ఇంగ్లిష్ సిలబస్‌లను అందుబాటులోకి తేవాలని సంస్థ నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం ఆయా సిలబస్‌ల వర్క్‌షీట్స్ రూపొందిస్తున్నారు. ఈ సంస్థ యాజమాన్యం త్వరలోనే పాఠశాలలతో ఒప్పందం చేసుకోనుంది. ఏడాదిలో సుమారు 15 పాఠశాలలతో ఒప్పందంతో సుమారు రూ.కోటి వ్యాపారం చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

కెరీర్‌లో ప్రమోషన్

నిజాయితీ, నిబద్ధతతోనే



కెరీర్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నా.. తమకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ప్రమోషన్ రూపంలో పొందాలన్నా నిజాయితీతో కూడిన నిబంద్ధత అవసరం. అయితే.. యాజమాన్యం ఒక ఉద్యోగికి ప్రమోషన్ కల్పించాలంటే కేవలం ఆ వ్యక్తి వ్యక్తిత్వాన్ని బేరీజు వేసుకుని మాత్రమే నిర్ణయం తీసుకోదు. ఇంకా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. వాటి గురించి తెలుసుకుందాం.

సమయ పాలన ముఖ్యమే..

ఏ రంగంలో రాణించాలన్నా సమయ పాలన చాలా కీలకం. అందుకే ఉద్యోగులు ఎంత బాగా పనిచేసినా సమయపాలనకు కూడా ప్రాధాన్యమివ్వాలి. ఒక సంస్థలో ఉద్యోగికి అదనపు బాధ్యతలు అప్పగించాలని భావించినప్పుడు పనితీరు సమీక్షలో యాజమాన్యం కేవలం మనమెలా పనిచేస్తున్నామో అన్న ఒక్క విషయంమీదే ఆధారపడి నిర్ణయం తీసుకోదు. సమయ పాలన, అటెండెన్స్ రికార్డు, సంస్థ ఉన్నతి కోసం ఉద్యోగి ఎంతవరకు అదనపు సమయాన్ని కేటాయిస్తున్నారు.. ఆ క్రమంలో సంస్థ అభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలా దోహదపడుతున్నారు.. అన్న కోణం నుంచి కూడా ఆలోచించి అధికారులు ఆ ఉద్యోగికి నూతన బాధ్యతలు అప్పగిస్తారు. అందుకే పని ఎంత బాగా చేసినా సంస్థ విధివిధానాలను పాటించడంలో కూడా ఉద్యోగులు నిజాయితీగానే ఉండాలి.

నైపుణ్యాలు కూడా..

ఒక విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగిని ప్రమోషన్ మీద మరో విభాగానికి బదిలీ చేసేటప్పుడు ఆ ఉద్యోగిలో ఎలాంటి నైపుణ్యాలున్నాయన్న విషయాన్ని కూడా యాజమాన్యం పరిశీలిస్తుంది. దానినిబట్టే నిర్ణయం తీసుకుంటుంది. ఉద్యోగంలో చేరేముందు ఆ అభ్యర్థికి ఉన్న నైపుణ్యాలేమిటి? ఉద్యోగంలో చేరాక తన అభిరుచితో అదనంగా నేర్చుకున్న అంశాలేమిటి? అన్న విషయం మీద కూడా యాజమాన్యం దృష్టిని కేంద్రీకరిస్తుంది. ప్రస్తుత కాలంలో చాలామంది ఉద్యోగం చేస్తూనే కరస్పాండెన్స్ కోర్సులు చేయడం లేదా ఆయా పరీక్షలకు హాజరై సర్టిఫికేషన్లు పొందడం ద్వారా తమ వృత్తికి సంబంధించిన అదనపు జ్ఞానాన్ని పెంచుకుంటున్నారు. పదోన్నతులు పొందుతున్నప్పుడు ఇలాంటి అదనపు అర్హతలు బాగా పనికొస్తాయి.

నాయకత్వ లక్షణాలు

ఒక ఉద్యోగికి పదోన్నతి కల్పించే అంశంలో ఆ వ్యక్తిలో నాయకత్వ లక్షణాలు ఎంతవరకు ఉన్నాయన్న విషయాన్ని కూడా యాజమాన్యం పరిశీలిస్తుంది. ఆ ఉద్యోగి వ్యక్తిత్వం.. తోటి ఉద్యోగులతో నడుచుకుంటున్న తీరు.. పనిలో నిజాయతీ.. నిబద్ధత.. అదనపు బాధ్యతలు అప్పగించినప్పుడు వాటిని సమర్థంగా పూర్తిచేసే తీరు.. కొత్త బాధ్యతలు స్వీకరిస్తున్నప్పుడు కనబచ్చే ఆసక్తి.. మొదలైన విషయాలను అధికారులు పరిగణనలోకి తీసుకుంటారు. కొన్ని సందర్భాలలో ఒకవైపు సంస్థలో పనిచేస్తూనే బయట క్రీడల్లో, కళల్లో తమ ప్రతిభను నిరూపించుకునే ఉద్యోగులను కూడా యాజమాన్యం ప్రోత్సహిస్తుంది.

ఆలోచనలు పంచుకోవాలి..

'మీ ఆలోచనలను ఒకరితో పంచుకోవడం కూడా ఒక నైపుణ్యమే' అన్నది నిపుణులు చెప్పే మాట. అందుకే, కెరీర్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలనుకునే ఉద్యోగులు తమ ఆలోచనలను ఎప్పటికప్పుడు పై అధికారులతో పంచుకోవాలి. తమను తాము పనివిషయంలో ఇంకా ఎలా మెరుగుపరచుకోవచ్చో అడుగుతూ, వారి సలహాలు, సూచనలు తీసుకోవాలి. మీ మేనేజర్‌నే మీ మెంటార్‌గా భావించి మీ ఆలోచనలు పంచుకున్నా తప్పులేదు. అలాగే, మీరు కూడా మీ కంపెనీ అభివృద్ధి కోసం ఏవైనా సలహాలు ఇవ్వాలనుకుంటే వాటిని నిరభ్యంతరంగా ఇవ్వవచ్చు. ఇలా చేయడంవల్ల మీ పై అధికారులకు మీమీద ఒక మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. దీనివల్ల మీకు పదోన్నతి కల్పించాలని సంస్థ భావించినప్పుడు, వారు మీగురించి సానుకూలమైన ఫీడ్‌బ్యాక్ ఇవ్వడానికి ఆస్కారం ఉంటుంది.

వివాదాల జోలికి వెళ్లొద్దు

కెరీర్‌లో ఒక ఉజ్వలమైన భవితకు నాంది పలకాలనుకునేవారు ఎలాంటి వివాదాలు, రాజకీయాల జోలికి వెళ్లకుండా ఉండడమే మంచిది. కష్టపడితేనే ఫలితం దక్కుతుందనే విషయాన్ని గట్టిగా నమ్ముతూ, తనకున్న పరిధిలో శక్తివంచన లేకుండా కృషిచేయడానికి ప్రయత్నించాలి. సంస్థ గౌరవానికి భంగం కలుగకుండా నడుచుకోవాలి. ఉద్యోగులతో సఖ్యతగా ఉంటూ, వీలైతే సహోద్యోగులకు పనిలో సహాయపడుతూ ఉండాలి. తమకున్న జ్ఞానాన్ని వారితో పంచుకుంటూ ఒక ఆరోగ్యకరమైన వాతావరణానికి నాంది పలకాలి. ఏ సంస్థలోనైనా అలాంటి ఉద్యోగులనే యాజమాన్యం ప్రోత్సహిస్తుంది. కెరీర్‌లో నిజమైన నాయకుడిగా దూసుకుపోవాలన్నా.. పదోన్నతి పొంది మీ సంస్థలోనే చక్కని భవిష్యత్‌ను అందుకోవాలన్నా ఈ విజయ సూత్రాలను పాటించాలి.



ఈ అమ్మడు

అనుష్కలా ఉందే !

ఇటీవల సెలబ్రిటీల ట్విన్ లుక్‌తో ఫోటోలు అంతర్జాలంలో హల్‌చల్ చేస్తున్నాయి. ఒకే తర హాలో ఉన్న వారి పోలికల్ని చూసుకుని మురిసి పోవడం అభిమానుల వంతవుతోంది. తాజాగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శర్మను పోలిన వేరొక అమ్మడు నెట్లో ప్రకంపనాలకు తావిస్తోంది. చూడటానికి అచ్చం అనుష్క శర్మను పోలి ఉన్న ఈ భామ అమెరికలో పాపులర్ సింగర్ జులియా మైకేల్స్. ప్రస్తుతం అనుష్క - జులియా మైకేల్స్ ఫోటోల్ని ఎటాచ్ చేసి అభిమానులు అంతర్జాలంలో వైరల్ చేస్తున్నారు. ఈ ఫోటో అటూ ఇటూ తిరుగుతూ టాలీవుడ్ మీడియా కంటపడింది. ఒక్క హెయిర్ కలర్ మినహా ఆమె అచ్చం అనుష్క శర్మనే తలపిస్తోంది.



'యాత్ర'కు పోటీగా 'నేనే ముఖ్యమంత్రి' !

మాజీ ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జీవితంలో పాదయాత్ర ఘట్టాన్ని ఆధారంగా చేసుకుని తెరకెక్కించిన 'యాత్ర ఫిబ్రవరి 8న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ చిత్రంలో మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి వైఎస్సార్ పాత్రలో నటించారు. ఈ సినిమా సెట్స్‌పై ఉండగానే దీనికి పోటీగా వేరొక సినిమాని ప్రారంభించడంపై అప్పట్లోనే ఆసక్తికర చర్చ సాగింది. సీనియర్ దర్శకుడు దేవీ ప్రసాద్ వాయు తనయ్ శశి ముఖ్య పాత్రల్లో మోహన్ రావిపాటి దర్శకత్వంలో 'నేనే ముఖ్యమంత్రి' అనే చిత్రం తెరకెక్కింది. వైష్ణవి ఫిలింస్ ఆలూరి క్రియేషన్స్ పతాకాలపై అట్లూరి నారాయణరావు ఆలూరి సాంబశివరావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అయితే ఈ సినిమా పూర్తిగా వైఎస్ జగన్‌కి వ్యతిరేకంగా ఉంటుందంటూ ప్రచారం సాగుతోంది. నిర్మాతలు మాత్రం ఈ చిత్రం ద్వారా సమకాలీన రాజకీయ అంశాల గురించి చర్చించాం. అన్నివర్గాలకు నచ్చే అంశాలతోపాటు అందర్నీ ఆలోచింపజేసేలా సన్నివేశాలు సంభాషణలు ఉంటాయని చెబుతున్నారు. ఈ చిత్రం నెల 8న సినిమాను విడుదలవుతోంది. అయితే ఏమాత్రం బజ్ లేని.. ఈ సినిమా 'యాత్ర' కు పోటీనా? అంటూ ఫిలింనగర్‌లో ఆసక్తికర చర్చ సాగుతోంది.

అభిమానులకు చరణ్ లేఖ



మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ - మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ వినయ విధేయ రామ అంచనాలను ఏ మాత్రం అందుకోలేకపోయింది. అభిమానులను బాగా నిరాశపరిచింది. ఈ సందర్భంగా రామ్ చరణ్ వినయ విధేయ రామ గురించి ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. అందులో ఈ విధంగా ఉంది. 'ప్రియమైన అభిమానులు, ప్రేక్షకులకు.. నాపై, నా సినిమాలపై మీరు చూపించిన ప్రేమ, అభిమానాలకు వినమ్రపూర్వక ధన్యవాదాలు. మా వినయ విధేయ రామ సినిమా కోసం రేయింబవళ్లు కష్టించిన సాంకేతిక నిపుణులు అందరికీ నా ధన్యవాదాలు. నిర్మాత దానయ్య గారు అందించిన సహకారం మాటల్లో వర్ణించలేనిది. మా చిత్రాన్ని నమ్మిన పంపిణీదారులు, ప్రదర్శనదారులకి కృతజ్ఞుడై ఉంటాను. మీ అందరికీ నచ్చి మిమ్మల్ని వినోదింప చేసే సినిమా అందించటానికి మేమంతా ఎంతగానో శ్రమించాం. దురదృష్టవశాత్తు మేము అనుకున్న విధంగా ఒక మంచి సినిమాని అందించలేక మీ అంచనాలను అందుకోలేకపోయాం. మీరు చూపించే ఈ ఆదరణ, అభిమానాన్ని ప్రేరణగా తీసుకుని భవిష్యత్తులో మీకు నచ్చే, మీరు మెచ్చే సినిమాలు చేయటానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తాను.' అని పేర్కొన్నారు.





అనిల్ రావిపూడికి ప్రిన్స్ గ్రీన్‌సిగ్నల్



సూపర్‌స్టార్ మహేష్‌బాబు ప్రస్తుతం 'మహర్షి' నటిస్తున్న సంగతి తెలిసిందే. సమ్మర్ కానుకగా ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. అతని తదుపరి చిత్రాలకు ఇప్పటికే పలువురు దర్శకులు కథలు వినిపించేందుకు సిద్ధమవుతున్నారట. అయితే ఈసారి యంగ్ డైరెక్టర్ అనీల్ రావిపూడికి ఆ ఛాన్స్ దక్కడంపై ఆసక్తికర చర్చ సాగుతోంది. పటాస్, రాజా ది గ్రేట్, ఎఫ్ 2 వంటి చక్కని విజయాల్ని అందించిన అనీల్ రావిపూడికి మహేష్ ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసినట్టు సమాచారం. మహేష్ హీరోగా ఆగడు చిత్రానికి అతడు కథ అందించారు. ఆ క్రమంలోనే దూకుడు - ఆగడు చిత్రాల నిర్మాత ఏ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత అనీల్ సుంకర ప్రిన్స్‌తో సినిమా కోసం ఉత్సాహంగా ఉన్నారు. మహేష్- అనీల్ రావిపూడి- అనీల్ సుంకర కాంబినేషన్‌లో ఈ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లే ఛాన్స్ ఉందని చెబుతున్నారు.

వరుస ఆఫర్లతో చై ఉక్కిరిబిక్కిరి



వరుస ప్లాపులున్నా నాగచైతన్యకు వరుస ఆఫర్లు క్యూ కడుతున్నాయి. చై లైనప్ చూస్తే షాక్ తినాల్సిందే. ఆయన బిజీ షెడ్యుల్ గమనిస్తే, వైఫ్ సామ్‌తో కలిసి నటిస్తున్న 'మజిలీ' రిలీజ్‌కి రెడీ అవుతోంది. ఈలోగానే వరుసగా ప్రారంభోత్సవాలకు సన్నాహాలు చేస్తున్నాడు. వీటిలో తొలిగా మామ వెంకటేష్‌తో కలిసి నటించే 'వెంకీ మామ' మొదలు కానుంది. ఆ తర్వాత బిగ్ క్యూ ఉందని అక్కినేని సన్నిహిత వర్గాల ద్వారా తెలుస్తోంది. చై ప్రస్తుతం వరుసగా స్క్రిప్టులు వింటున్నాడు. వీటిలో క్రియేటివ్‌గా అనిపించిన ఏ స్క్రిప్టును వదలడం లేదు. ఇప్పటికే ప్రతిష్టాత్మక యు.వి.క్రియేషన్స్ లో ఓ సినిమాకి సన్నాహాలు చేస్తున్నాడు. ప్రస్తుతం స్క్రిప్టు పనులు సాగుతున్నాయి. అలాగే నాగార్జున స్నేహితుడు శివప్రసాద్ రెడ్డికి చెందిన కామాక్షి మూవీస్ బ్యానర్‌లో ఓ సినిమా, అగ్రనిర్మాత దిల్ రాజుతో ఓ సినిమా ఉంటుందని ప్రకటించారు. దీనికి సంబంధించి స్క్రిప్టు పనులు సాగుతున్నాయి. అలాగే నాగార్జున హీరోగా రాజన్న వంటి హిస్టారికల్ మూవీని తెరకెక్కించిన దర్శకరచయిత విజయేంద్ర ప్రసాద్ ఇప్పటికే చైతూకి కథ చెప్పారట. ఓవరాల్‌గా చూస్తుంటే చైతూ ఊపిరి సలపని ఆఫర్లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడనే చెప్పాలి.

పుకార్లు పట్టించుకోను

కోలీవుడ్‌లో సెటిలైపోయిన మన తెలుగు భామ అంజలి, హీరో జైల మధ్య ప్రేమాయణంపై మీడియాలో పుకార్లు షికార్లు చేస్తున్న సంగతి తెలిసిందే. జర్నీ సినిమాలో కలిసి నటించినప్పటి నుంచి ఈ ఇద్దరి మధ్య ఏదో ఉందనే టాక్ చాలా కాలం నడిచింది. అయితే దానికి సంబంధించి ఇన్నాళ్లు మౌనంగా ఉన్న అంజలి ఓ తాజా ఇంటర్వ్యూలో దానిపై క్లారిటీ ఇచ్చింది. అసలు జైతో తన అనుబంధం గురించి తాను ఎక్కడా చెప్పలేదని మీడియానే ఏదేదో ఊహించుకుని తమ చుట్టూ ప్రేమ అల్లేసిందని దానికి నేను ఎందుకు సమాధానం చెప్పాలని అన్నది. ఇలాంటి గాసిప్స్‌కు ఒకప్పుడు తాను తెగ బాధపడిపోయి ఏడ్చేదాన్నని ఇప్పుడు వాటిని పట్టించుకోకుండా కెరీర్ మీద దృష్టి పెడుతున్నానని చెప్పింది. మొత్తానికి జైతో తనకు ఏ లవ్ స్టోరీ లేదని అంజలి ఫైనల్‌గా స్పష్టంచేసింది.

నానితో భారీ బడ్జెట్ మూవీ !

విక్రమ్ కుమార్ దర్శకత్వంలో నటించేందుకు న్యాచురల్ స్టార్ నాని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడట. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ ప్రస్తుతం జోరుగా సాగుతోంది. ఈ సినిమాలో నాని సరసన ఐదుగురు భామలు ఆడిపాడనున్నారనే విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే ఈ సినిమా బడ్జెట్ ఇప్పుడు టాలీవుడ్‌లో ఒక హాట్ టాపిక్ అయింది. నాని-విక్రమ్ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ వారు నిర్మిస్తున్నారు. అయితే ఈ సినిమాకు రూ.50 కోట్ల బడ్జెట్ కావాలని విక్రమ్ మైత్రీవారి ముందు భారీ బడ్జెట్ ప్రపోజల్ పెట్టాడని సమాచారం. ఈ రేంజ్ బడ్జెట్ నాని మార్కెట్‌కు ఎక్కువే. నాని సినిమాలు సూపర్ హిట్ అయితే 30 నుండి 40 కోట్ల మధ్యలో కలెక్ట్ చేస్తాయి. ఒకవేళ సినిమా అటూ ఇటూ అయితే మాత్రం 'దేవదాస్'.. 'కృష్ణార్జున యుద్ధం' తరహాలో 20 కోట్లకు అటూ ఇటుగా సరిపెట్టుకోవలిసి ఉంటుంది. అలాంటిది నాని సినిమాకు రూ.50 కోట్ల బడ్జెట్ అంటే అది తప్పని సరిగా బ్లాక్ బస్టర్ కావలిసిందే. అయితే మైత్రీ వారు యాభై కోట్ల బడ్జెట్ పెట్టేందుకు రెడీ అయితే ఖచ్చితంగా రిస్క్ చేస్తున్నట్టేనని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మరి విక్రమ్ ఏ విధంగా వారిని గట్టెక్కిస్తాడో వేచిచూడాలి.

రూ.1.25 లక్షల ఆవు పేడ చోరీ..!



బెంగళూరు : ఆవు మూత్రం, పేడకు విస్తృత ప్రచారం నేపథ్యంలో కర్ణాటక బీరూర్ జిల్లాలో పశు సంవర్ధక శాఖ కేంద్రంలో నిల్వచేసిన ఆవు పేడను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ పేడ విలువ రూ.1.25 లక్షలని బీరూర్ పోలీసులకు పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ ఫిర్యాదు చేశారు. అమృత్ మహల్ కవల్ స్టాక్‌లో నిల్వ చేసిన 35 నుంచి 40 ట్రాక్టర్ల ఆవు పేడను సూపర్‌వైజర్ దొంగిలించినట్లు పోలీసుల విచారణలో తేలింది. సూపర్‌వైజర్ నుంచి ఆవు పేడను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆవు పేడను వ్యవసాయానికి, ఆయుర్వేదంలో విరివిగా ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆవు పేడకు దేశవ్యాప్తంగా డిమాండు పెరిగింది.



ఈశాన్య ఎంపీల ధర్నా..!

న్యూఢిల్లీ : పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా ఈశాన్య రాష్ట్రాల ఎంపీలు బుధవారం పార్లమెంటులో ధర్నా నిర్వహించారు. ఉదయం గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఎన్ఆర్‌సీ అంశంపై ఆందోళన చేపట్టారు. హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాజీనామా చేయాలని డిమాండు చేశారు. రెండో దఫా సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తనున్నట్లు కాంగ్రెస్ ఎంపీ రిపున్ బోరా తెలిపారు. అసోంకు చెందిన నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్‌ను కావాలనే కేంద్ర హోంశాఖ ధ్వంసం చేస్తోందని సుప్రీంకోర్టు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. బుధవారం రాజ్యసభలో ఇదే అంశంపై సభ్యులు ఆందోళన చేపట్టారు.



స్వీపర్ పోస్టుకు బీటెక్‌లు..ఎంటెక్‌లు...!

ఇదీ దేశ నిరుద్యోగుల దుస్థితి

చెన్నై : "బీఏలు చదివి నువ్వు బంట్రోతు పనికెళితే.. ఎమ్మేలు అక్కడ సిద్ధమూ... నువ్వు చేయలేవు వాళ్లతో యుద్ధము" అని 45 ఏళ్ల కిందట... నిరుద్యోగ సమస్యను సినీకవి ఆరుద్ర తన అక్షరాలతో అద్దంపడితే... దర్శకుడు బాపూ కళ్లకు కట్టారు. సరీగా అదే సన్నివేశం తాజాగా దేశంలో కనిపిస్తోంది. లక్షల్లో పట్టభద్రులు, ఎంబీఏలు, బీటెక్‌లు ఎంటెక్‌లు. కొలువుల కోసం క్యూ కడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగానికి నోటిఫికేషన్ జారీ కాగానే లక్షల్లో దరఖాస్తు చేస్తున్నారు. చదివిన చదువుకు, కొలువుకు సంబంధం లేదు. చివరికి స్వీపర్, పారిశుద్ధ్య కార్మికుడి ఉద్యోగం కోసం వందల్లో పట్టభద్రులు దరఖాస్తు చేశారంటే.. నిరుద్యోగం ఏ స్థాయికి చేరిందో తమిళనాడులో చోటుచేసుకున్న సంఘటన నిరూపించింది. 10 స్వీపర్, 4 పారిశుద్ధ్య కార్మికుల ఉద్యోగాలకు గత ఏడాది సెప్టెంబరు 26న తమిళనాడు అసెంబ్లీ సెక్రటేరియట్ దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ ఉద్యోగాలకు అర్హత 18 ఏళ్లు నిండి మంచి శరీర సౌష్టవం కలిగి ఉంటే చాలని ప్రకటించింది. ఈ పోస్టులకు ఎంటెక్, బీటెక్, ఎంబీఏ, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, గ్రాడ్యుయేట్ల నుంచి వందల దరఖాస్తులు చేరాయి. అంతేనా డిప్లొమో హోల్డర్లూ స్వీపర్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ పంపిన జాబితాతో సహా 4,607 దరఖాస్తులు అందాయి. వీటిలో దాదాపు 677 మంది దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. ఇదిలా ఉంటే.. నేషనల్ శాంపిల్ సర్వే వెల్లడించిన నివేదికను బిజినెస్ స్టాండర్డ్ పత్రిక ఇటీవలే ప్రచురించింది. దేశంలో. నిరుద్యోగ శాతం 6.1 కాగా.. 45 ఏళ్లలో ఈ రికార్డును చేరడం ఇదే మొదటిసారి పేర్కొంది. 2017-18లో నిరుద్యోగ శాతం ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది.

'ట్రావెన్‌కోర్' యూటర్న్



- మహిళలను అనుమతిస్తామని వెల్లడి
- సమీక్ష అవసరం లేదు : కేరళ ప్రభుత్వం
- 64 పిటిషన్ల విచారణ .. సుప్రీం తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ : శబరిమల ఆలయంలోకి అన్ని వయస్సుల మహిళలు ప్రవేశించవచ్చునని సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను పున:పరిశీలించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో 64 పిటిషన్లను విచారించింది. కేరళ ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ), నాయర్ సర్వీస్ సొసైటీ తదితరుల పిటిషన్లపై వాదనలను విన్న సీజేఐ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పును రిజర్వులో పెట్టింది. అయితే, దేవస్థానం బోర్డు ఒక్కసారిగా యూటర్న్ తీసుకొని మహిళల ఆలయ ప్రవేశానికి అంగీకారం తెలిపింది. సుప్రీం ఆదేశాల ప్రకారం నడుచుకుంటామని చెప్పడం గమనార్హం. లింగవివక్ష ఇంకెన్నాళ్లు.. దీనికి ముగింపు పలకాలని అంటూ బోర్డు తమ వైఖరిని సుప్రీం ధర్మాసనానికి తెలిపింది. న్యాయస్థానం ఇచ్చే తీర్పును గౌరవిస్తామని పేర్కొంది. దీనికి సంబంధించి దరఖాస్తు కూడా చేసింది. మహిళల ఆలయ ప్రవేశాన్ని మొదటి నుంచి వ్యతిరేకిస్తూ వచ్చిన నాయర్ సర్వీస్ సొసైటీ (ఎన్ఎస్ఎస్), దేవస్థానం తాంత్రీ సహా పలువురు రివ్యూ పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్ఎస్ఎస్ తరపున మాజీ అటార్నీ జనరల్, సీనియర్



న్యాయవాది కె.పరాశరణ్ కోర్టులో వాదనలు వినిపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 ప్రజలందరికీ లౌకిక వ్యవస్థలు అందుబాటులో ఉండాలని చెబుతుందని తప్ప మతసంస్థల గురించి కాదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మహిళల ఆలయ ప్రవేశంపై ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని కోరారు. సమాజంలో అంటరానితనం గురించి చెప్పే రాజ్యాంగంలోని నిబంధనలు దీనికి వర్తించవని చెప్పారు. చాలాఏళ్లుగా కొనసాగుతున్న శబరిమల సంప్రదాయాన్ని పట్టించుకోకుండా కోర్టు మహిళలకు ప్రవేశం కల్పించిందని, ఈ విషయంపై మరోసారి ఆలోచించాలని ఆయన ధర్మాసనాన్ని కోరారు. మహిళలపై నిషేధం కులం ఆధారితమైనది కాదని, 10-50 ఏళ్ల మధ్య వయస్సువారికేనని ఆయన తెలిపారు. ఇదిలావుండగా, కేరళ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినిపిస్తూ రివ్యూ పిటిషన్లను వ్యతిరేకిస్తున్నామన్నారు. కేరళ చట్టంలోని ఆర్టికల్ 26, 24(2), నిబంధన 3(బీ)లపై ధర్మాసనంలోని నలుగురు న్యాయమూర్తుల మధ్య ఏకాభిప్రాయం కుదిరిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ మూడు అంశాల ఆధారితంగా ఏ ఒక్క రివ్యూ పిటిషన్ కూడా దాఖలు కాలేదని, న్యాయపరమైన అంశాలతో దాఖలు కాని ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోనక్కర్లేదన్నారు. మరోవైపు రివ్యూ పిటిషన్లను సమర్థించిన ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు మాజీ చైర్‌పర్సన్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కోర్టులో వాదనలు వినిపించారు. 'కులం, మతం, లింగాన్ని బట్టి ఆల యంలో ప్రవేశాన్ని నిరాకరించడం లేదు.. కేవలం మహిళల్లోని ఓ వర్గాన్ని (రుతుక్రమం వయస్సులో ఉన్న వారు) మాత్రమే నిషేధిస్తున్నారు. కాబట్టి రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 (అంటరానితనం నిర్మూలన) దీనికి వర్తించదు' అని తెలిపారు. హైందవ మతాచారాల దృష్ట్యా ఈ నిషేధం ఉందన్నారు. ఇది ఓ దేవుడ్ని ఒక పద్ధతి ప్రకారం పూజించే వర్గానికి సంబంధించిన అంతర్గత వ్యవహారమని, ఆ వర్గీయుల విశ్వాసానికి సంబంధించిం దని, ఒక మతాన్ని ఫలానా పద్ధతి ప్రకారమే అనుసరిం చాలని కోర్టు నేరుగా చెప్పకూడదని' మరో సీనియర్ న్యాయవాది శేఖర్ నపాడే వాదించారు. నేరపూరితమైతేనే గానీ ఏదేని మతాచారాన్ని ఆపలేమన్నారు. అన్ని పక్షాల వాద నలు విన్న సుప్రీం ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది.

రూ.10 కోట్ల బంగారం లూటీ



ముజఫర్‌పూర్ : బీహార్‌లోని ఒక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ నుంచి రూ.10 కోట్లు విలువచేసే ఐదు బ్యాగుల బంగారాన్ని బుధవారం దొంగలు లూటీ చేశారు. ఈ విషయంపై దర్యాప్తు చేపట్టామని ఎస్పీ వెల్లడించారు. దీనిపై ఉద్యోగి నుంచి వాంగ్మూలాన్ని తీసుకున్నామని సాయుధులైన దుండగులు పిస్తోలును మేనేజర్‌కు గురిపెట్టి లాకర్ల తాళాలు తీసుకున్నారన్నారు. దాదాపు రూ.10 కోట్ల బంగారం దోపిడీకి గురయిందని కంపెనీ అధికారులు తెలిపారన్నారు. ఈ దోపిడీలో ఆరుగురు పాల్గొన్నారని, భగ్వాన్‌పురి ప్రాంతంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో ఈ ఘటన జరిగిందన్నారు. సెక్యూరిటీ గార్డు మనోజ్ కుమార్ ఝాను తుపాకీమడమతో కొట్టగా అపస్మారక స్థితికి వెళ్లారన్నారు. బంగారంపై రుణమివ్వాలంటూ కస్టమర్లలా లోపలికి వచ్చి లూటీకి పాల్పడ్డారని, త్వరలో నిందితులను పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు.

బీజేడీ ఎంపీ కన్నుమూత..!



న్యూఢిల్లీ : బిజూ జనతా దళ్ సీనియర్ నాయకులు, లోక్‌సభ సభ్యులు లాడు కిశోర్ స్వైన్(71) మంగళవారం రాత్రి మృతి చెందారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొన్నాళ్లుగా కిడ్నీ వ్యాధితో కిశోర్ స్వైన్ బాధపడుతున్నారు. కిశోర్ స్వైన్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోడీ, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కిశోర్ స్వైన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కిశోర్ స్వైన్ 1947, జూలై 8న జన్మించారు. ఆస్కా నియోజకవర్గం నుంచి లోక్‌సభకు 2014లో ఎన్నికయ్యారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో కబీసూర్యనగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన మరణానికి సంతాప సూచకంగా లోక్‌సభను బుధవారం వాయిదా వేశారు.

పేదల వ్యతిరేక ప్రభుత్వం

- మోడీ సర్కారుపై విపక్షాల మండిపాటు
- రోస్టర్ విధానంపై దద్దరిల్లిన పెద్దల సభ
- నేటికి వాయిదా



న్యూఢిల్లీ : పౌరసత్వ(సవరణ) బిల్లు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లకు సంబంధించి రోస్టర్ విధానం సహా అనేక అంశాలపై రాజ్యసభ బుధవారం దద్దరిల్లింది. ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే వరుసగా మూడోరోజూ పెద్దలసభ తుడిచిపెట్టుకుపోయింది. వాయిదాల అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి సభ ప్రారంభం కాగానే ఆర్జేడీ, ఎస్పీ, బీఎస్పీ, టీఎంసీ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి అనేక సమస్యలపై నిరసన తెలిపారు. ప్రత్యేకించి విద్యాసంస్థల్లో రోస్టర్ విధానం ప్రవేశంపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీశారు. కాంగ్రెస్ సభ్యులు కూడా లేచినిలబడి నిరసన తెలిపారు. సభ్యులంతా తమ తమ సీట్లలో ఆశీనుకావాల్సిందిగా డిప్యూటీ చైర్మన్ హరివంశ్ పదేపదే విజ్ఞప్తి చేశారు. అయినా సభ్యులు పట్టించుకోలేదు. పేదల వ్యతిరేక ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయాలని డిమాండు చేశారు. రోస్టర్ విధానానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ అంశంపై మాట్లాడేందుకు జీరో అవర్‌లో అవకాశమిస్తానని, ఆందోళనను విరమించాలని ఎస్పీ నాయకుడు రామ్‌గోపాల్ యాదవ్‌కు డిప్యూటీ చైర్మన్ విన్నవించారు. రోస్టర్ విధానంపై ప్రభుత్వం సభను తప్పుదారి పట్టించిందని, అన్నీ అవాస్తవాలు చెబుతోందని యాదవ్ విమర్శించారు. యాదవ్‌ను సంతృప్తిపరచడానికి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్‌గోయల్ ప్రయత్నించారు. అయినా విపక్ష సభ్యుల ఆందోళన ఆగలేదు. ఈ సమస్యపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, స్పెషల్ లీవ్ పిటిషన్ తయారు చేస్తోందని, రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టులో దాఖలు చేశామని కేంద్ర మానవ వనరులశాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ చెప్పారు. అయినా సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తాను సభను నిర్వహించలేనని, వాయిదా వేయడమే తన ముందున్న ప్రత్యామ్నాయమని హరివంశ్ చెప్పారు. సభను గురువారానికి వాయిదా వేశారు. ఉదయం పౌరసత్వ(సవరణ) బిల్లు సహా ఇతర అంశాలపై సభ్యులు నిరసన తెలపడంతో చైర్మన్ ఎం. వెంకయ్యనాయుడు సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు.

బీజేడీ ఎంపీకి లోక్‌సభ సంతాపం


ఒడిశాకు చెందిన బీజేడీ సిట్టింగ్ ఎంపీ లాడు కిషోర్ స్వైన్ మృతికి లోక్‌సభ బుధవారం సంతాపం తెలిపింది. అనంతరం సభ గురువారానికి వాయిదా పడింది. ఉదయం సభ ప్రారంభం కాగానే బిజూ జనతా దళ్ సభ్యుడు స్వైన్ బుధవారం భువనేశ్వర్‌లో మృతిచెందిన విషయాన్ని స్పీకర్ సుమిత్రా మహాజన్ సభ్యులకు తెలిపారు. ఆస్కా నుంచి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2004 నుంచి 2009 వరకు ఆయన ఎమ్మెల్యేగా పనిచేశారు. గ్రామీణాభివృద్ధి, ఓబీసీ పార్లమెంటరీ కమిటీలకు సభ్యునిగా కొనసాగుతున్నారు. స్వైన్‌కు సంతాపం తెలిపిన సమయంలో ప్రధాని మోడీ, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ సభలోనే ఉన్నారు.

పౌర విమానయాన శాఖ కార్యదర్శిగా ప్రదీప్‌సింగ్



న్యూఢిల్లీ : పౌర విమానయాన శాఖ కార్యదర్శిగా ప్రదీప్ సింగ్ ఖరోలా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఎయిర్ ఇండియా చీఫ్‌గా పనిచేస్తున్నారు. బదిలీల్లో భాగంగా అత్యున్నత అధికారిని పౌరవిమానయాన కార్యదర్శిగా నియమించారు. ఈ నియామకం బుధవారం నుంచి అమలులోకి వచ్చింది. 1985 బ్యాచ్‌కు చెందిన కర్ణాటకకు కేడర్ ఐఎఎస్ అధికారి అయిన ఖరోలా 2017, నవంబరులో ఎయిర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ పదవికి ఎంపిక చేశారు. అప్పుల్లో కూరుకుపోయిన ఈ జాతీయ సంస్థకు గతేడాది జనవరి 9న ఆయన పదవీస్వీకారం చేశారు. పౌరవిమానయాన శాఖ కార్యదర్శిగా ఉన్న రాజీవ్ నాయన్ చౌబే జనవరి 31న పదవీవిరమణ పొందడంతో ఆయన స్థానంలో ఖరోలా నియమితులయ్యారు. ప్రస్తుతం చౌబే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిటీ (యూపీఎస్‌సీ), ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్), ఇండియన్ పోలీసు సర్వీసు (ఐపీఎస్) ఎగ్జామినేషన్స్ సెలక్ట్ ఆఫీసర్‌గా ఉన్నారు. సీనియర్ బ్యూరోక్రాట్ రాధేశ్యామ్ జులానియాను క్రీడల శాఖకు కార్యదర్శిగా నియమితులయ్యారు. మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన జులానియా 1985 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. పంచాయతీ రాజ్ కార్యదర్శిగా 1983కు చెందిన రాహుల్ ప్రసాద్ భట్నాగర్, మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శిగా శైలేష్ నియమితులయ్యారు. ఆయన అధికారిక భాషా కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.

ట్రిబ్యునల్‌లో 50 వేల పెండింగు కేసులు



న్యూఢిల్లీ : కేంద్ర ఎడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో (సీఏటీ) 50 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 4,100 కేసులు ఐదేళ్లనాటివని, సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ బుధవారం లోక్‌సభలో వెల్లడించారు. కేంద్రప్రభుత్వ ఉద్యోగుల ఫిర్యాదుల పరిష్కారానికి ఈ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేశారు. 2018, డిసెంబరు 31 నాటికి సీఏటీలోని 17 ధర్మాసనాల్లో 50,053 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి రాతపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రధాన ధర్మాసనంలో అత్యధికంగా 10,673 కేసులు, అలహాబాద్‌లో 5,797 కేసులు, కోల్‌కతాలో 4,345, హైదరాబాద్ 3,957 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 1985లో కేంద్ర అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా 17 ధర్మాసనాలు కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పోస్టుల నియామకాలను పర్యవేక్షిస్తోంది.

ఢిల్లీకి 'స్వైన్‌ఫ్లూ'

వెయ్యికిపైగా రోగులు.. ఒకరి మృతి



న్యూఢిల్లీ : దేశ రాజధాని నగరంపై స్వైన్‌ఫ్లూ పంజా విసిరింది. ఒకరు మృత్యువాత పడగా మంగళవారం తాజాగా 124 ఇన్‌ఫ్లూయెంజా ఏ(హెచ్1ఎన్1) కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాదిలోనే ఢిల్లీలో ఈ వ్యాధి బారిన పడిన ప్రజల సంఖ్య 1019కి చేరినట్లు ఒక నివేదిక వెల్లడించింది. సోమవారం నాటికి 895 స్వైన్‌ఫ్లూ పాజిటివ్ కేసులు నమోదు కాగా, వీరిలో 712 మంది పెద్దలు, 183 మంది పిల్లలు ఉన్నట్లు నగరానికి చెందిన ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ విడుదల చేసిన తాజా నివేదిక పేర్కొంది.104 మందికిపైగా పెద్దవారు, 20 మంది చిన్నారులు ఈ వ్యాధి బారిన పడగా మంగళవారం ఒకరు మరణించినట్లు నివేదిక తెలిపింది. సోమవారం వరకు స్వైన్‌ఫ్లూ కారణంగా ఎవరూ మరణించినట్లుగా ఢిల్లీ ప్రభుత్వం నమోదు చేయలేదు. ఇదిలా ఉండగా ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన రెండు ఆస్పత్రుల్లో ఈ ఏడాది స్వైన్‌ఫ్లూ కారణంగా 13 మంది మరణించినట్లు ప్రకటించారు. ఈ సీజన్‌లో స్వైన్‌ఫ్లూతో ముగ్గురు మరణించినట్లు సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి ఉన్నతాధికారులు తెలిపారు. ఆర్ఎంఎల్ ఆస్పత్రిలో 10 మరణాలు చోటుచేసుకున్నాయి. ఆర్ఎంఎల్ ఆస్పత్రిలో మరణించిన 10 మందిలో తొమ్మిదిమంది ఢిల్లీకి చెందిన వారు కాగా, ఒకరు నగరం వెలుపల నుంచి వచ్చిన వారని అధికారులు వివరించారు. ఇన్‌ఫ్లూయెంజాపై రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించిన తర్వాత ఢిల్లీ ప్రభుత్వం ఇటీవల మాట్లాడుతూ స్వైన్‌ఫ్లూ వ్యాధిని ఎదుర్కొనేందుకు నగరంలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో అవసరమైన వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపింది. అలాగే ఎన్95 మాస్కులు, వ్యక్తిగత రక్షణ పరికరాలు (పీపీఈ కిట్‌లు)తోపాటు ఒసేల్టామివిర్ మందు కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

కాగా వ్యాధికి సంబంధించి ఆస్పత్రులన్నింటిలో వైద్య సదుపాయాల ఏర్పాటు, వ్యాధి నిర్ధారణ, వ్యాధి నివారణా చర్యలు, ప్రమాద వర్గీకరణ, ప్రమాణాలు, టీకాలు, నిర్వహణపై ఇటీవల కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. 'వెంటిలేటర్లు సిద్ధం చేసుకోవాలని, వ్యాధి నివారణ సమాచారం అందజేయాల్సిందిగా ఆస్పత్రులన్నింటిని కోరాం' అని ఢిల్లీ ఆరోగ్య విభాగం అధికారులు చెప్పారు.

ఈడీ ఎదుట వాద్రా

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ పార్టీ నేత సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా బుధవారం ఈడీ ఎదుట హాజరయ్యారు. విదేశాల్లో అక్రమ ఆస్తులు కలిగి ఉన్నట్లు వాద్రాపై ఆరోపణలు ఉన్నాయి. భారీ భద్రత మధ్య కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీతో కలిసి వైట్ టొయోటా ల్యాండ్ క్రూయిజర్‌లో వాద్రా ఈడీ కార్యాలయానికి వచ్చారు. సెంట్రల్ ఢిల్లీలోని జామ్‌నగర్‌లో గల ఈడీ కార్యాలయం బయట వాద్రాను వదిలి ప్రియాంక వెళ్లిపోయారు. సాయంత్రం 3.47 గంటలకు వాద్రా ఈడీ ఆఫీసులో అడుగుపెట్టారు. ఆయనకంటే కొన్ని నిమిషాల ముందు వాద్రా తరపు న్యాయవాదులు అక్కడికి చేరుకున్నారు. ఆర్థిక అవకతవకల ఆరోపణలపై దర్యాప్తు సంస్థల ఎదుట వాద్రా హాజరు కావడం ఇదే మొదటిసారి. తనపై వచ్చిన మనీలాండరింగ్ ఆరోపణలను వాద్రా ఇంతకుముందే తోసిపుచ్చారు. రాజకీయ ప్రతీకారంలో భాగంగానే తనపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఈ కేసులో ముందస్తు బెయిల్‌కు పిటిషన్ దాఖలు చేసిన ఢిల్లీ కోర్టు...దర్యాప్తు సంస్థకు సహకరించాల్సిందిగా వాద్రాను ఆదేశించింది. లండన్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత బుధవారం ఈడీ ఎదుట హాజరుకావాలని స్పష్టంచేసింది. కోర్టు ఆదేశాల మేరకు వాద్రా ఈడీ విచారణకు ముందుకు వచ్చారు. లండన్‌లో వాద్రాకు భారీగా స్థిరాస్తులు ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

మోడీ.. నవీన్ ఒక్కటే

- గిరిజన భూములను లాక్కొంటున్నారు
- కాంగ్రెస్‌తోనే ఆదివాసీలకు భద్రత
- ఒడిశాలో రాహుల్‌గాంధీ



భువనేశ్వర్ : ప్రధాని నరేంద్రమోడీ, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌లపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నిప్పులు చెరిగారు. గిరిజన భూములను వారు బలవంతంగా లాక్కుంటున్నారని నిందించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు తమ పార్టీ కృషి చేస్తోందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన భవానీపట్నంలో బుధవారం జరిగిన భారీ ర్యాలీలో రాహుల్‌గాంధీ ప్రసంగించారు. దళితులు, గిరిజనులు, రైతులు, పేదల సంక్షేమానికి సంబంధించి మోడీ సర్కారు, నవీన్ పట్నాయక్ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యాయని రాహుల్ ఆరోపించారు. గిరిజనుల భూముల రక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. ఒడిశా, దేశంలోని అన్ని ప్రాంతాల గిరిజనుల హక్కులను కాపాడి తీరుతామని భరోసా ఇచ్చారు. త్వరలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరగనున్న ఒడిశాకు రాహుల్‌గాంధీ పది రోజుల్లో రెండుసార్లు రావడం గమనార్హం. జనవరి 25న భువనేశ్వర్‌లో జరిగిన ర్యాలీలో ఆయన ప్రసంగించారు. తమ పారిశ్రామిక మిత్రుల లబ్ధి కోసమే బీజేపీ, బీజేడీ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని, రైతులు, పేదలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. 15 మంది పారిశ్రామికవేత్తలకు సంబంధించిన రూ.3.5 లక్షల కోట్ల రుణాలు రద్దు చేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని నిశిత విమర్శ చేశారు. కానీ వ్యవసాయ రుణాలు రద్దు చేయడానికి మాత్రం నిరాకరిస్తోన్నట్టు తెలిపారు. రైతులకు గిట్టుబాట ధర కల్పిస్తామన్న హామీని సైతం మోడీ ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. దేశంలో రైతులు పూర్తి నిర్లక్ష్యానికి గురవుతున్నారని రాహుల్ ఆవేదన వెలిబుచ్చారు. ఒడిశాలో రైతులను ఆదుకునేలా పనిచేయడంలో పట్నాయక్ ప్రభుత్వం సైతం విఫలమైందన్నారు. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో అధికారం చేపట్టిన రెండు రోజుల్లోనే తాము వ్యవసాయ రుణాలు రద్దు చేశామని రాహుల్ గుర్తుచేశారు. కాపలా దారుడే అవినీతిపరుడయ్యారని మోడీని నిందించిన రాహుల్... చిట్‌ఫండ్ స్కామ్ రిమోట్ కంట్రోల్ నవీన్ పట్నాయక్ చేతిలో ఉందని ఆరోపించారు. ప్రాజెక్టుల కోసం సేకరించిన భూమిని ఐదేళ్ల దాటితే తిరిగి రైతులకు ఇచ్చేస్తామని, ఛత్తీస్‌గఢ్‌లో ఇదే ప్రక్రియను ప్రారంభించామని రాహుల్ చెప్పారు.

మోడీ చేతిలో కీలుబొమ్మ

రూర్కెలా సభలో రాహుల్ మాట్లాడుతూ ఒడిశా ప్రభుత్వం మోడీ చేతిలో కీలుబొమ్మలా మారిందని విమర్శించారు. ఒడిశాలో పాలన ఢిల్లీ నుంచి సాగుతోందని, చిట్‌ఫండ్ కుంభకోణంతో రాష్ట్రం నలిగిపోతోందన్నారు. ఈ కుంభకోణంతో చాలామంది బీజేడీ నాయకులకు సంబంధం ఉందని ఆరోపించారు. మోడీ సర్కారు రాఫెల్ కుంభకోణంలో కూరుకుపోయిందన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ, ఇతరత్రా అంశాల్లో పార్లమెంటులో మోడీకి బీజేడీ మద్దతిచ్చిందని గుర్తుచేశారు. ఉద్యోగాల కల్పనలో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఉత్తరప్రదేశ్‌లో పీహెచ్‌డీ డిగ్రీలు ఉన్న నిరుద్యోగులు నాలుగో తరగతి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్నారని రాహుల్ విమర్శించారు. ట్విట్టర్ వేదికగా మోడీ ప్రభుత్వంపై రాహుల్ విమర్శలు కురిపించారు. నరేంద్ర మోడీని 'జుమ్లా రాజా'గా, ఆయన పాలనను విధ్వంసకరమైనదిగా అభివర్ణించారు. 'రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. యువతకు అర్హతకు తగిన ఉద్యోగాలు రావడం లేదు. కష్టపడేవారికి గౌరవం లభించడం లేదు' అని రాహుల్ హిందీలో ట్వీట్ చేశారు.



దోషులకు ఉరే సరి !

నన్నపనేని రాజకుమారి

విశాలాంధ్ర - సూళ్ళూరుపేట : గ్యాంగ్ రేప్ బాధితురాలిని పరామర్శించేందుకు రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ నన్నపనేని రాజకుమారి బుధవారం నెల్లూరుజిల్లా సూళ్ళూరుపేటకు వచ్చారు. బాధితురాలిని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. అనంతరం స్థానిక ఆర్అండ్ బీ గెస్ట్ హౌస్‌లో విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. దోషులను 24 గంటల లోపు మీడియా ముందు ప్రవేశపెట్టి కోర్టులో హాజరుపరచాలన్నారు. ఎంతటివారైనా సరే ఇలాంటి ఘటనలకు పాల్పడినవారికి ఉరి శిక్ష పడేలా గట్టి చర్యలు తీసుకుంటామని, బాధితురాలికి అండగా ఉంటూ ప్రభుత్వం తరపున ఓ ఉద్యోగం, ఆర్థిక సాయం అందిస్తామని తెలియజేశారు. ఇకపై ఈ విధమైన అఘాయిత్యాలు జరగకుండా నిఘా పెంచాలని, స్త్రీల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్దేశిత ప్రదేశాలలో సీసీ కెమేరాలు పెట్టించి వాటి ద్వారా ముద్దాయిలను గుర్తించే విధంగా చర్యలు చేపట్టాలని, ఈ ప్రాంతంలో మహిళా పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. అనంతరం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థినులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఆరాతీశారు. ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం స్త్రీలకు అనేక సంక్షేమ పథకాలను, పటిష్టమైన చట్టాలు ఏర్పాటు చేసే సమయంలో ఇలాంటి దారుణం చోటు చేసుకోవడం శోచనీయమన్నారు. నన్నపనేని రాజకుమారి వెంట సబ్ డివిజనల్ పోలీసు అధికారి బాబు ప్రసాద్, సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ విశ్వనాథరెడ్డి, తహశీల్దారు శ్రీనివాసరావు, స్థానిక పురపాలక సంఘం ఛైర్మన్ ఎన్. విజయలక్ష్మి, తెలుగు జిల్లా మహిళా అధ్యక్షురాలు ముప్పాళ్ళ విజేత, ఉమన్స్ కమిషన్ సభ్యురాలు వాణి, రమా, ఉమన్స్ కమిషన్ సెక్షన్ ఆఫీసర్ అన్నపూర్ణ, చెంగాళమ్మ పరమేశ్వరి సేవా సమితి అధ్యక్షులు ముప్పాళ్ళ వెంకటేశ్వర్లు రెడ్డి, ఆకుతోట రమేష్, మాజీ ఛైర్మన్ తెలుగు మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు రాజేశ్వరి, ఉపాధ్యక్షురాలు ప్రత్యూష, మునిసిపల్ కౌన్సిలర్లు విజయలక్ష్మి, అమర జ్యోతి, సూళ్ళూరుపేట మెప్మా అధ్యక్షురాలు విజయలక్ష్మి, వివిధ మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రెల్లి కార్పొరేషన్ ఏర్పాటుచేయాలి



విశాలాంధ్ర - విజయవాడ (అజిత్‌సింగ్‌నగర్) : రెల్లి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని శబరి రెల్లి కుల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుపాకుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 21 లక్షల జనాభా కలిగి ఉన్న రెల్లి కులస్తులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెల్లి కులస్తుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, నామినేటెడ్ పోస్టులకు అవకాశం కల్పించాలని, రానున్న ఎన్నికలలో 5 ఎమ్మెల్యే, 5ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలని, రాష్ట్ర రాజధాని అమరావతిలో రెల్లిభవన నిర్మాణానికి 10 ఎకరాల భూమి కేటాయించాలని కోరారు. రెల్లి కులస్తులను ఎస్‌టీలుగా మార్చాలని, విజయవాడతో పాటు ప్రతి జిల్లాలో రెల్లి భవనాలను నిర్మించాలని, ఇల్లులేని ప్రతి రెల్లి కులస్తునికి ఇల్లు కేటాయించాలని, 10 సంవత్సరాలు పైబడి కార్పొరేషన్, మున్సిపాల్టీలలో పనిచేస్తున్న రెల్లి కులస్తులను పర్మినెంట్ చేయాలని, 50 సంవత్సరాలు దాటిన వారికి రూ. 2 వేలు పింఛను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మా డిమాండ్‌లపై హామీ ఇచ్చే వారితోనే మా రెల్లి కులస్తులు ప్రయాణం చేయాలనుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాడుగుల నాగమల్లేశ్వరరావు (కాంగ్రెస్), సోమి వెంకటేశ్వర్లు (టీడీపీ అర్బన్ కార్యదర్శి) సోమి రాజేష్ (టీడీపీ నగర ఎస్‌సీ సెల్ ఉపాధ్యక్షులు), వడ్డాడి ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య కేసులో భర్తకు పదేళ్ల జైలు



విశాలాంధ్ర - కోవెలకుంట్ల టౌన్ : కర్నూలు జిల్లా కోవెలకుంట్ల మండల పరిధిలోని కలుగొట్ల గ్రామానికి చెందిన కంబగిరి నాయుడికి పది సంవత్సరాల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు రేవనూరు ఎస్సై రమేష్ బుధవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు కలుగొట్ల గ్రామానికి చెందిన కంబగిరి నాయుడు తన భార్య విజయలక్ష్మిని మానసికంగా చిత్రహింసలకు గురి చేస్తుండేవాడు. వీటిని భరించలేని విజయలక్ష్మి 2015 జూన్ 10న ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకోగా, నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ జూన్ 23న మృతిచెందింది. రేవనూరు పోలీస్ సిబ్బంది కేసు నమోదుచేసుకోగా, బుధవారం ఆళ్ళగడ్డ వీఏడీజే కోర్టు జడ్జి పది సంవత్సరాల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించారు. ముద్దాయిని కడప సెంట్రల్ జైలుకు తరలించినట్లు రేవనూరు ఎస్ఐ తెలిపారు.



లవకుశులకు ఘన సన్మానం

విశాలాంధ్ర - విజయవాడ కల్చరల్ : లవకుశలు చలనచిత్రంలో లవకుశులుగా నటించిన నాగ సుబ్రహ్మణ్యం, నాగరాజులకు ఎన్‌టీఆర్, ఎస్‌వీఆర్, ఏఎన్ఆర్ సాంస్కృతిక కళా పీఠం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కౌతా పూర్ణానందం సత్రం హాలులో ఘన సన్మానం జరిగింది. పద్మశ్రీ ఘంటసాల 45వ వర్ధంతి సందర్భంగా బొలిశెట్టి రాధాకృష్ణమూర్తి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమానికి సత్కార కర్తగా తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి వ్యవహరించారు. వేదికపై కళాపీఠం వ్యవస్థాపకులు యర్రపోతు మురళి, అతిథులుగా పద్మశ్రీ డాక్టర్ తుర్లపాటి కుటుంబరావు, పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుర్లపాటి కుటుంబరావు మాట్లాడుతూ 1934లో మొదటగా లవకుశలు చిత్రం వచ్చిందని, మరల 1963లో అదే లవకుశలు చిత్రం వచ్చిందని, రెండు చిత్రాలకు సి.పుల్లయ్య దర్శకత్వం వహించారన్నారు. రెండవ సారి వచ్చిన లవకుశలు చిత్రంలో లవకుశలుగా నటించిన నాగసుబ్రహ్మణ్యం, నాగరాజుల నటన తెలుగు జాతి మరిచిపోదని, అభినయంలోనూ భాష ఉచ్చారణలోనూ వారి ప్రతిభ ప్రతి సన్నివేశంలోనూ కనిపించిందని అన్నారు. 2008 నుంచి విజయవాడ నగరంలో తన అధ్యక్షతన 4 సార్లు సన్మానం జరగటం ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి గొప్ప నటులను సత్కరించుకోవడం ఎంతో ముదావహమని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

'సుస్వర సామ్రాజ్ఞి' పుస్తకావిష్కరణ



విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : రచయిత సముద్రాల గురుప్రసాద్ రాసిన 'సుస్వర సామ్రాజ్ఞి' పుస్తకాన్ని గాయని పి.సుశీల ఆవిష్కరించారు. మహారాజా సంగీత కళాశాల శతజయంతి ఉత్సవాల్లో భాగంగా విజయనగరంలో పర్యటించిన నేపథ్యంలో ఆమె పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ కళలకు పుట్టినిల్లు అయిన విజయనగరంలో జన్మించడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. తాను ఆడిషన్స్‌కు వెళ్లిన నాటి నుంచి నేటివరకు, 1957లో అన్నపూర్ణా సంస్థ ద్వారా సావిత్రికి పాడడం నుంచి 9 భాషల్లో పాడిన పాటలు, తనతో కలసి పనిచేసిన సంగీత దర్శకులు, అవార్డులు, సత్కారాలు తదితర విషయాలతో, తన సినీ సంగీత ప్రయాణంపై రచయిత గురుప్రసాద్ చక్కటి వివరాలను పుస్తకంలో పొందుపరచారన్నారు. ఎస్‌సీఎస్ ట్రస్ట్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాస్, సుధానాయర్, సూర్యలక్ష్మి, నాగరాజు, రచయిత గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో మహిళా ఫెస్ట్

విశాలాంధ్ర - విజయవాడ (అజిత్‌సింగ్‌నగర్) : మహిళల్లోని సృజనాత్మకతను, భావ వ్యక్తీకరణను, ప్రతిభాపాటవాలను వెలికితీసేందుకు మహిళా ఫెస్ట్‌ను తరుణీ తరంగాల ఆధ్వర్యంలో ఈ నెల 12, 13 తేదీలలో స్థానిక సిద్ధార్థ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు ఫెస్ట్ నిర్వహణ కమిటీ తెలిపింది. స్థానిక గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో కమిటీ అధ్యక్షురాలు రావి శారద మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన తమ ప్రతిభతో నాసా వెళ్లి వచ్చిన చిన్నారులతో తరుణీ తరంగాల జెండా ఆవిష్కరణతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. కల్చరల్ విభాగంలో జానపద నృత్యాలు, అభ్యుదయ గీతాలాపన, కోలాటం, లఘునాటిక, చిత్రలేఖనం, కార్టూన్, వ్యాసరచన, కథారచన, కవితారచనా పోటీలు జరుగుతాయని తెలిపారు. ప్రధాన కార్యదర్శి జి.జ్యోత్స్న మాట్లాడుతూ 13వ తేదీ ఉదయం కల్చరల్ అకాడమీ పోటీలు, ప్రముఖ రచయిత్రులు 10 మందికి సన్మానం, ఎన్నికల అనంతరం ఏర్పడే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మహిళలు ఏమి కోరుకుంటున్నారు అనే అంశాలపై ఓపెన్ ఫోరమ్ నిర్వహించబడుతుందని, అనేక రంగాల్లో నిష్ణాతులైన 49 మంది ప్రసంగించనున్నారని తెలిపారు. నిర్వహణ కమిటీ సభ్యులు ఎస్.విద్యాకన్నా, కె.సత్యవతి, డి.రమాదేవి, ఏ.నీరజ, జి.వాణి పాల్గొన్నారు.

సుజల స్రవంతిపై శ్రద్ధ ఏది?

- కలగా మారిన ఉత్తరాంధ్ర ప్రాజెక్టు
- బడ్జెట్‌లో అరకొర నిధుల కేటాయింపు



విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో : రెండు దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర ప్రజలు ఎదురుచూస్తున్న బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుపై చంద్రబాబు ప్రభుత్వానికి శ్రద్ధ కరవైంది. ఆరు నెలల క్రితం ఆదరాబాదరాగా శంకుస్థాపన చేసిన బాబు బడ్జెట్‌లో అరకొరగానే నిధులు కేటాయించారు. భారీ అంచనాలతో ప్రాజెక్టును డిజైన్ చేసిన ప్రభుత్వానికి.. పనుల పురోగతి కార్యరూపం దాల్చేందుకు మాత్రం అడుగు ముందు పడడం లేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో శ్రీకారం చుట్టిన ఈ ప్రాజెక్టు ఎట్టకేలకు ఆరు నెలల క్రితం శంకుస్థాపనకు నోచుకుంది. వైఎస్ హయాంలో రూ.7214.10 కోట్ల అంచనాలతో డిజైన్ చేసిన ఈ ప్రాజెక్టు వ్యయం కాస్తా నేడు రూ. 16,568 కోట్లకు చేరింది. తొలి దశ పనుల అంచనా వ్యయం నాడు రూ.801 కోట్లు కాగా, నేడు 2 వేల 22 కోట్లకు చేరింది. 2009 ఫిబ్రవరి 21న వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తొలి దశ పనులకు సంబంధించి జలాశయం గ్రావిటీ కాలువల నిర్మాణం కోసం టెండర్లు ఖరారయ్యాయి. రూ.262.53 కోట్లతో పెదబూడి వద్ద ప్రధాన జలాశయంతోపాటు గ్రావిటీ, కాలువల ఎర్త్ పనుల కోసం రూ.28.83 కోట్లకు టెండర్లను హైదరాబాద్‌కు చెందిన హెచ్ఈఎస్ సంస్థ దక్కించుకుంది. కెనాల్ నెట్‌వర్క్ డిస్ట్రిబ్యూటరీ, పంప్‌హౌస్‌ల కోసం రూ.600 కోట్ల వ్యయంతో పిలిచిన టెండర్లు ఇటీవలే ఖరారయ్యాయి. జలాశయం గ్రావిటీ కాలువల పనులకు టెండర్లు దక్కించుకున్న ఆయా గుత్తేదారులు టీడీపీ పెద్దలకు బంధువులు కావడంతోనే పనులు ముందుకు సాగడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా విశాఖ జిల్లాలోని 8 మండలాల్లో 1.39 లక్షల ఎకరాలు తొలిదశలో సాగునీరందేలా డిజైన్ చేశారు. ప్రాజెక్టు తొలిదశ పనులకోసం సుమారు 4,400 ఎకరాలు అవసరమని అధికారులు లెక్కలు తేల్చారు. భూ సేకరణకు రూ.577.50 కోట్లు అవసరం కాగా, పునరావాసం కోసం రూ.148.45 కోట్లు, అటవీ భూముల కోసం మరో రూ.32 కోట్లు అవసరం. ఈ మేరకు జమ్మదపాలెం, టీడా వద్ద రెండు ఎత్తిపోతల పథకాలు నిర్మించాల్సి వుంది. పది టీఎంసీల నీటిని నిల్వచేసే సామర్థ్యంతో కూడిన జలాశయాన్ని పెదబూడి వద్ద నిర్మించనున్నారు. ఈ నిర్మాణాలు చేయాల్సిన చోట ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలను వేరే చోటకు తరలించి పునరావాసం కల్పించాల్సి వుంది. ఇందుకోసం రూ. 148 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఈ అంచనాలు కూడా మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టు కింద నిర్మించబోయే ఎత్తిపోతల పథకాల నిర్వహణ కోసం రూ.128 కోట్లు అవసరం కాగా, రెండు ఎత్తిపోతల పథకాలకు 44 మెగావాట్ల విద్యుత్ అవసరం. భారీ మోటార్లతో నడిచే ఈ పథకాలను నిర్మించబోయే కంపెనీలకు కనీసం 30 ఏళ్లు తక్కువ కాకుండా నిర్వహణ బాధ్యత అప్పగించారు. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి కేవలం రూ. 150 కోట్లు కేటాయింపుతో ఏ మేరకు ప్రాజెక్టు పూర్తవుతుందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం వేలల్లో కేటాయింపులు చూపించినప్పటికీ ఖర్చుచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం వెనుకంజ వేస్తున్నదని, కేవలం గుత్తేదారులకు దోహదపడేలా బిల్లులు చెల్లిస్తుందేతప్ప ప్రాజెక్టుల పనులు ముందుకు సాగడంలేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాలకు ఈ సుజలస్రవంతి ద్వారా సాగునీరు అందిస్తామన్న ప్రభుత్వ హామీకి మరెన్ని ఏళ్లు పడుతుందోనని రైతులు తలలు పట్టుకుంటున్నారు.

బాబు రాజకీయ చరిత్ర మోసపూరితం

ముఖ్యమంత్రిపై నిప్పులు చెరిగిన జగన్



విశాలాంధ్ర - రేణిగుంట : ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. బాబు ప్రజలను మోసం చేశాడని, నమ్మి 2014లో అధికారంలో కూర్చోబెడితే నయవంచన చేశాడని, ఎన్నికల ముందు ఒకమాట, ఎన్నికల తరువాత మరొకమాట మాట్లాడి ప్రజలను మోసం చేశాడని ధ్వజమెత్తారు. చిత్తూరుజిల్లా రేణిగుంటలో బుధవారం జరిగిన సమరశంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ జగన్ అనే నేను! సీఎం అయ్యాక పేదలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు.

ఇంక రెండు నెలల్లో ఎన్నికలు జరగబోతుండగా, బాబు ఇప్పుడు పసుపు కుంకుమ అంటూ ప్రజలను మభ్యపెడుతూ పాదయాత్రలో తాను చెప్పిన పథకాలకు పింఛన్ పెంపును వెంటనే చేసి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. బాబు సినిమా, సినిమాకు పోస్టర్లు మార్చిన విధంగా తన మాటలను, చేష్టలను మార్చుకుంటూ పేదలను మోసం చేస్తున్నాడన్నారు. 2014లో ఎన్నికల ముందు మోడీ, పవన్‌లతో ఒక సినిమా నడిపారని, ఆ సినిమాలో ప్రత్యేక హోదా తెస్తామని అన్నాడని, ఆపై ఎన్నికలలో గెలిచాక ప్రత్యేక హోదా వద్దు అని రెండో సినిమా ప్రజలకు చూపించాడని, 2019 ఎన్నికల ముందు మూడో సినిమాతో వస్తున్నాడన్నారు. రాష్ట్ర ప్రజలను కులం పేరుతో విడదీస్తున్నారన్నారు. బాబు రాష్ట్రంలో భూములను దోచుకొని ఆ పార్టీ నాయకులను మేపుతున్నాడన్నారు. ఆఖరికి ఎస్‌సీ, ఎస్‌టీల భూములను కూడా బలవంతంగా లాక్కొని బడా వ్యాపారవేత్తలకు దొడ్డిదారిన అమ్ముకుంటున్నాడన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బాబును ఓడించాలన్నారు. అనంతరం ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బియ్యపు మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి పెద్దరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రోజా, నాయకులు కరుణాకర్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, వెంకట్ గౌడ్, వెంకటస్వామి, మాజీ ఎంపీ మిథున్‌రెడ్డి, వరప్రసాద్, సిద్ధగుంట సుధాకర్‌రెడ్డి, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోదా కోరుతూ ఎస్.కోటలో

సీపీఐ బైక్ ర్యాలీ



విశాలాంధ్ర - శృంగవరపుకోట : ప్రత్యేకహోదా కోరుతూ విజయనగరం జిల్లా శృంగవరపుకోట పురవీధుల్లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్దికృష్ణ ఆధ్వర్యంలో బుధవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. కామేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను, 2014 ఎన్నికల్లో మోడీ, చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత నాలుగున్నరేళ్లుగా ప్రత్యేకహోదా సాధన సమితి ఆధ్వర్యంలో సీపీఐ ఇతర పార్టీలు కలుపుకుని హోదా సాధనకు పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తూ, చివరి అస్త్రంగా ఈ నెల1న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింద న్నారు. ఈ నెల 11 వరకు పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ఈ పదిరోజులు నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించామన్నారు. 8వ తేదీన వాహనాలను ఆపి, వాటిని తుడిచి వినూత్న రీతిలో నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రత్యేకహోదా సాధన సమితి జిల్లా కన్వీనర్ పి.కామేశ్వరరావు, సీపీఐ నాయకులు అప్పలరాజు, వి.గోపి, ఎం.అశోక్, నాగేశ్వరరావు, నాయుడు, త్రినాథ్, జగన్నాథం, ఎం.కృష్ణ పాల్గొన్నారు.

తుపాకీ మిస్ ఫైర్ !

- గాలిలోకి దూసుకువెళ్ళిన బుల్లెట్
- త్రుటిలో తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు : సాయుధ పోలీసు విభాగం (ఆర్మ్‌డ్ పోలీస్) లోని ఆయుధాగారంలో తుపాకులు అప్పగించే సమయంలో ఒక కానిస్టేబుల్ చేతుల్లో తుపాకీ ప్రమాదవశాత్తు పేలిన ఘటన బుధవారం పశ్చిమగోదావరిజిల్లా ఏలూరులో జరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. పోలీసు అధికారుల కథనం ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బందరు పర్యటన నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లకు ఏలూరు జిల్లా పోలీసు కార్యాలయం నుండి ఆర్మ్‌డ్ రిజర్వ్ ఫోర్స్ సిబ్బందిని మచిలీపట్నం పంపేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో సాయుధ పోలీసు దళంలో పనిచేసే సిబ్బంది, వారి వద్ద ఉన్న తుపాకులను కార్యాలయంలో అప్పగించి బందోబస్తు విధులకు వెళ్లవలసిఉంది. అందరూ హడావుడిగా తమ ఆయుధాలను బుధవారం ఉదయం కార్యాలయానికి తీసుకుచ్చారు. వారు సరెండర్ చేసిన తుపాకులలో తర్వాత బుల్లెట్ రౌండ్లు లోడ్ చేసి అప్పగించవలసిఉంటుంది. అదే సమయంలో అక్కడే ఉన్న కానిస్టేబుల్ మురళి తన తుపాకీలోని రౌండ్‌లను ఖాళీ చేసి ప్రక్కనే ఉంచి మూత్రశాలకు వెళ్ళాడు. ఇంతలో అతని స్నేహితుడు కూడా బుల్లెట్ లోడెడ్ తుపాకీని అతని తుపాకీ పక్కన ఉంచి మూత్రశాలకు వెళ్ళాడు. ముందుగా వచ్చిన మురళి లోడ్‌లో ఉన్న తుపాకీ తనదే అని భావించి పైకి ఎత్తాడు. ఈ సమయంలో తుపాకీ పేలి అందులో ఉన్న బుల్లెట్ వేగంగా గాల్లోకి ఫైర్ అయ్యింది. తుపాకీ పేలడంతో అప్రమత్తమైన కానిస్టేబుల్ మురళి తుపాకీని కిందకు దించి వెంటనే దాన్ని అన్‌లోడ్ చేశాడు. తుపాకీ గాలిలో పేలడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు వివరణ

తుపాకులను ఇతర విధులకు వెళ్లే సమయంలో కార్యాలయంలో అప్పగించి వెళ్లాల్సి ఉంటుంది. ఆ సమయంలో ఖాళీ చేసిన తుపాకీ పక్కన ఉంచి వెళ్లడం వలన పొరపాటుగా వేరొకరి తుపాకీని తన తుపాకీగా భావించి కార్యాలయంలో అందించే సమయంలో క్లీన్ షాట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలింది. వెంటనే అప్రమత్తమై తుపాకీలోని రౌండ్‌లను అన్‌లోడ్ చేశాం.. తుపాకీ గాలిలో పేలడం వల్ల ఎటువంటి ప్రమాదమూ జరగలేదని రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు వివరించారు.

ఊరిలోకే.. ఉచిత వైద్యం

- టెలీ కాన్ఫరెన్స్ ద్వారా రోగులకు వైద్యసేవలు
- 40 రకాల వ్యాధులకు పరీక్షలు, మందుల సరఫరా
- విజయనగరం జిల్లాలో తొలివిడత 18 కేంద్రాలు



విశాలాంధ్ర - విజయనగరం : మారుమూల గ్రామీణ ప్రాంతవాసులు అనారోగ్య సమస్యతో సుదూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్ళే పరిస్థితికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం తాజాగా టెలీ మెడిసన్ విధానాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. సమయంతోపాటు డబ్బు వృథాకాదని భావిస్తోంది. రోగులు గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాలకు చేరుకుంటే అక్కడ నుంచి నేరుగా టెలీకాన్ఫరెన్స్ ద్వారా వైద్యులు రోగ లక్షణాలను తెలుసుకుని ఉచితంగా మందులు పంపిస్తారు. విజయనగరం జిల్లాలో తొలివిడత 18 కేంద్రాల్లో ఈ విధానం అమలుచేయనున్నారు.

అమలు ఇలా..

విజయనగరం జిల్లాలోని 431 సబ్ సెంటర్లలో తొలి విడత టెలీ మెడిసిన్ విధానాన్ని 18 సబ్ సెంటర్లలో అమలు చేస్తున్నారు. వీటిలో ఎనిమిది ఎన్టీఆర్ ఆరోగ్య కేంద్రాలు, 10 ఏజెన్సీ ప్రాంతంలోని సబ్ సెంటర్లు ఉన్నాయి. ఆదివారం తప్ప మిగిలిన అన్ని రోజుల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు టెలీ కాన్ఫరెన్స్ వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి. రోగి పేరును ప్రత్యేక నంబరుతో రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత యూనిక్ ఐడీ ఆధారంగా కంప్యూటర్ ద్వారా రోగి లక్షణాలు, ఇతర సమాచారం సేకరిస్తారు. ఆధునిక పరికరాల ద్వారా రోగ నిర్ధారణ చేస్తారు. మల్టీ పారా మానిటర్ మిషన్ ద్వారా జ్వరం, బీపీ, హార్ట్‌బీట్, ఈసీజీ తదితర పరీక్షలు చేస్తారు. హిమోగ్లోబిన్ నిర్ధారణ కోసం మిషన్ ద్వారా రక్త పరీక్షలు, గ్లూకో మీటర్‌తో సుగర్ పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం వీడియో కన్సల్టేషన్ ద్వారా వైద్యులు సేవలందిస్తారు. మందులను డ్రగ్ వెల్డింగ్ మిషన్ల ద్వారా పంపిణీచేస్తారు. 40 వ్యాధులకు ఉచితంగా మందులు అందజేస్తారు. రోగిని అవసరమైతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరీక్షలకు పంపిస్తారు. 30 ఏళ్ళు పైబడిన మహిళలకు రొమ్ముక్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, నోటి క్యాన్సర్, దయాబెటిక్, హైపర్ టెన్షన్ వ్యాధులకు ప్రాథమిక పరీక్షలు చేస్తారు. వైద్యులు టెలీ కన్సల్టేషన్ ద్వారా సూచించిన మందులను ఆయా ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎంలు రోగులకు అందజేస్తారు.

మెరుగైన వైద్యసేవలు

గ్రామీణ ప్రాంతాల్లో రోగులు దూరంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్ళడానికి ఇబ్బంది పడుతున్నారు. టెలీ కాన్ఫరెన్స్ విధానంలో సొంత ఊళ్లోనే మెరుగైన వైద్యసేవలు అందుతాయి. అనేక వ్యాధులకు వైద్య నిపుణులు సేవలు అందిస్తారు. అవసరమైతే రిఫర్ చేస్తారు. రోగులు పూర్తి స్థాయిలో సేవలను వినియోగించుకోవాలి.

- కె.విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ

8న కెనడా, యూకే ఎడ్యుకేషన్ ఫెయిర్

విశాలాంధ్ర - విజయవాడ (లబ్బీపేట) : ఏఈసీసీ గ్లోబల్ కెనడా, యూకే ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ఈ నెల 8న విజయవాడ, బందరు రోడ్డులోని హోటల్ ఫార్చ్యూన్ మురళీ పార్క్‌లో నిర్వహించనున్నట్లు ఏఈసీసీ గ్లోబల్ స్టేట్ హెడ్ చైతన్య వాడవల్లి తెలిపారు. ఏఈసీసీ గ్లోబల్ విజయవాడ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో చైతన్య మాట్లాడుతూ కెనడా, యూకే నుంచి 20కి పైగా విశ్వవిద్యాలయాలు ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో పాల్గొంటాయని తెలిపారు. విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో విశ్వవిద్యాలయాల ప్రతినిధులను కలుసుకొని విద్య, కెరీర్‌కు సంబంధించిన విషయాలను తెలుసుకొని, స్కాలర్‌షిప్‌లకు కూడా అప్లయ్ చేసుకోవచ్చని తెలిపారు. దీనికి సంబంధించి ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేయబోమని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 8978787855 నంబరును సంప్రదించాలన్నారు. అనంతరం కెనడా, యూకే ఎడ్యుకేషన్ ఫెయిర్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఏఈసీసీ గ్లోబల్ మార్కెటింగ్ మేనేజర్ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రశాంత్ భూషణ్‌కు సుప్రీం నోటీసు

న్యూఢిల్లీ : అటార్నీ జనరల్ (ఏజీ), కేంద్రం విజ్ఞప్తి మేరకు ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌కు సుప్రీంకోర్టు నోటీసు జారీచేసింది. సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం నాగేశ్వరరావు నియామకాన్ని విమర్శిస్తూ ప్రశాంత్ భూషణ్ చేసిన ట్వీట్లపై కేంద్రం, ఏజీ కేకే వేణుగోపాల్ సుప్రీంకోర్టులో ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీనికి స్పందించిన అత్యున్నత న్యాయస్థానం బుధవారం ప్రశాంత్ భూషణ్‌కు నోటీసు జారీచేసింది. న్యాయమూర్తులు జస్టిస్ అరుణ్ మిశ్రా, నవీన్ సిన్హాలతో కూడిన ధర్మాసనం ఈ నోటీసుపై సమాధానం ఇచ్చేందుకు వారం రోజుల గడువు ఇచ్చింది. న్యాయ వ్యవస్థ తీసుకున్న నిర్ణయంపై న్యాయవాదులు లేదా ఇతర వ్యక్తులు బహిరంగంగా విమర్శలు చేయవచ్చా? అనే అంశానికి సంబంధించి ఈ ట్వీట్ పెద్ద చర్చకే దారితీస్తోందని ధర్మాసనం పేర్కొన్నది. ప్రజాభిప్రాయాన్ని ఈ ట్వీట్ ప్రభావితం చేస్తుందని తెలిపింది. న్యాయవ్యవస్థ ఇచ్చిన తీర్పులను ప్రశ్నించవచ్చా? అని కూడా అడిగింది. "ఈ అంశంపై సుదీర్ఘ చర్చ అవసరం. నోటీసు జారీచేశాం" అని ధర్మాసనం తెలిపింది. కేసు తదుపరి విచారణ మార్చి 7వ తేదీకి వాయిదావేసింది. రావు నియామకంపై కేంద్రం, వేణుగోపాల్ సుప్రీంకోర్టును తప్పుదోవ పట్టించే విధంగా వుందని భూషణ్ వ్యాఖ్యలున్నాయని పిటిషనర్లు పేర్కొన్నారు. ధిక్కరించే విధంగా భూషణ్ ట్వీట్లు ఉన్నాయి కనుక ఆయనపై కోర్టు ధిక్కార నేర చర్యలు తీసుకోవాలని కేంద్రం మంగళవారం అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది. పెండింగ్ కేసుకు సంబంధించి ఆయన తప్పుడు ప్రకటన చేశారని పేర్కొన్నది. భూషణ్‌పై వేణుగోపాల్ ధిక్కార పిటిషన్ దాఖలు చేసిన మరుసటి రోజు కేంద్రం తన పిటిషన్‌ను దాఖలు చేసింది.

సీబీఐ సంస్కరణలపై ఆలోచన లేదు : కేంద్రం

న్యూఢిల్లీ : సీబీఐలో విస్తృతమైన సంస్కరణలు చేపట్టే యోచన ఏదీ లేదని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. సీబీఐలో ఇద్దరు అత్యున్నత స్థాయి అధికారులు అలోక్ కుమార్ వర్మ, అప్పటి ప్రత్యేక డైరెక్టర్ రాకేష్ అస్థానా మధ్య అవినీతి ఆరోపణలపై లోక్‌సభలో ప్రశ్నలేవనెత్తడంతో సిబ్బంది వ్యవహారాల సహాయ మంత్రి జితేంద్రసింగ్ పై విధంగా రాతపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రధాని నేతృత్వంలోని హైపవర్ ప్యానల్ వర్మను సీబీఐ డైరెక్టర్‌గా తొలగించడంతో జనవరి 10 వరకు సీబీఐ డైరెక్టర్ పదవి ఖాళీగా ఉంది. మధ్యప్రదేశ్‌కు చెందిన పోలీసు అధికారి కుమార్ శుక్లాను శనివారం సీబీఐ చీఫ్‌గా నియామకం జరిపారు.



హోదా కోసం ఏపీ జేఏసీ అమరావతి ర్యాలీ

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: ప్రత్యేకహోదా విభజన హామీల సాధన కోసం ఏపీ జేఏసీ అమరావతి బుధవారం విజయవాడలో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించింది. రెవెన్యూభవన్ నుంచి ఆరంభమైన ర్యాలీ వివిధ ప్రాంతాలల్లో సాగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రత్యేకహోదా విభజన హామీలను కేంద్రప్రభుత్వం అమలు చేయాలని, హోదా సాధించేవరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ప్రత్యేకహోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఈనేపథ్యంలో ప్రత్యేకహోదా సాధన కోసం ప్రజాసంఘాలు, ప్రభుత్వ ఉద్యోగులు కసిగా పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్రప్రధానకార్యదర్శి టీవీ ఫణి పేర్రాజు మాట్లాడుతూ ప్రత్యేకహోదా సాధన కోసం ఏపీ జేఏసీ అమరావతి పోరాటాలు చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి కోశాధికారి మురళీకృష్ణనాయుడు, కృష్ణాజిల్లా చైర్మన్ ఈశ్వర్, సిటీ చైర్మన్ కళాధర్, గుంటూరు జిల్లా చైర్మన్ సంగీతరావు, లేబర్ డిపార్ట్‌మెంట్ ఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్, మహిళా విభాగం రాష్ట్రకన్వీనర్ జయశ్యామల, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హెన్రీబాబు పాల్గొన్నారు.

మోడీ పై యువభేరీ...

న్యూఢిల్లీ : రాజకీయాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కీలక సమయంలో దేశ రాజధాని న్యూఢిల్లీ మరో భారీ ఆందోళనకు వేదికగా నిలవనుంది. దేశ జనాభాలో 65 శాతంగా ఉన్న యువతకు ఒక శక్తివంతమైన సందేశాన్ని ఇచ్చే దిశగా భారీ ర్యాలీ జరగనుంది. ప్రపంచంలో అత్యధికంగా ఉన్న యువత నేడు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ తదితర రంగాలలో నిరాదరణకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో 'ది యంగ్ ఇండియా అధికార్ మార్చ్' ఆధ్వర్యంలో లక్షలాది యువత ఏడో తేదీన ఆందోళనకు దిగనున్నారు. 'మంచి రోజులు వస్తాయి' అంటూ ప్రధాని మోడీ విస్తృతంగా చేసిన ప్రచారం ఆచరణలో ఎక్కడా కార్యరూపం దాల్చలేదు. దేశంలో కార్పొరేటీకరణ విచ్చలవిడిగా పెరిగింది. విద్య, వైద్యం కార్పొరేట్‌ల కబంధాల్లోకి వెళ్లగా, నిరుద్యోగం విపరీతంగా పెరిగింది. ప్రభుత్వ యూనివర్సిటీలపై దాడులు పెచ్చరిల్లగా, సమాజంలో అసమానతలు పెరుగుతున్నాయి. వీటన్నింటినీ నిరసిస్తూ లక్షలాది యువత మంగళవారం ఢిల్లీలో నినదించనున్నారు. ఎక్కడలేని వరాలు ప్రకటించిన ప్రధాని మోడీ సర్కార్, ఇప్పటికీ మోసపూరిత ప్రకటనలతోనే కాల యాపన చేస్తోందని, విద్య, ఉద్యోగ, ఉపాధి అశాకాలను మెరుగుపరచటంపై దృష్టి సారిస్తున్న దాఖలాలు లేవనేది యువత ఆరోపణ. దేశంలో ఇప్పటికే నిరుద్యోగం ఏడు శాతానికి చేరింది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలేమో గానీ, ఏటా లక్షలాది మంది ఉద్యోగాలు ఊడుతున్నారు. మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కార్‌కు హెచ్చరిక చేసేందుకు యువత సిద్ధంకావటం రాజకీయంగా కలకలం సృష్టిస్తోంది.



మార్క్స్, గాంధీ, అంబేద్కర్ పోరాట స్ఫూర్తి

రాజకీయాలలో సరైన సిద్ధాంతాన్ని అవలంభించేందుకు యువత పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మార్క్స్, గాంధీని స్ఫూర్తిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమను తాము గాంధీ, మార్క్స్, అంబేద్కర్‌గా మలచుకుని హక్కుల కోసం ఢిల్లీ వీధుల్లోకి రావాలని యంగ్ ఇండియా అధికార్ మార్చ్ పిలుపునిచ్చింది. ఎన్నికల నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై యువత తిరుగుబాటును తిప్పికొట్టేందుకు పాలకులు అన్ని రకాలుగా ప్రయత్నించే అవకాశం ఉంది. కేంద్రాన్ని ప్రశ్నించినందుకు జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ నేతలు కన్హయకుమార్, ఉమర్ ఖలీద్ తరహాలో అక్రమ కేసులు బనాయించే ప్రమాదం కూడా ఉంది. ఈ నేపథ్యంలో యువత దీనిని ఎదుర్కొనటంతోపాటు ఖండిచాల్సిన అవసరం ఉందని మార్చ్ పిలుపునిచ్చింది. లేకుంటో యువకులపై మరో దేశద్రోహం నేరాన్ని మోపేందుకు కుట్ర జరిగే ప్రమాదం ఉందని ది యంగ్ ఇండియా అధికార్ మార్చ్ ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు.

విపక్ష కూటమి మద్దతు అవసరం

విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పించాలని, విద్యాసంస్థల కాషాయీకరణను వ్యతిరేకిస్తూ ది యంగ్ ఇండియా అధికార్ మార్చ్ తలపెట్టిన భారీ ఆందోళనకు విపక్ష కూటమి మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఎన్నికల వేళ ప్రతిపక్షాలు ఈ అవకాశాన్ని జారవిడుచుకునే అవకాశం ఉండకపోవచ్చని వ్యాఖ్యానిస్తున్నారు. యువత ఆందోళనకు విపక్షాలు హాజరుపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. రాజకీయ పండితులు కపిల్ సిబల్, అఖిలేష్ యాదవ్ తదితరులు యువత ఆందోళనకు నైతిక మద్దతు ఇవ్వటం ఏమాత్రం ప్రమాదకరంకాదనే వాదన బలంగా వినిపిస్తోంది. అదే సమయంలో వాస్తవ ఆందోళనకు, రాజకీయ కుటిలనీతికి మధ్య ఉన్న వ్యత్యాసం ముఖ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

యువత సరికొత్త భాష్యం చెప్పేనా...

యువత చేపట్టిన పోరాటం అన్ని ఆటంకాలను ఎదుర్కొంటూ రాజకీయాలకు సరికొత్త భాష్యం చెబుతుందా, లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే దేశ రాజకీయాలు అమిత్‌షా, మోడీ, చంద్రబాబు, మాయావతి, మమతా బెనర్జీ చుట్టూ తిరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితులలో తమ హక్కుల సాధన కోసం యువత ఢిల్లీలో భారీ ఆందోళన చేపట్టనుండటం చర్చనీయాంశంగా మారింది.

పార్లమెంటులో వాజ్‌పేయి చిత్రపటం

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నిలువెత్తు చిత్రపటాన్ని ఈనెల 12న పార్లమెంటు సెంట్రల్ హాలులో ఆవిష్కరించనున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దీనిని ఆవిష్కరిస్తారు. కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, ప్రధాని నరేంద్ర మోడీ, మంత్రులు, వివిధ పార్టీల నేతలు పాల్గొనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ నేతృత్వంలో పార్లమెంట్ పోర్ట్రైట్ కమిటీ గత డిసెంబరు 18న సమావేశమై వాజ్‌పేయి చిత్రపటాన్ని పార్లమెంటులో ఆవిష్కరించాలని నిర్ణయించింది. సమావేశానికి హాజరైన డిప్యూటీ స్పీకర్ ఎం.తంబిదురై, కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే, బీజేపీ నేత బి.మహతాబ్, టీఎంసీ నేత సుదీప్ బందోపాధ్యాయ్, టీఆర్ఎస్ నేత జితేంద్ర రెడ్డి, శివసేన నేత ఆనంత్ గీతె, బీజేపీ నేత సత్యనారాయణ దతియా అంగీకారం తెలిపారు. పార్లమెంటు సెంట్రల్ హాలులో తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ తదితరుల చిత్రపటాలు ఉన్న విషయం తెలిసిందే.

లక్షల రూపాయలు బుగ్గి

మంగళూరు: ఉడిపి జిల్లాలోని ముల్కూర్ కార్పోరేషన్ బ్యాంకు శాఖలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. లక్షల రూపాయలు బుగ్గి అయ్యాయి. మంటలను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షార్ట్‌సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు.

ప్రేమోన్మాది దాడి

మధులిక పరిస్థితి విషమం

హైదరాబాద్: ప్రేమోన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన మధులిక యసోద ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇప్పుడు ఆమె పరిస్థితి ఎలా ఉందన్నదానిపై ఆమెకు చికిత్స అందిస్తున్న డాక్టర్లు ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మధులికను ఆస్పత్రికి తీసుకువచ్చినప్పుడు బీపీ డౌన్ అయిందని, తల, భుజం, చేతులపై తీవ్రగాయాలు అయ్యాయని చెప్పారు. తీవ్రంగా రక్తం పోవడంతో బీపీ పడిపోయిందని తెలిపారు. ముందుగా ఆమెకు రక్తం ఎక్కించామన్నారు. సిటీస్కాన్ చేయించామని తల వెనుకభాగంలో పెద్ద గాయం అయిందని, పుర్రె ఎముక విరిగి, బ్రెయిన్‌లో కొంత డ్యామేజ్ అయిందని, బ్రెయిన్‌లోకి గాలి చొరబడిందని.. దీంతో ఆమె కోమాలో ఉందని, వెంటిలేటర్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగానే ఉందని, 72 గంటలు గడిస్తేగానీ ఏ విషయం చెప్పలేమని డాక్టర్లు చెప్పారు.

నిందితుడు భరత్ అరెస్టు

ఇంటర్ విద్యార్థినిపై కత్తితో దాడిచేసిన ప్రేమోన్మాది భరత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తూర్పు మండల డీసీపీ రమేష్ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. "విద్యార్థిని తనతో మాట్లాడటం లేదని ఉదయం 8.45గంటలకు భరత్ ఆమెను అటకాయించి కొబ్బరి బోండాలు నరికే కత్తితో దాడి చేశాడు. ఈదాడిలో బాధితురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెకు యశోదా ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నాం. నిందితుడు భరత్‌ను మూసీ నది ఒడ్డున పట్టుకున్నాం. దాడికి ఉపయోగించిన కత్తిని అతని ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్నాం. బాధితురాలి ఇంటికి 15 అడుగుల దూరం లోనే నిందితుడి ఇల్లు ఉంది. ఆ ప్రాంతంలో ఇరుకైన గల్లీలు ఉండటంతో దాడి జరిగినప్పుడు స్థానికులు సకాలంలో స్పందించలేకపోయారు. నెలక్రితం భరత్ ఆమెను వేధించడంతో ఇరు కుటుంబాల వారు వెల్‌నెస్ సెంటర్‌కు వెళ్లారు. సామరస్యంగానే పిల్లలను దూరంగా ఉంచాలని అనుకున్నారు. గతంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లోనూ తల్లిదండ్రులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. పిల్లల మధ్య స్నేహం ఎవరికీ తెలియ కూడదనుకున్నారు. వీరిద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు. నిందితుడిపై హత్యాయత్నం, పోక్సో కింద కేసులు పెడతాం. భరత్‌కు నేర చరిత్ర లేదు" అని తెలిపారు.

ఫ్యాకల్టీ రిజర్వేషన్ల విధానంపై

త్వరలో రివ్యూ పిటిషన్ : జవదేకర్

న్యూఢిల్లీ : యూనివర్సిటీల్లో బోధనాసిబ్బంది రిజర్వేషన్ల విధానంపై సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం త్వరలో రివ్యూ పిటిషన్ దాఖలు చేయ నుందని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ తెలిపారు. శాఖల వారీగా ఉద్యో గాల గణాంకాలను కాకుండా విశ్వ విద్యాలయం లోని ఖాళీల మొత్తాన్ని ప్రకటించే విధానాన్ని సుప్రీంకోర్టు గత నెలలో తిరస్కరించింది. టీచర్లు, విద్యార్థులు, విద్యార్థిసంఘాలు ఆందోళన నేపథ్యం లో ఇంతకు ముందున్న విధానాన్నే కొన సాగించే విధంగా పిటిషన్ దాఖలు చేస్తామన్నారు. ఈ విషయంలో న్యాయం లభిస్తుందని ఇంతకు ముందు లా రిజర్వేషన్లు కొనసాగుతాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ఎస్సీ,ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయడంపై వెనక్కి తగ్గబోమన్నారు. మునుపటి విధానంలో రిజర్వేషన్ల అమలుకోసం వర్సిటీని ఒక యూనిట్‌గా పరిగ ణించేవారని, అలహాబాద్ హైకోర్టు, సుప్రీంకోర్టులు శాఖల వారీగా రిజర్వేషన్లు అమలు చేయాలని తీర్పు వెలువరించడంతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు తగ్గుతున్నాయని జవదేకర్ వెల్లడిం చారు. దీనిపై ప్రధాని మోడీ ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిందని అయితే సుప్రీంకోర్టు దీనిని అంగీకరించలేదన్నారు.

దీంతో ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకాలను వాయిదా వేయాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అన్ని వర్సిటీలకు, ఉన్నత విద్యా సంస్థలకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పటి వరకు ఈ రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు తన తీర్పును సమీక్షించలేదు. 2017లో అలహాబాద్ హైకోర్టు తీర్పుమేరకు గతేడాది మార్చిలో ఆయా శాఖలను ఒక యూనిట్‌గా పరిగణించి టీచర్ పోస్టులకు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కల్పించాలని యూజీసీ ప్రకటన వెలువరించిన విషయం తెలిసిందే.

యువత సమరశంఖం పూరించాలి

- ప్రతి యువకుడు సైనికుడిగా మారాలి
- పాలకుల వైఫల్యాలను ఎండగట్టాలి
- ఏఐవైఎఫ్‌కు మహత్తర త్యాగాల చరిత్ర
- కృష్ణాజిల్లా 18వ మహాసభలో వక్తలు



సభలో మాట్లాడుతున్న లెనిన్. వేదికపై రాజా, అఫ్సర్, నరేష్ తదితరులు

విశాలాంధ్ర - విజయవాడ : ప్రభుత్వాలు అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిపై యువత సమరశంఖం పూరించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్ పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ కృష్ణాజిల్లా 18వ మహాసభ స్థానిక హనుమాన్ పేటలోని దాసరి నాగభూషణరావు భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఏఐవైఎఫ్ మాజీ నాయకులు, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ పతాకాన్ని ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో ఎన్.లెనిన్ మాట్లాడుతూ ఏఐవైఎఫ్‌కు మహత్తర పోరాటాల, త్యాగాల చరిత్ర ఉందని గుర్తు చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులు యుక్తవయసు లోనే ఉరి కొయ్యను ముద్దాడారని కొనియాడారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని యువత స్థానిక సమస్య లపై ఉద్యమించాలని, పాలకుల వైఫల్యాలను, మోసాలను ప్రజలకు వివరించాలని, యువజన సమాఖ్యను బలోపేతం చేయాలని సూచించారు. గత పోరాటాలను సమీక్షించుకుని, భవిష్యత్ ఉద్య మాలకు, యువజన సమాఖ్యను బలోపేతం చేయడానికి ఈ మహాసభ దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ అఫ్సర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రం లోని టీడీపీ ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని చెప్పారు. ప్రజాసాధికార సర్వే ప్రకారం రాష్ట్రంలో 36 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, అయితే కేవలం 4 లక్షల మందికి మాత్రమే నిరుద్యోగ భృతి ఇస్తున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన ఉద్యోగాలకంటే తొలగించిన ఉద్యోగులే ఎక్కువగా ఉన్నారని మండిపడ్డారు. ఉద్యోగాలు భర్తీ చేయకుండా వయోపరిమితి పెంచుతామని ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటన్నారు. దోనేపూడి శంకర్ మాట్లాడుతూ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో యువజన సమాఖ్య అత్యంత కీలక భూమిక పోషించిందని గుర్తు చేశారు. దేశం ఐక్యంగా ఉండాలని యువజన సమాఖ్య అనేక పోరాటాలు సాగించిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీ సాగిస్తున్న మతోన్మాద విధానాలను తిప్పికొట్టి దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ మాట్లాడుతూ గ్రామస్థాయిలో సమస్యలపై పోరాటం చేసి యువజన సమాఖ్యను బలోపేతం చేయాలని సూచించారు. దేశంలో సంపద, అభివృద్ధి అందరికీ అందేలా చేయాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. యువత రాజకీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో యువత కీలక భూమిక పోషించాలని సూచించారు. ఈ మహాసభకు అధ్యక్ష వర్గంగా పడమట నరేష్, విజయ్‌కుమార్, బుద్దె రాజా వ్యవహరించారు. ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ పరుచూరి రాజేంద్ర, విజయవాడ నగర అధ్యక్షుడు మొయినుద్దీన్, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి పి.చరణ్‌సాయి, యువజన సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

కమ్యూనిజం

మార్క్సిస్టు సిద్ధాంత మాసపత్రిక

ఫిబ్రవరి సంచిక వెలువడింది

- మోడీ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలను ఉధృతం చేయాలి - సురవరం సుధాకరరెడ్డి
- బ్యాంకుల విలీనం కాదు - విస్తరణ కావాలి - సిహెచ్. వెంకటాచలం
- హిందూమతం అంటే ఏమిటి? చరిత్ర ఏం చెప్పింది? - రూపా ఝా
- శాస్త్రీయ దృక్పధాన్ని సమర్థించాలి - దీపాంకర్ డిసర్కార్
- అనుమానాలు తీర్చని రాఫేల్ తీర్పు
- మదురో సర్కార్‌పై సైనిక తిరుగుబాటుకు కుట్ర! - ఎం. కోటేశ్వరరావు
- ఆంధ్రప్రదేశ్‌లో మారిన సామాజిక, రాజకీయ సమీకరణలు (1) - ఎన్. పురేంద్రప్రసాద్ & సిహెచ్. సతీష్
- ఉదారవాద విధానం బలిపశువు - కార్మికసంఘం - టి.కె. రాజ్యలక్ష్మి
- అజ్ఞానం దిశగా భారతీయ విజ్ఞానం - డా. సి.ఎన్. క్షేత్రపాల్‌రెడ్డి
- రాష్ట్ర ప్రభుత్వ భూరికార్డుల గందరగోళం - బి. సాంబశివరావు
- గతం - వర్తమానం - ఎస్‌జి సర్దేశాయ్
- సంస్కృతి గురించి రెండు మాటలు - డా. తక్కోలు మాచిరెడ్డి
- హిందూత్వం? - అత్తలూరి గోపాలకృష్ణ
- భారతదేశంలో లౌకికవాదం - భిన్న వ్యాఖ్యానాలు - సంగిరెడ్డి హనుమంతరెడ్డి
- మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్ర పరిచయం (2) - కడియాల వెంకటరమణ
- కమ్యూనిస్టు పార్టీల సమాచారం -ఎంసి
- చదవదగిన పుస్తకం - సింగమనేని నారాయణ

చంద్రంబిల్డింగ్స్, మాచవరం, విజయవాడ - 520 004.
ఆఫీస్ ఫోన్స్ : 0866-2431301, సెల్ : 8121223457

సీపీఎస్ విధానం రద్దు : కత్తి డిమాండు



విశాలాంధ్ర -అమరావతి : విద్యాశాఖలో ఉపాధ్యాయుల పదోన్నతులలో జాప్యాన్ని పరిష్కారించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యా శాఖలో ఉపాధ్యాయులు కు పదోన్నతులు కల్పించేందుకు జీఓ 91ని గతేడాది డిసెంబరులో విడుదల చేసినా నేటికీ అమలు కాలేదన్నారు. దీంతో 19 వేల మంది టీచర్లకు పదోన్నతులు లభించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు. పురపాలక శాఖలోనూ ఇదే తరహా పరిస్థితి ఉందని చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగుల కోసం ఎమ్మెల్సీతో ఒక కమిటీ వేశారని, కమిటీ సూచనలకు విరుద్ధంగా జీఓ12ను తెచ్చారని, దీనిని పునఃసమీక్షించాలని ఆయన డిమాండు చేశారు. ఈ విషయమై సంబంధిత మంత్రిని కలిసినట్లు తెలిపారు. సీపీఎస్ అంశంపై కమిటీ వేశానా నేటికీ నివేదిక రాలేదన్నారు. సీపీఎస్ రద్దు కోసం ఫ్యాప్టో చలో అసెంబ్లీకి పిలుపిచ్చిందని తెలిపారు. సీపీఎస్ రద్దు కోసం దీక్షలు చేసిన 21 మందిపై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని కత్తి నర్సింహారెడ్డి డిమాండు చేశారు. సీపీఎస్‌పై అసెంబ్లీలో ఆందోళ కొనసాగిస్తామన్నారు.

అసోం బడ్జెట్ అదుర్స్..!

- తులం బంగారం.. రూపాయికి కిలో బియ్యం
- వధువు, పేదలకు ప్రభుత్వం కానుక
- ప్రతిపాదించిన ఆర్థిక మంత్రి బిశ్వాస్ శర్మ







గువహటి : దేశంలో ప్రభుత్వాల బడ్జెట్‌లు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు అందించే సంక్షేమ ఫలాల విషయంలో అంచనాలు దాటి ప్రజలను ఆకర్షించే పనిలో పడ్డాయి. ఉచితాలకు పోయి అసలు సంక్షేమాన్ని గాలి కొదిలేస్తున్నాయి. అదే కోవలోకి అసోం ప్రభుత్వమూ చేరింది. అసోం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వినూత్న ప్రతిపాదనలు చేసింది. బుధవారం రాష్ట్ర శాసనసభలో 2019-20 సంవత్సరానికిగాను రూ.1,193 లోటు బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి హిమంత బిశ్వాస్ శర్మ ప్రవేశపెట్టారు. వధువుకు తులం బంగారం, పేదలకు కిలో రూపాయి బియ్యం అందించడం వంటి కొత్త పథకాలతో తాజాగా ఎటువంటి పన్నులు లేకుండా బడ్జెట్‌ను రూపొందించారు. మైనస్ రూ.1,799.84 కోట్ల ప్రారంభ నిల్వతో మైనార్టీ వర్గానికి చెందిన బాలికలతో సహా విద్యార్థులకు ఆర్థిక సాయం అందించేందుకు ఇందులో ప్రతిపాదించారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికి రూ.606.80 కోట్లు లావాదేవీలను ప్రతిపాదించినట్లు ఆర్థిక మంత్రి సభకు తెలిపారు.

శర్మ మాట్లాడుతూ అసోం వంటి ప్రత్యేక తరగతి హోదా కలిగిన రాష్ట్రాలకు వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) కోసం రూ.10 లక్షల టర్నోవర్ కలిగిన కంపెనీలు రిజిస్టర్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న వ్యాపారాలకు సహాయపడేందుకుగాను 2019, ఫిబ్రవరి 1న జీఎస్‌టీ కౌన్సిల్ ఆమోదించిన నేపథ్యంలో ప్రభుత్వం జీఎస్‌టీ పరిమితిని రూ.20 లక్షలకు పరిమితి పెంచింది. అలాగే వస్తు సరఫరాదారులకు జీఎస్‌టీ క్రింద నమోదు కోసం పరిమితిని రూ.40 లక్షలకు ప్రభుత్వం ప్రతిపాదించింది. జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) క్రింద అసోం మొత్తం జనాభా 2.46 కోట్ల మందిలో 57 లక్షల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం కిలో బియ్యం రూ.3లకు అందజేస్తోందని ఆర్థిక మంత్రి శర్మ తెలిపారు. 'మా ప్రజలకు ఆహార భద్రతను మరింత పటిష్టం చేసేందుకు ప్రస్తుతం ఉన్న కిలో రూ.3కు అందజేసే బియ్యంను కేవలం రూపాయి ధరతో అందజేసే ఏర్పాటుచేస్తాం. ఈ ప్రతిపాదనతో 53 లక్షల కుటుంబాలు ప్రయోజనం పొందుతాయి' అని అన్నారు. సమాజంలో ఆర్థిక వెనుకబడిన వర్గాలకు చెందిన వధువు తల్లిదండ్రులకు ఒక తులం బంగారం(11.66 గ్రాములు) ఇచ్చే ప్రతిపాదనను కూడా ప్రభుత్వం చేసిందని ఆయన తెలిపారు. అరుంధతి పథకం క్రింద 'వివాహం సమయంలో బంగారం అందించే సంప్రదాయం ఉన్న మన రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు చెందిన వధువులకు ఈరోజు సుమారు రూ.38 వేలు విలువగా ఉన్న తులం బంగారాన్ని మేము అందిస్తాం' అని ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో వివరించారు.

సీపీఎస్ రద్దుకు ఎమ్మెల్సీల డిమాండు

మండలిలో వాయిదా తీర్మానానికై పట్టు

విశాలాంధ్ర-అమరావతి : సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ శాసనమండలిలో బుధవారం పిడీఎఫ్, ఇతర ఎమ్మెల్సీలు వాయిదా తీర్మానం ఇచ్చారు. మండలి ప్రారంభం కాగానే పిడీఎఫ్ ఎమ్మెల్సీలతో కలిసి కత్తి నరసింహ రెడ్డి వెల్‌లోకి వెళ్లి సీపీఎస్‌పై చర్చించాలని పట్టుబట్టారు. సీపీఎస్ ద్వారా ఉద్యోగులుకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మండలిలో ఈ అంశంపై చర్చించాలని డిమాండు చేశారు. ఇన్‌ఛార్జ్ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తూ విరామం సమయంలో సంబంధిత మంత్రితో చర్చించి సమాధానమిచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగులకు తీరని నష్టం కలుగుతుందని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఎమ్మెల్సీలు విజ్ఞప్తి చేశారు. సీపీఎస్‌పై ఏ విధమైన స్పష్టత రాకపోవడంతో ఉద్యోగ సంఘాల తలపెట్టిన ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలియ చేస్తామని వెల్లడించారు.

యువకుల హత్యకేసులో ఏడుగురు దోషులు

ముజఫర్‌నగర్: ముజఫర్‌నగర్ అల్లర్ల సమయంలో ఇద్దరు యువకులను హత్య చేసిన కేసులో కోర్టు ఏడుగురిని దోషులుగా నిర్ధారించింది. ఏడుగురు నిందితులు ముజామిల్, ముజస్సిమ్, ఫర్కన్, నదీమ్, జానంగిర్, అఫ్జల్, ఇక్బాల్‌లను దోషులుగా కోర్టు నిర్ధారించింది. ఈ కేసులో తుదితీర్పును శుక్రవారానికి వాయిదా వేసింది. 2013, ఆగస్టు 27న అల్లర్ల సమయంలో జరిగిన దాడిలో కావల్ గ్రామానికి చెందిన గౌరవ్, సచిన్లు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు ఈ ఘటనకు సంబంధించి ఏడుగురిపై కేసు నమోదు చేశారు. పది మంది సాక్షుల వాంగ్మూలాలు తీసుకున్నారు. సాక్ష్యాధారాలను విచారించిన న్యాయస్థానం ఆ ఏడుగురిని దోషులుగా తేల్చింది.

విశాలాంధ్ర

క్రీడలు

పాండ్య, రాహుల్‌పై కేసు

జోద్‌పూర్ :
'కాఫీ విత్ కరణ్ షో'లో మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యల సెగ టీమిండియా యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లను ఇప్పట్లో వదిలేలా లేదు. ఇప్పటికే ఈ వివాదం వల్ల సస్పెండై మూల్యం చెల్లించు కున్నా ఇద్దరి కష్టాల కథ మళ్లీ మొదటికొచ్చింది. ఈ అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పాండ్య, రాహు ల్‌తో పాటు షో నిర్వాహకుడు, కరణ్ జోహర్‌లపై కేసు నమోదైంది. మహిళలను కించపరిచేలా అభ్యంతరకరంగా మాట్లాడిన పాండ్య రాహుల్‌తో పాటు షో నిర్వాహకుడిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని రాజస్థాన్‌కు చెందిన డీఆర్ మేఘావాల్ అనే వ్యక్తి జోద్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పాండ్య, రాహుల్‌ల వ్యాఖ్యలపై తీవ్ర దుమారం చెలరేగడంతో నిరవధిక నిషేధం విధిస్తూ బీసీసీఐ చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ ఇద్దరి ఆటగాళ్లను ఆస్ట్రేలియా పర్యటన నుంచి అకస్మాత్తుగా స్వదేశానికి పిలిపించింది. తొలుత క్రికెట్ పరిపాలక కమిటీ (సీఓఏ) చీఫ్ వినోద్ రాయ్ రెండు మ్యాచ్‌ల నిషేధంతో సరిపెట్టాలని భావించినా, మరో సభ్యురాలు డయానా ఎడుల్జీ న్యాయ సలహాకు పట్టుబట్టడంతో వీరిద్దరిపై నిరవధిక నిషేధాన్ని విధించారు. కొన్ని రోజుల నాటకీయ పరిణామాల అనంతరం పాండ్య, రాహుల్‌లపై సీఓఏ నిషేధాన్ని ఎత్తివేసింది. అనంతరం పాండ్య న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న జట్టుతో కలిశాడు. రాహుల్ భారత్-ఏ జట్టు తరపున ఇంగ్లండ్ బ్లా జట్టుతో ఆడుతున్నాడు. ఈ నేపథ్యంలో ముగిసిపోయిందనుకున్న ఈ వివాదంపై మళ్లీ కేసు నమోదు కావడం చర్చనీయాంశమైంది. ఇది ప్రపంచకప్‌లో పాల్గొనబోయే పాండ్య ఆటపై ప్రభావం చూపుతుందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.





భారత్‌కు ఝలక్..!

- 80 పరుగుల తేడాతో కివీస్ విజయం
- క్యూకట్టిన టీమిండియా బ్యాట్స్‌మెన్



వెల్లింగ్టన్ : న్యూజిలాండ్ అదరగొట్టింది. రోహిత్ సేనను ఒక ఆట ఆడుకుంది. బౌండరీలు, సిక్సర్ల మోత మోగించి భారత్ ఎదుట 220 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. బౌలింగ్‌లోనూ రాణించి 139 పరుగులకే టీమిండియాను ఆలౌట్ చేసి 80 పరుగుల తేడా విజయం అందుకుని మూడు టీ20ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

సీఫర్ట్ వీరబాదుడు..

తొలుత టాస్ గెలిచిన రోహిత్ న్యూజిలాండ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఓపెనర్ గప్టిల్ గాయం కారణంగా అతడి స్థానంలో వచ్చిన సీఫర్ట్ మరో ఓపెనర్ మన్రోతో కలిసి భారత బౌలర్లకు చుక్కలు చూపించాడు. ముందుగా మన్రో ధాటిగా ఆడడం మొదలు పెట్టినా..క్రమంగా జోరు అందుకున్న సీఫర్ట్ బౌండరీల వర్షం కురిపించాడు. 5 ఓవర్లకే కివీస్ స్కోరు 54 పరుగులకు చేరుకుంది. జట్టు 86 స్కోరు వద్ద మన్రో (30 పరుగులు 20 బంతులు 2 ఫోర్లు, 2 సిక్సులు) వెనుదిరగడంతో వీరి జోడీకి బ్రేక్ పడింది. వన్‌డౌన్‌లో వచ్చిన విలియమ్సన్‌తో కలిసిన సీఫర్ట్ మరింత దూకుడుగా ఆడాడు. ఈ క్రమంలో 30 బంతులకే సీఫర్ట్ అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. 6 సిక్సర్లు, 7 బౌండరీలు కొట్టిన సీఫ్రర్ట్ 43 బంతుల్లో 83 పరుగులు చేసి జట్టు 134 పరుగుల వద్ద రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. తరువాత వచ్చిన మిట్చెల్ (8) వెనుదిరిగాడు. కేన్ విలియమ్సన్ (34 పరుగులు 22 బంతుల్లో 3 ఫోర్లు)ను చాహల్ బౌలింగ్‌లో వెనుదిరిగే సరికి కివీస్ 164 పరుగులు చేసింది. చివర్లో రాస్ టేలర్ (23), కుగులీన్ (20) మెరుపులు మెరిపించడంతో న్యూజిలాండ్ నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 219 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్య 2, భువి, ఖలీల్, కృనాల్, చాహల్ తలో వికెట్ తీశారు.

క్యూ కట్టిన బ్యాట్స్‌మెన్...

భారీ లక్ష్యంతో బరిలో దిగిన భారత్ 2.2 ఓవర్లలోనే రోహిత్(1) రూపంలో తొలి వికెట్ కోల్పోయింది. కానీ మరో ఓపెనర్ ధావన్ వన్‌డౌన్‌లో వచ్చిన విజయ్ శంకర్‌తో కలిసి కాసేపు ధాటిగా ఆడే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఫెర్గుసన్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్‌గా ధావన్ (29) వెనుదిరిగాడు. ఆ తరువాత వచ్చిన పంత్(4) తక్కువ స్కోరుకే ఔటయ్యాడు. స్కోరు పెంచే క్రమంలో భారీ షాట్‌కు యత్నించి శంకర్ (27) క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. హార్దిక్ పాండ్య (4) మెప్పించలేక పోయాడు. ధోనీతో కలిసి జట్టును గట్టెక్కించే ప్రయత్నం చేసిన కృనాల్ పాండ్య(20) పరుగులకే కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తరువాత వచ్చిన బ్యాట్స్‌మెన్ వెనువెంటనే పెవిలియన్ చేరంతో ఓటమి తప్పలేదు.

అమ్మాయిలూ.. ఓడారు..!



★ 160 పరుగుల లక్ష్య ఛేదనలో బోల్తా

★ 136కే ఆలౌట్

★ మంధానా రికార్డు అర్ధశతకం వృథా

వెల్లింగ్టన్ :
భారత మహిళ జట్టు న్యూజిలాండ్‌తో తొలి టీ20ని చేజేతులారా చేజార్చుకున్నారు. బుధవారం జరిగిన తొలి టీ20లో భారత మహిళలు 23 పరుగుల తేడాతో ఓటమిపాలయ్యారు. న్యూజిలాండ్ విధించిన 160 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక 136 పరుగులకే ఆలౌటయ్యారు. ఓపెనర్ స్మృతి మంధాన, వన్‌డౌన్ బ్యాట్స్‌వుమన్ జెమీమా రోడ్రిగ్స్, హర్మన్ కౌర్ మినహా ఎవ్వరూ రెండంకెల స్కోరు అందుకోలేకపోయారు. తొలుత టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ టీ20ల్లోకి ప్రియా పూనియా అరంగేట్రం చేయగా.. సీనియర్ క్రికెటర్ మిథాలీరాజ్‌కు తుదిజట్టులో చోటు దక్కలేదు. తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్.. డెవైన్ (62), కెప్టెన్ సట్టర్ వెయిట్ (33), కేజే మార్టిన్(27)లు రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లకు నాలుగు వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. భారత మహిళల్లో అరుంధతి రెడ్డి, రాధా యాదవ్, పూనమ్ యాదవ్, దీప్తి శర్మలకు ఒక్కో వికెట్ దక్కింది.

మంధాన అర్ధశతకం...

160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హర్మన్‌సేనకు ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. ఓపెనర్‌గా బరిలో దిగిన అరంగేట్ర బ్యాట్స్‌వుమెన్ ప్రియా పునియా (4) తీవ్రంగా నిరాశపర్చింది. అనంతరం వన్‌డౌన్‌లో వచ్చిన జెమీమాతో కలిసి మంధాన చెలరేగింది. 24 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో భారత తరపున అత్యంత వేగవంతమైన అర్ధ సెంచరీ నమోదు చేసిన రికార్డు నెలకొల్పింది. రెండో వికెట్‌కు 98 పరుగుల జోడించిన అనంతరం మంధానా (58) వెనుదిరిగింది. ఆ సమయం జట్టు స్కోర్ 102 పరుగుల కాగా.. భారత విజయానికి 51 బంతుల్లో 58 పరుగులే అవసరం. ఈ పరిస్థితుల్లో భారత విజయం లాంఛనమేనని భావిస్తున్న తరుణంలో కివీస్ బౌలర్లు చెలరేగారు. మంధానా ఔటైన వెంటనే రోడ్రిగ్స్(39) కూడా వెనుతిరగడంతో భారత బ్యాట్స్‌వుమెన్ పెవిలియన్‌కు క్యూ కట్టారు. హేమలత (3), అనూజ పాటిల్(0), అరుంధతి రెడ్డి(2), హర్మన్‌ప్రీత్ కౌర్(17), దీప్తి శర్మ(5), తానియ బాటియా(1), పూనమ్(3)ల వికెట్లు వరుసగా కోల్పోవడంతో భారత జట్టు 136 పరుగులకే కుప్పకూలింది. కివీస్ బౌలర్లలో తాహుహు 3 వికెట్లతో చెలరేగగా.. కస్పెరెక్, కేర్‌లు రెండేసి వికెట్లు పడగొట్టారు. డివైన్, మేర్, సట్టర్‌వైట్‌లకు తలో వికెట్ దక్కింది.

అందుకే ఓడిపోయాం.. : రోహిత్

వెల్లింగ్టన్:
న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో 80 పరుగుల తేడాతో టీమిండియా ఘోర పరాజయం చవిచూసింది. ఆతిథ్య కివీస్ నిర్దేశించిన 220 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా బ్యాట్స్‌మెన్ చేతులేత్తేశారు. దీంతో భారత్‌కు ఘోరపరాజయం తప్పలేదు. ఈ ఓటమితో మూడు టీ20ల సిరీస్‌లో 0-1తో టీమిండియా వెనకంజలో ఉంది. కివీస్ ఓపెనర్ సీఫ్రెట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు' లభించింది. బహుమతి ప్రదానోత్సవం అనంతరం టీమిండియా తాత్కాలిక సారథి రోహిత్ శర్మ మాట్లాడుతూ.. ఈ మ్యాచ్‌లో అన్ని విభాగాల్లోనూ పూర్తిగా విఫలమయ్యామని, అందుకే ఘోరంగా ఓడిపోయామని పేర్కొన్నాడు.

ఫింగర్ స్పిన్నర్లూ.. మెరుగవ్వాల్సిందే



హైదరాబాద్:
టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు వరల్డ్ కప్ జట్టులో ఎంపికయ్యే అవకాశాలు ఇంకా ఉన్నాయని టీమిండియా వెటరన్ ఆఫ్ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అన్నాడు. ఏడాదిన్నర కాలంగా చైనామన్ స్పిన్నర్లు యజువేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్‌లు పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేస్తుండటంతో సీనియర్ ఆటగాళ్లు రవిచంద్రన్ అశ్విన్, జడేజాలు టెస్టులకే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో ఫింగర్ స్పిన్నర్లకు ఆల్‌రౌండ్ నైపుణ్యాలు ఉన్నప్పటికీ జట్టులో కొనసాగేందుకు మరింతగా మెరుగవ్వాలని భజ్జీ సూచించాడు. 'ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ 2017ను పరిశీలిస్తే ఇంగ్లండ్‌లో వాతావరణం వేడిగా, తేమ ఎక్కువగా ఉంది. అక్కడి పరిస్థితులు అలాగే ఉండి ప్రత్యర్థి జట్టులో ఐదారుగురు కుడిచేతి వాటం ఆటగాళ్లుంటే జడేజాకు అవకాశం ఉంటుంది. జడేజా, పాండ్య ఆరు, ఏడో స్థానాల్లో ఆడాలి. ఇక జడేజా అద్భుతమైన ఫీల్డర్ అన్న సంగతి తెలిసిందే' అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు. 'మణికట్టు స్పిన్నర్లు మూడు రకాలుగా బౌలింగ్ చేస్తారు. లెగ్ బ్రేక్, గూగ్లీ, ఫ్లిప్పర్. వన్డేలో అరుదుగా ఉపయోగించే టాప్ స్పిన్నర్‌ను కలుపుకుంటే నాలుగు అవుతాయి. ఇక ఆఫ్ స్పిన్నర్ విషయానికి వస్తే.. దూస్రా విసరలేకుంటే బౌలర్ ఆఫ్‌బ్రేక్‌లను బ్యాట్స్‌మన్ ముందుగానే అంచనా వేస్తాడు" అని భజ్జీ పేర్కొన్నాడు.

లియాన్‌కు సైతం ఇబ్బందే..

'అందుకే ఆసీస్ స్పిన్నర్ నాథన్ లియాన్ సైతం వన్డేల్లో ఇబ్బంది పడుతున్నాడు. ఇక, క్రీజులో ఉన్న ఆటగాళ్లు మణికట్టు స్పిన్నర్ల చేతి కదలికలను కాకుండా పిచ్ మీద పడిన తర్వాత బంతిని గమనిస్తే చాలా ప్రమాదం. ఈ కనికట్టు తెలియకే విదేశీ ఆటగాళ్లు మణికట్టు స్పిన్నర్లను ఎదుర్కొవడంలో ఇబ్బంది పడుతున్నారు' అని హర్భజన్ చెప్పుకొచ్చాడు.

ఉద్యమాలతోనే ప్రభుత్వంలో కదలిక

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు :
వరికపూడిసెల సాధన కోసం జరుగుతున్న ఉద్యమాలలో సీపీఐ కీలక పాత్ర పోషిస్తుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. వరికపూడిసెల ప్రాజెక్ట్ సాధనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరమ్ (ఏపీజేఎఫ్) ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన దీక్ష జరిగింది. ఏపీజేఎఫ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ శాఖమూరు శ్రీనివాసప్రసాద్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ దీక్షకు సంఘీభావం తెలిపిన ముప్పాళ్ల అనంతరం ప్రసంగించారు. 50 వేల ఎకరాలకు, 2.5లక్షల మంది రైతుల సాగునీటి సమస్యను తీర్చగలిగే ప్రాజెక్ట్ వరికపూడిసెల అనీ, అటువంటి ప్రాజెక్ట్‌ను వెంటనే పూర్తి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దీంతో వివిధ గ్రామాలలోని తాగునీటి సమస్య పరిష్కరంతో పాటు సుమారు 40 చెరువులను నీటితో నింపి లక్షా 20 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చునని తెలిపారు. సమస్యలపై ఉద్యమిస్తేనే ప్రభుత్వంలో కదలిక వస్తుందని ముప్పాళ్ల అన్నారు. ఈ ఉద్యమాన్ని ఏ స్థాయికి తీసుకెళ్లేందుకైనా తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఏపీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చెవుల కృష్ణాంజనేయులు ప్రసంగిస్తూ ఈ ప్రాజెక్ట్ సాధన విషయంలో ఎవరూ నిరుత్సాహానికి గురికావలసిన అవసరం లేదన్నారు. ముఖ్యమంత్రిని కలిసి అనంతరం ఆయన స్పందనను బట్టి కార్యాచరణ రూపొందిస్తే బాగుంటుందని సూచించారు. నాగార్జునసాగర్ కుడికాలువ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ గుంటుపల్లి వీరభుజంగ రాయలు మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ పై ప్రభుత్వానికి చిత్తశుద్ధి వున్నదన్నారు. రైతునేత నల్లబోలు విష్ణుశ్రీ మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ డిమాండు చేస్తూ ఎన్నికలు బహిష్కరిస్తే దేశం దృష్టిని ఆకర్షించవచ్చునన్నారు. వరికపూడిసెల జలసాధన సమితి అధ్యక్షుడు దామెర వెంకట రమణారావు మాట్లాడుతూ పల్నాడు రైతుల పట్ల ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందని విమర్శించారు. సీపీఎం నేత హనుమంత రెడ్డి, సీఐటీయూ నాయకుడు ఆంజనేయ నాయక్, పల్నాడు జలసాధన సమితి అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కాంగ్రెస్ నేత సవరం రోహిత్ మాలమహానాడు నేత గోళ్ల అరుణ్, వినుకొండ న్యాయవాది మూర్తి, నగారాభేరి సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణా నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటా నాయక్ మాట్లాడారు. వరికపూడిసెల ప్రాజెక్ట్ సాధన కోసం జరుగుతున్న ఉద్యమం జిల్లా స్థాయికి విస్తరించింది. రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చేవరకూ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని పల్నాడు రైతాంగం హెచ్చరించింది. ఎగువ పల్నాడులోని మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లిలతోపాటు ప్రకాశం జిల్లా పుల్లలచేరువు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు నిరసన దీక్షలో పాల్గొన్నారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా, విద్యార్థి సంఘాలు ఈ దీక్షకు సంఘీభావం తెలిపాయి. సమావేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీలు, ప్రజా, రైతు సంఘాల నాయకులు ప్రసంగించారు. నాగార్జున విశ్వవిద్యాలయం విద్యార్థి జేఏసీ నాయకులు నిరసన దీక్షకు సంఘీభావం ప్రకటించారు. దీక్ష అనంతరం రైతులు, ఏపీజేఎఫ్ నాయకులు, రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల నాయకులు డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు.



దీక్షలో పాల్గొన్న ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు

ప్రత్యామ్నాయం వైపే ప్రజలు

- ప్రజల తోడ్పాటుతో బీకేఎంయూ జాతీయ మహాసభలు సక్సెస్
- అధికార, ప్రతిపక్ష పార్టీలతో విసిగిన జనం
- ఆహ్వానసంఘం ముగింపు సమావేశంలో కె.నారాయణ



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

విశాలాంధ్ర - తిరుపతి :
రాష్ట్ర ప్రజలు ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ చెప్పారు. టీడీపీ, వైసీపీలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లిందని, ఆ పార్టీలను ప్రజలు నమ్మడం లేదని ఆయన అన్నారు. సీపీఐ, సీపీఎం, జనసేన కూటమికి తటస్థులు అండగా ఉంటారని ఆశాభావం వెలిబుచ్చారు. ప్రజలు, శ్రేయోభిలాషుల సహకారంతో తిరుపతిలో నిర్వహించిన బీకేఎంయూ 14వ జాతీయ మహాసభలు (స్వర్ణోత్సవ సభ) విజయవంతమయ్యాయని ఆహ్వానసంఘం చైర్మన్ కె.నారాయణ అన్నారు. తిరుపతిలోని గంధమనేని శివయ్య భవన్‌లో మహాసభల ఆహ్వానసంఘం ముగింపు సభ పెంచలయ్య అధ్యక్షతన జరిగింది. నారాయణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 750 మంది ప్రతినిధులు పాల్గొన్నారని, జాతీయ నాయకులు విచ్చేసి ప్రసంగించడం సంతోషంగా ఉందన్నారు. పెద్ద ఎత్తున జరిగిన ర్యాలీ తిరుపతి కీర్తిని పెంచాయన్నారు. ప్రతినిధులకు, అతిథులకు, కేరళ మంత్రులకు, మంచి సదుపాయాలు, ఆతిథ్యం ఇవ్వగలిగామని పేర్కొన్నారు. తిరుపతి ప్రజల అండ, శ్రేయోభిలాషుల తోడ్పాటే ఈ మహాసభల విజయానికి కారణమని నారాయణ అన్నారు. మహాసభల నిర్వహణ కోసం పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి నిధి వసూలు చేసిన సమయంలో రాజకీయ స్థితిగతులపై ప్రజల్లో అర్థవంతమైన చర్చలు సాగాయని అన్నారు. దాదాపు 90 శాతం మంది నోట మూడో ప్రత్యామ్నాయం గురించి చేస్తున్న ప్రయత్నానికి సంపూర్ణ మద్దతు వచ్చిందన్నారు. దీనిని బట్టి ఈసారి ఎన్నికల్లో తటస్థ ఓటర్లు రెండు పార్టీలను ఛీ కొట్టడం ఖాయమన్నారు. సీపీఐ, సీపీఎం, జనసేనతో కూడిన మూడో ఫ్రంట్‌కే ప్రజలు బ్రహ్మరథం పడతారని నారాయణ విశ్వాసం వ్యక్తం చేశారు. ఆహ్వానసంఘం ప్రధాన కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ, జాతీయ సమితి ఆదేశాల మేరకు బీకేఎంయూ మహాసభలు దిగ్విజయం చేయగలిగామని పేర్కొన్నారు. మహాసభల నిర్వహణలో నారాయణ సహకారం మరువలేమని అన్నారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.జనార్దన్, పీఎల్.నరసింహులు, ఏఐటీయూసీ కార్యదర్శి పి.మురళి, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి, డీహెచ్‌పీఎస్ కార్యదర్శి ఎస్.నాగరాజన్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు కృష్ణప్ప, నగర కార్యదర్శి విశ్వనాథ్, మహిళా సమాఖ్య కార్యదర్శి నదియా పాల్గొన్నారు.



42 మందికి సంగీత-నాటక అవార్డులు

రాష్ట్రపతిభవన్‌లో అందజేసిన కోవింద్

న్యూఢిల్లీ :
రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బుధవారం 42 మందికి 2017 సంవత్సరానికిగాను సంగీత్, నాటక్ అకాడమీ అవార్డులను ప్రదానం చేశారు. శాస్త్రీయ సంగీతం, నృత్యం, నాటకం, జానపద గేయాలు-నృత్యాలు, తోలుబొమ్మలాట వంటి ఐదు విభాగాల్లో అవార్డులను అందజేశారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేక కార్యాక్రమాన్ని నిర్వహించారు. 10 మంది ప్రముఖ గాయకులు, సంగీక వాయుద్యకారులు, తొమ్మిది మంది నృత్యకళాకారులు, తొమ్మిది మంది థియేటర్ (నాటక) కళాకారులు, సంప్రదాయ కళలకు గణనీయమైన తోడ్పాటును అందించిన మరో 10 మందిని ఈ ప్రతిష్టాత్మక పురస్కారంతో సన్మానించారు. అవార్డు గ్రహీతల్లో లలిత్ జె.రావు (హిందుస్థానీ సంగీతం), ఉమాకాంత్ & రమాకాంత్ గుండెచె (హిందుస్థానీ సంగీతం), యోగేశ్ సంశీ (తబ్లా), రాజేంద్ర ప్రశన్న (షెహనాయి/ఫ్లూట్), ఎంఎస్ షీలా (కర్ణాటక సంగీతం), సుమా సుధీంద్ర (వీణ), తిరువరూర్ వైద్యనాథన్ (మృదంగం), శషాంక్ సుబ్రమణ్యం (ఫ్లూట్), మధురాణి & హైమంతి సుక్లా (సుగమ్ సంగీతం), గుర్నామ్ సింగ్ (గుర్బాని); నృత్యకారులు రమా వైద్యనాథన్ (భరతనాట్యం), శోభా కోసర్ (కథక్), మదంబీ సుబ్రమణ్యన్ (కథకళి), ఎల్‌ఎన్ ఒయినమ్ ఒంగ్బీ ధోని దేవి (మణిపూరి), దీపికా రెడ్డి (కూచిపూడి), సుజాతా మొహపాత్ర (ఒడిస్సీ), రమాకృష్ణ తలుకదార్ (సత్తారియా), జన్మజయ్ సాయిబాబు (ఛౌ), ఆశీత్ దేశాయ్ (మ్యూజిక్ ఫర్ డ్యాన్); నాటకరంగంలో.. అభిరామ్ భడాకామ్కర్ (నాటక రచయిత), సునీల్ షాన్‌భాగ్ (దర్శకత్వం), బప్పీబోస్ (దర్శకత్వం), హేమా సింగ్, దీపక్ తివారీ, అనిల్ టిక్కూ (నటులు), నూరుద్దీన్ అహ్మద్ (స్టేజ్-క్రాఫ్ట్), అవతార్ సహని (లైటింగ్), షాగ్రక్పమ్ హేమంత సింగ్ (షమంగ్ లీలా, మణిపూర్) ఉన్నారు. సంప్రదాయ కళలకు చిరునామాగా నిలిచిన అన్వర్ ఖాన్ మంగనియర్(రాజస్థాన్), రామచంద్ర మాంజీ (బీహార్), పార్వతీ బౌల్ (పశ్చిమ బెంగాల్), సర్వజిత్ కౌర్ (పంజాబ్), కేసీ రన్‌రమ్ సంఘీ (మిజోరం), ముకుంద్ నాయక్ (జార్ఖండ్), ప్రకాశ్ ఖండ్గే (మహారాష్ట్ర), జగన్నాథ్ బయన్ (అసోం), రాకేశ్‌తివారీ (ఛత్తీస్‌గఢ్), సుదీప్‌గుప్తా (తోలుబొమ్మలాట-పశ్చిమబెంగాల్)లను ఈ అవార్డు వరించింది. నృత్యకళకు అందించిన తోడ్పాటుకుగాను సంధ్యా పురెచాను, స్కాలర్‌షిప్పులు అందించినందుకు విజయ్ వర్మను సన్మానించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.